ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం



# వ్యవసాయం

జనవరి, 2024

సంపుటి - 10 సంచిక-01 పేజీలు- 52 వెల : ₹ 20/-

నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలతో...



# ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో గత నెలలో జరిగిన వివిధ కార్యక్రమాల దృశ్యమాలిక




ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పాలెంలో నిర్వహించిన రైతు సదస్సులో ప్రసంగిస్తున్న కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ డా॥ జి.వి. సుబ్బారెడ్డి



పిజి, పిహెచ్‌డి 2023-24లో ప్రవేశం పొందిన మొదటి విద్యార్థినికి ప్రవేశ పత్రాన్ని అందజేస్తున్న విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డా॥ ఎం. వెంకట రమణ



డా॥ బి. ఆర్. అంబేద్కర్ 67వ వర్థంతి సందర్భంగా చిత్రపటానికి పూలదండ వేసి నివాళులర్పిస్తున్న రిజిస్ట్రార్ డా॥ ఎం. వెంకట రమణ



తేనెటీగల పెంపకంపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న రైతులు మరియు యువత




ఏరువాక కేంద్రం, తోర్నాలలో అధిక దిగుబడినిచ్చే కంది రకం డబ్ల్యుఆర్‌జి-255పై నిర్వహించిన క్షేత్ర ప్రదర్శనలో పాల్గొన్న రైతులు మరియు శాస్త్రవేత్తలు



వ్యవసాయ కళాశాల, వరంగల్‌లో వ్యవసాయ విద్యా దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను తిలకిస్తున్న విద్యార్థులు

# వ్యవసాయం

సంక్షిప్త వ్యవసాయ సమాచార మాస పత్రిక

జనవరి 2024
శ్రీ శోభకృత్ నామ సం॥ మార్గశిర బహుళ పంచమి నుండి పుష్య బహుళ పంచమి వరకు



## సంపాదక వర్గం



ప్రధాన సంపాదకులు
డా॥ చల్లా వేణు గోపాల రెడ్డి
ప్రధాన వ్యవసాయ సమాచార అధికారి

సాంకేతిక పర్యవేక్షణ నిపుణులు
డా॥ ఎన్. రామగోపాల వర్మ
ప్రధాన శాస్త్రవేత్త (ఎంటమాలజి)
డా॥ ఎ. వి. రామాంజనేయులు
ప్రధాన శాస్త్రవేత్త (అగ్రో) & హెడ్

పర్యవేక్షణ
డా॥ ఆర్. సునీత దేవి
ప్రధాన శాస్త్రవేత్త (ఎంటమాలజి)



వ్యవసాయ మాస పత్రిక సంవత్సర చందా రూ. 200/- మరియు జీవిత కాలపు (10 సంవత్సరాలు) చందా రూ. 1000/- నగదు రూపంలో లేదా డి.డి. రూపంలో చెల్లించవచ్చు.
డి. డి. అయితే
Principal Agricultural Information Officer, AI&CC and PJTSAU Press
పేరిట తీసి హైదరాబాద్‌లో చెల్లుబాటయ్యే విధంగా పంపించాలి



చిరునామా :
ప్రిన్సిపల్ అగ్రికల్చరల్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్
వ్యవసాయ సమాచార మరియు ప్రసార కేంద్రం
ఎ.ఆర్.ఐ క్యాంపస్, రాజేంద్రనగర్, హైదరాబాద్ - 30.
తెలంగాణ రాష్ట్రం, ఫోన్ నెం. 040-24015380
e-mail : pjtsau.paio@gmail.com
vyavasayam.pjtsau@gmail.com


పాఠక మహాశయులు మాసపత్రిక అభ్యున్నతికి తోడ్పడుటకుగాను తమ అమూల్యమైన సలహాలను సూచనలను అందచేయవలసిందిగా కోరుతున్నాము.

## విషయ సూచిక


1. ఉపకులపతి సందేశం........................................5
2. ఈమాసంలో చేయవలసిన వ్యవసాయ పనులు............... 6
3. వాతావరణం-పంటల పరిస్థితి-విశ్లేషణ..................... 13
4. సాంకేతిక వ్యాసాలు
   - రైతు స్థాయిలో వరివిత్తనోత్పత్తిలో పాటించవలసిన మెళకువలు............................................ 14
   - యాసంగి వరిలో సమగ్ర సస్యరక్షణ-పంటకు ఇచ్చును పూర్తి రక్షణ.................................... 16
   - యాసంగి మొక్కజొన్న సాగులో ప్రస్తుతం ఎదురయ్యే సమస్యలు - నివారణ.......................................... 18
   - నూనె గింజల పంటల పరిస్థితులు -వేరుశనగ సాగుకు అవకాశాలు................................................ 20
   - వేసవికి అనువైన నువ్వుల రకాలు -సాగు యాజమాన్యం............................................ 23
   - తేనెటీగల పెంపకం-ఉపఉత్పత్తులు........................ 26
   - ప్రత్తి పంట తర్వాత వేసవిలో వేసుకోదగ్గ పంటలు......... 28
   - వ్యవసాయ పదవినోదం.................................... 30
   - వ్యవసాయ మార్కెట్ ఇంటలిజెన్స్.......................... 31
   - సుస్థిర వ్యవసాయంలో వానపాముల పాత్ర................ 32
   - పట్టు పురుగుల పెంపకంలో రోగనిరోధక చర్యలు-ఆవశ్యకత................................................ 34
   - జనవరి మాసంలో ఉద్యాన పంటల్లో చేపట్టవలసిన సేద్యపు పనులు............................................ 36
   - కూరగాయ పంటల్లో వైరస్ తెగుళ్ళు-యాజమాన్యం....... 38
   - పసుపు కోత అనంతరం తీసుకోవలసిన జాగ్రత్తలు.........40
   - పనస-పోషక విలువలు, ఆరోగ్య ప్రయోజనాలు మరియు విలువాధారిత ఉత్పత్తులు......................... 42
   - కుందేళ్ళ పెంపకం మరియు వాటి యాజమాన్య పద్ధతులు...................................... 44
5. టి.వి.చానళ్ళలో ప్రత్యక్ష ప్రసారాల ద్వారా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో రైతుల ముఖాముఖి కార్యక్రమాలు...............................................46
6. రైతన్నకో ప్రశ్న...............................................47
7. విశ్వవిద్యాలయ వార్తలు.......................................48
8. రైతు విజయగాథ
   - డ్రం సీడర్‌తో వరి సాగు-రైతు విజయగాథ................. 49

# జనవరి మాసం క్యాలెండర్ - 2024

## శ్రీ శోభకృత్ నామ సం॥ మార్గశిర బహుళ పంచమి నుండి పుష్య బహుళ పంచమి వరకు

| SUN<br>ఆది<br>రాహుకాలం<br>సా. 4.30-6.00 | MON<br>సోమ<br>రాహుకాలం<br>ఉ.7.30-9.00 | TUE<br>మంగళ<br>రాహుకాలం<br>మ.3.00-4.30 | WED<br>బుధ<br>రాహుకాలం<br>మ.12.00-1.30 | THU<br>గురు<br>రాహుకాలం<br>మ.1.30-3.00 | FRI<br>శుక్ర<br>రాహుకాలం<br>ఉ.10.30-12.00 | SAT<br>శని<br>రాహుకాలం<br>ఉ.9.00-10.30 |
|---|---|---|---|---|---|---|
| | 1 మార్గశిర బహుళ పంచమి ప. 12-17<br>మఖ ఉ. 7-17<br>సా.వ. 4-09 ల 5-55 | 2 షష్ఠి ప. 2-29<br>పుబ్బ ఉ. 9-55<br>సా.వ. 5-53 ల 7-39 | 3 సప్తమి సా. 4-35<br>ఉత్తర ప. 12-29<br>రా.వ. 9-42 ల 11-28 | 4 అష్టమి సా. 6-23<br>హస్త ప. 2-48<br>రా.వ. 11-27 ల 1-10 | 5 నవమి రా. 7-49<br>చిత్ర సా. 4-45<br>రా.వ. 10-42 ల 12-24 | 6 దశమి రా. 8-47<br>స్వాతి సా. 6-17<br>రా.వ. 12-07 ల 1-47 |
| 7 ఏకాదశి రా. 9-14<br>విశాఖ రా. 7-19<br>రా.వ. 11-24 ల 1-02 | 8 ద్వాదశి రా. 9-10<br>అనూరాధ రా. 7-52<br>రా.వ. 1-29 ల 3-05 | 9 త్రయోదశి రా. 8-38<br>జ్యేష్ఠ రా. 7-57<br>తె.వ. 3-49 ల 5-24 | 10 చతుర్దశి రా. 7-38<br>మూల రా. 7-35<br>సా.వ. 6-00 ల 7-35<br>తె.వ. 4-52 ల 6-25 | 11 అమావాస్య సా. 6-14<br>పూర్వాషాఢ సా. 6-50<br>రా.వ. 2-27 ల 3-59 | 12 పుష్య శుద్ధ పాడ్యమి సా. 4-30<br>ఉత్తరాషాఢ సా. 5-44<br>రా.వ. 9-30 ల 11-01 | 13 విదియ ప. 2-29<br>శ్రవణం సా. 4-23<br>రా.వ. 8-07 ల 9-37 |
| 14 తదియ ప. 12-18<br>ధనిష్ఠ ప. 2-51<br>రా.వ. 9-33 ల 11-02 | 15 చవితి ఉ. 9-58<br>శతభిషం ప. 1-12<br>రా.వ. 7-08 ల 8-37 | 16 పంచమి ఉ. 7-31<br>షష్ఠి తె. 5-18<br>పూర్వాభాద్ర ప. 11-29<br>రా.వ. 8-27 ల 9-57 | 17 సప్తమి తె. 3-09<br>ఉత్తరాభాద్ర ఉ. 9-55<br>రా.వ 9-11 ల 10-41 | 18 అష్టమి రా. 1-12<br>రేవతి ఉ. 8-28<br>తె.వ. 3-26 ల 4-57 | 19 నవమి రా. 11-33<br>అశ్విని ఉ. 7-14<br>భరణి తె. 6-22<br>సా.వ. 4-29 ల 6-01 | 20 దశమి రా. 10-13<br>కృత్తిక తె. 5-50<br>సా.వ. 6-06 ల 7-39 |
| 21 ఏకాదశి రా. 9-20<br>రోహిణి తె. 5-41<br>రా.వ. 9-43 ల 11-19 | 22 ద్వాదశి రా. 8-52<br>మృగశిర తె. 6-01<br>ఉ.వ. 11-21 ల 12-59 | 23 చతుర్దశి రా. 9-32<br>ఆర్ద్ర ఉ. 6-46<br>రా.వ. 7-26 ల 9-07 | 24 త్రయోదశి రా. 8-57<br>ఆర్ద్ర పూర్తి<br>ప.వ.2-40 ల 4-19 | 25 పూర్ణిమ రా. 10-37<br>పునర్వసు ఉ. 8-07<br>సా.వ. 4-43 ల 6-26 | 26 పుష్య బహుళ పాడ్యమి రా. 12-08<br>పుష్యమి ఉ. 9-56<br>రా.వ. 11-54 ల 1-39 | 27 విదియ రా. 2-01<br>ఆశ్రేష ప. 12-08<br>రా.వ. 1-22 ల 3-07 |
| 28 తదియ తె. 4-07<br>మఖ ప. 2-36<br>రా.వ. 11-28 ల 1-14 | 29 చవితి తె. 6-16<br>పుబ్బ సా. 5-12<br>రా.వ. 1-10 ల 2-56 | 30 పంచమి పూర్తి<br>ఉత్తర రా. 7-47<br>తె.వ. 5-00 ల | 31 పంచమి ఉ. 8-22<br>హస్త రా. 10-08<br>ఉ.శే.వ. 6-45 వ | | | |

**01 నూతన సంవత్సరం**
**15 మకర సంక్రాంతి**
**14 భోగి**
**26 గణతంత్ర దినోత్సవం**
**16 కనుమ**
**25 అజరత్ అలీ జయంతి (ఆర్.ఎ)**

### పూర్వాషాడ-ఉత్తరాషాఢ కార్తెలు (29.12.23 నుండి 23.01.24)

వరి : వరి నాట్లు, డిశంబర్‌లో వరికి కలుపు తీయుట, అంతర కృషి, సస్యరక్షణ.

సజ్జ : వేసవి పంటకు నేల తయారి – విత్తనం వేయుట.

మొక్కజొన్న : ఎరువులు వేయుట, అంతరకృషి.

వేరుశనగ : డిశంబరులో విత్తిన వేరుశనగకు అంతర కృషి, తెలంగాణ ప్రాంతంలో నీటి వసతి క్రింద విత్తుట.

ఆముదం : విత్తుట.

చెఱకు : తెలంగాణ జిల్లాల్లో నాటిన పైరుకు, కార్శి తోటల్లో ఎరువులు వేయుట. ఎక్సాలి పంట వేయుట, సస్యరక్షణ

పప్పు దినుసులు : వరి పొలాలందు (మాగాణిలో) నవంబరు లో వేసిన మినుము, పెసర కోతలు.

పశుగ్రాసాలు : లూసర్న్, బర్సీము కోతలు, వేసవి పశుగ్రాసాల సాగు.

### శ్రవణ కార్తె (24.01.24 నుండి 05.02.24)

వరి : ముందు నాటిన వరికి ఎరువులు వేయుట, సస్యరక్షణ.

జొన్న : రబీ జొన్న కోతలు – వేసవి రకాలను విత్తుట.

పప్పుదినుసులు : ఉలవ కోతలు.

వేరుశనగ : డిశంబరులో విత్తిన పంటకు సస్యరక్షణ

కుసుమ : కోయుట

ధాన్య నిల్వలు : విత్తనాలు నిల్వ చేసుకొనుటలో జాగ్రత్తలు తీసుకొనుట, నిల్వ ఉంచిన ధాన్యానికి పురుగు పట్టకుండా శాస్త్రీయ పద్ధతులను పాటించుట.

# సమతుల పోషకాహారాన్ని తీసుకుందాం... ఆరోగ్య భారతావనిని నిర్మిద్దాం



యం. రఘునందన్ రావు
ఉపకులపతి

ఆరోగ్యమే మహాభాగ్యం అనే నానుడి మనం వింటూనే ఉన్నాం. ఈ సృష్టిలో ఆరోగ్యంతో సమానమైన సిరి ఏదీలేదు అని చెప్పవచ్చు. ఆరోగ్యం అంటే కేవలం శారీరకంగానే కాకుండా మానసికంగాను, సామాజికంగాను శ్రేయస్సుగా ఉండటం. ఆరోగ్యం మనిషి ప్రాథమిక హక్కు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలి. అలాగే ఉండటానికి ప్రయత్నించాలి. సరైన ఆరోగ్యం కోసం సమతులమైన పౌష్టికాహారం, శారీరక మరియు మానసిక వ్యాయామం, ధ్యానం ఎంతగానో ఉపయోగపడుతుంది.

సమతులమైన పౌష్టికాహారం ఆరోగ్యంగా ఉండటంలో కీలక పాత్ర పోషిస్తుందని చెప్పవచ్చు. సమతులమైన ఆహారం అనగా మనం ఒక రోజులో శరీరానికి అవసరమైన పోషకాలను తగినంత మోతాదులో తీసుకోవడం. దానిలో ఉండే వివిధ రకాల తృణధాన్యాలు, పప్పుదినుసులు, పాల ఉత్పత్తులు, మాంసం, పండ్లు, కూరగాయలు, క్రొవ్వు పదార్థాలు శరీరానికి కావాల్సిన పోషకాలను అందించడమే కాకుండా ఊబకాయం, పోషకాహార లోపం మరియు వివిధ దీర్ఘకాల సమస్యల నుండి కాపాడుతాయి. కానీ ప్రస్తుతం ఉన్న ఉరుకుల పరుగుల జీవితంలో సరైన పౌష్టికాహారం తీసుకోనందున వివిధ రకాల పోషకాహార లోపాలు, ఎన్నో దీర్ఘకాలిక సమస్యలు, చిన్న, పెద్ద అన్న వయస్సు తేడా లేకుండా అన్ని వయస్సుల వారిలో కనిపిస్తున్నాయి. కావున రోజు వారీ తీసుకునే ఆహారంలో కొన్ని మార్పులు చేర్పులు చేసి పౌష్టికమైన ఆహారంగా మార్చుకోవచ్చు.

ఆహారంలో పోషక విలువలను పెంచేందుకు అనేక మార్గాలున్నాయి. దానిలో ఒకటి వంట చేసే విధానం. సరైన వంట వండటంలో కొద్దిపాటి మెళకువలు పాటించడం ద్వారా కూడా ఆహారాన్ని మరింత పుష్టికరంగా చేసుకోవచ్చు. ఉదాహరణకు బియ్యం ఎక్కువ సార్లు కడగడం, తరిగిన కూరగాయలను కడగడం ద్వారా 'సి' మరియు 'బి' విటమిన్‌లు లోపిస్తాయి. మరొక సులభతరమైన పద్ధతి ఏమిటి అనగా – స్థానికంగా పండించబడే తక్కువ ఖర్చుతో దొరికే వివిధ ఆహార పదార్థాలను కలిపి వండుకోవడం ద్వారా కూడా పోషక విలువలను పెంపొందించుకోవచ్చు. ఉదాహరణకు ఉదయం తినే అల్పాహారంలో కిచిడి తీసుకున్నట్లైతే దానిలో తృణధాన్యాలు, పప్పుదినుసులు, కూరగాయలు, క్యారెట్, బీన్స్, దుంపలు, కొద్దిగా నూనె మరియు కొన్ని రకాల మసాలా దినుసులతో చేసుకోవడం. అదే విధంగా ఆమ్లెట్స్, నూడుల్స్, ఇడ్లీ, దోస, పరాటాలలో సన్నగా తరిగిన కూరగాయలను చేర్చడం ద్వారా అన్ని రకాల పోషకాలు మరియు యాంటిఆక్సిడెంట్లు లభిస్తాయి. మనం రోజు తీసుకునే పెసర్లు, శనగలు వంటి మొదలైన పప్పుదినుసులు మొలకెత్తించి తీసుకోవడం ద్వారా బి-కాంప్లెక్స్ విటమిన్లు, విటమిన్-సి, మాంసకృత్తులు, జింకు మరియు ఐరన్ వంటి పోషకాలు శరీరానికి మరింతగా లభిస్తాయి. పెరటి తోటలో పెంచే తాజా పండ్లు, కూరగాయలు ఇంటి కళను పెంచడమేకాకుండా కుటుంబానికి అవసరమైన పోషకాలు అందిస్తాయి. మన ఆహారంలో వివిధ రకాల పదార్థాలను చేర్చి వైవిధ్యం కలిగించడం ద్వారా సూక్ష్మపోషకాల లోపాన్ని అదుపు చేయవచ్చు.

ప్రస్తుతం అన్ని వయస్సుల వారిలో కనిపిస్తున్న వివిధ రకాల పోషకాహార లోపాలను దృష్టిలో పెట్టుకొని భారత ప్రభుత్వం ఎన్నో రకాల పథకాలను అమలులోకి తీసుకొచ్చింది. దానిలో భాగంగా మనం నిత్యావసరంగా తీసుకునే ఆహార పదార్థాలను వివిధ రకాల విటమిన్లు మరియు మినరల్స్‌తో ఫోర్టిఫికేషన్ చేయడం ద్వారా ఆహార నాణ్యతను మెరుగుపరచి సూక్ష్మ పోషకాల లోపాలను నివారిస్తున్నారు.

మన విశ్వవిద్యాలయంలో పోషక గని అయిన చిరుధాన్యాల విలువాధారిత ఉత్పత్తులను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో రాజేంద్రనగర్‌లో ఇటీవల "కామన్ ఇంక్యుబేషన్ సెంటర్ ఫర్ మిల్లెట్స్" కేంద్రంను స్థాపించడం జరిగింది. ఇక్కడ రైతులకు, యువతకు మరియు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు చిరుధాన్యాల విలువాధారిత ఉత్పత్తులను తయారు చేయుటకు కావల్సిన సాంకేతిక పరిజ్ఞానం, సూచనలు మరియు సలహాలు అందజేయటం జరుగుతుంది. అలాగే కృషి విజ్ఞాన కేంద్రాలలోని పోషకాహార నిపుణుల ద్వారా పోషకాహార అవసరాన్ని మహిళలకు తెలిపే విధంగా శిక్షణా కార్యక్రమాలను చేపడుతున్నాము. కావున ప్రతి ఒక్కరు పోషకాహార ఆవశ్యకతను గుర్తించి సమతుల పోషకాహారాన్ని తీసుకుంటూ మన దేశాన్ని ఆరోగ్య భారతావనిగా మారుస్తారని ఆశిస్తూ...



(యం. రఘునందన్ రావు)
ఉపకులపతి



# వరి

1. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా యాసంగి వరి పంట నారుమడి దశలో, నాట్లు వేసే దశలో లేదా పిలక వేసే దశలో ఉంది. తెలంగాణ రాష్ట్రంలో యాసంగిలో వరి నాట్లు ఆలస్యం చేసినట్లైతే ఏప్రిల్ మాసంలో ఉండే ఎండ తీవ్రత వలన నీటి లభ్యత తగ్గడమే కాకుండా నూకశాతం పెరుగుతుంది. కావున యాసంగిలో వరినాట్లు అవకాశం ఉన్న మేరకు డిసెంబర్ మాసంలోనే పూర్తి చేయాలి.

2. చవుడు భూములలో, చలి వలన నారుమడిలో మరియు ప్రధాన పొలంలో, పెరుగుదల లేకపోవడం వల్ల మొక్కలు పసుపు వర్ణంలోకి మారడం మరియు చవుడు, చలి ఎక్కువగా ఉన్నప్పుడు మొక్కలు చనిపోవడం జరుగుతుంది. కావున చలిని మరియు చవుడును యాసంగిలో అధిగమించే ప్రయత్నం చేయాలి.

3. నవంబర్ ఆఖరి వారం నుండి సంక్రాంతి వరకు చలి ప్రభావం ఎక్కువగా ఉండడం వలన సహజంగానే పెరుగుదల తక్కువగా ఉంటుంది. తాత్కాలికంగా వరి పసుపు వర్ణములోకి మారుతుంది. సంక్రాంతి తరువాత, ఉష్ణోగ్రతలు క్రమంగా పెరగడం వలన వరి సహజంగానే పెరుగుదల అందుకొని సాధారణ స్థితికి చేరుకుంటుంది.

4. రాష్ట్రంలో చలి తీవ్రత ఎక్కువగా ఉండటం వలన ప్రస్తుతం నార్లు ఎర్రబడటం, ఎదుగుదల క్షీణించడం, పిలకలు వేయకపోవడం జరుగుతోంది. నార్లుపోసే ముందు, 2 గుంటల నారుమడికి 2 క్వింటాళ్ళ కోళ్ళ ఎరువు లేదా గొర్రెల ఎరువు లేదా వర్మికంపోస్టు వేసుకోవాలి.

5. చలి తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు నారుమడిపై ప్లాస్టిక్ షీట్‌లను లేదా పాలివూవెన్ సంచులతో కుట్టిన పట్టాలను కప్పి మరుసటి రోజు ఉదయాన్నే తీసివేయాలి. అలాగే రాత్రి పూట నారుమడిలో నీటిని నిలువ ఉంచి మరుసటి రోజు ఉదయాన్నే తీసివేసి క్రొత్త నీరు పెడుతూ ఉండాలి.

6. నారుమడిలో కలుపు ఎక్కువగా ఉంటే నాటిన 15-20 రోజులకు లీటరు నీటికి 2 మి.లీ. సైహలోఫాప్ బ్యుటైల్ లేదా 0.5 మి.లీ. బిస్‌పైరిబాక్ సోడియం మందులను పిచికారి చేసుకోవాలి.

7. యాసంగిలో కాండం తొలుచు పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటుంది. నివారణకు ప్రతి 2 గుంటల నారుమడికి 800 గ్రా. కార్బోఫ్యూరాన్ 3 సిజి గుళికలు నారు నాటటానికి వారం రోజుల ముందు వేసుకోవాలి.

8. 30 రోజులలోపు నారును ప్రధాన పొలంలో నాటుకోవాలి. ప్రధాన పొలానికి సుమారు 10-12 రోజులు నీరు పెట్టి మురగదమ్ము చేసుకొని ఎకరానికి 30 కి. యూరియా, 50 కి డిఎపి మరియు 15 కి. మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులను ఆఖరి దుక్కిలో వేయాలి. పూర్తిగా మురగని ప్రధాన పొలంలో నాట్లు వేసినట్లైతే, వరి ఎర్ర బారడము లేదా చనిపోవడం జరుగుతుంది.

9. యాసంగిలో జింకు ధాతు లోపం ఎక్కువగా ఉంటుంది. నారుమడిలో జింకు ధాతు లోప లక్షణాలు గమనించినట్లైతే జింక్ సల్ఫేట్ 2 గ్రా. ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. అలాగే ప్రధాన పొలంలో ఎకరానికి 20 కిలోల జింకు సల్ఫేట్ భాస్వరం ఎరువులతో కలువకుండా దుక్కిలో వేసుకోవాలి. చౌడు సమస్య ఉన్న భూములలో తప్పని సరిగా సేంద్రియ ఎరువులు వేసుకోవాలి.

10. ప్రధాన పొలంలో మొక్కలు కాండం కుళ్ళుతో చనిపోవడం గమనించినట్లైతే ఎకరానికి 30-35 కిలోల యూరియాకు కార్బండాజిమ్ + మ్యాంకోజెబ్ మిశ్రమ శిలీంధ్రానాశినిని 100 గ్రా. కలిపి బురద పదునులో చల్లుకోవాలి.



11. నారుమడి మరియు ప్రధాన పొలంలో అగ్గితెగులు (ఆకుమచ్చ దశ) గమనించినట్లైతే తొలిదశలో ఐసోప్రోథయోలేన్ 1.5 మి.లీ. లేదా ట్రైసైక్లోజోల్ + మ్యాంకోజెబ్ 2.5 గ్రా. లేదా కాసుగామైసిన్ 2.5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**డా॥ సిహెచ్. దామోదర్ రాజు, ప్రధాన శాస్త్రవేత్త (వరి) & హెడ్, వరి పరిశోధన సంస్థ, రాజేంద్రనగర్, హైదరాబాద్, ఫోన్ నెం. 9440225385**

## మొక్కజొన్న

- అక్టోబర్ మాసంలో విత్తుకున్న యాసంగి మొక్కజొన్న పూత దశ నుండి గింజ పాలు పోసుకునే దశలో ఉంది. కావున పక్షుల బెడద నుండి పంటను కాపాడుకోవడానికి శబ్దపరికరాలను ఉపయోగించవచ్చు లేదా మెరిసే రిబ్బన్లను పైరుకు ఒక అడుగు ఎత్తులో ఉత్తర దక్షిణ దిశల్లో కట్టాలి లేదా పైరు చుట్టూ 2-3 వరుసలలో కండే ప్రక్కనున్న ఆకులతో చుట్టాలి.
- పైరు 60-65 రోజుల దశలో ఉన్నప్పుడు చివరి దఫా నత్రజని ఎరువు, అనగా ఎకరాకు 50 కిలోల యూరియా తో పాటు 25 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ పైపాటుగా వేయాలి.
- పూతదశకు ముందు, పూతదశలో మరియు గింజ పాలుపోసుకునే దశలో పైరుకు తప్పనిసరిగా నేల స్వభావము ను బట్టి 10-15 రోజుల వ్యవధిలో నీటితడులు ఇవ్వవలెను. లేకపోతే దిగుబడి తగ్గుతుంది.
- ఆలస్యంగా విత్తుకున్న మొక్కజొన్న పంటలో తొలిదశ కత్తెర పురుగు లార్వా నివారణకు ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రా. లేదా స్పెనోటోరమ్ 0.5 మి.లీ. లీటరు నీటికి కలిపి మొక్క సుడులు తడిచేటట్లు పిచికారి చేయాలి. కత్తెర పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నచో ఎదిగిన లార్వాల నివారణకు మొక్కసుడిలో విషపు ఎరను సాయంకాలం వేయాలి.
- పూత అనంతర దశలో కాండం కుళ్ళు తెగులు ఆశించు ప్రాంతాల్లో పూతదశ నుండి పైరు బెట్టకు గురి కాకుండా చూడవలెను. ఆకుమాడు/ఆకు ఎండు తెగుళ్ళు లేదా త్రుప్పు తెగులు ఆశించినచో మ్యాంకోజెబ్ 2.5 గ్రా. చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. పొడ తెగులు లక్షణాలు గమనించినచో ప్రొపికొనజోల్ ఒక మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేసి నివారించుకోవచ్చు.

## చిరుధాన్యాలు

**యాసంగి జొన్న:** యాసంగి జొన్న పంట ప్రస్తుతం శాఖీయ దశ నుండి కంకి వెలువడే దశలో ఉంది. ఈ పంటను ప్రస్తుతం కాండం తొలిచే పురుగు మరియు కత్తెర పురుగు ఆశించవచ్చు. కాండం తొలుచు పురుగు నివారణకు కార్బోఫ్యూరాన్ 3సిజి గుళికలు 4-5 కిలోలు కాండపు సుడులలో వేసుకోవాలి. కత్తెర పురుగు యాజమాన్యానికి క్లోరాంట్రానిలిప్రోల్ 0.4 మి.లీ. ఒక లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

**సజ్జ:** వేసవి సజ్జను జనవరి-ఫిబ్రవరి నెలల్లో విత్తుకోవాలి. ఎకరానికి 2 కిలోల విత్తనం సరిపోతుంది. వెర్రి కంకి తెగులు సోకకుండా 1 కిలో విత్తనానికి 6 గ్రా. మెటలాక్సిల్ లేదా 3 గ్రా. థైరమ్‌తో విత్తనశుద్ధి చేసుకోవాలి. విత్తిన 2 రోజులలోపు కలుపు నివారణ కోసం అట్రాజిన్ మందును 1 కిలో 200 లీటర్ల నీటితో కలిపి తడి నేలపై పిచికారి చేయాలి. విత్తిన 20 రోజులలోపు ఒత్తు మొక్కలను తీసివేసి గుంటకతో అంతర సేద్యం చేయాలి. ఎరువులను 36:16:16 నిష్పత్తిలో ఎన్:పి:కె లను వాడాలి. నవంబర్‌లో విత్తిన పంట ప్రస్తుతం గింజ పాలు పోసుకునే దశలో



ఉంటుంది. మొక్క కీలక దశలలో నీటితడుల ద్వారా మంచి దిగుబడులను సాధించవచ్చు. తెగుళ్ళ నివారణ కోసం కార్బండాజిమ్ 1 గ్రా.లీ. లేదా మ్యాంకోజెబ్ 2.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**రాగి:** వేసవి రాగిని జనవరి మాసంలో విత్తుకోవాలి. ఎకరానికి 2 కిలోలు విత్తనం సరిపోతుంది. కిలో విత్తనానికి 2 గ్రా. కార్బండాజిమ్ వేయాలి.

**కొర్ర:** వేసవి కొర్రను జనవరి మాసంలో విత్తుకోవాలి. ఎకరానికి 2 కిలోలు విత్తనం సరిపోతుంది. కిలో విత్తనానికి 2 గ్రా. కార్బండాజిమ్ వేయాలి.

**డా॥ యం. వి. నగేష్ కుమార్, ప్రధాన శాస్త్రవేత్త (మొక్కజొన్న మరియు చిరుధాన్యాలు) & హెడ్ మొక్కజొన్న పరిశోధన స్థానం, రాజేంద్రనగర్, హైదరాబాద్, ఫోన్ నెం. 8008404874**

## వేరుశనగ

- యాసంగిలో విత్తుకున్న వేరుశనగ ప్రస్తుతం 60-70 రోజుల దశలో ఉన్నది. ఈ సమయంలో నేలలో తేమని బట్టి ప్రతి 8-10 రోజుల కొకసారి నీటి తడులు ఇవ్వాలి.
- ఈ దశలో పొగాకు లద్దెపురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నట్లైతే, ఈ పురుగు నివారణకు నొవాల్యురాన్ 200 మి.లీ. లేదా ఫ్లూబెండమైడ్ 40 మి.లీ. ఎకరాకు సరిపోయేలా 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి. ఉధృతి తీవ్రంగా ఉన్నప్పుడు విషపు ఎర (వరి తవుడు 5 కిలోలు + బెల్లం అర కిలో + మోనోక్రోటోఫాస్ 500 మి.లీ.) చేసుకొని చిన్న చిన్న ఉండలుగా చేసి పొలంలో సాయంత్రం వేళ చల్లుకోవాలి.
- ఈ మాసంలో చలి ఎక్కువగా ఉంటుంది. కాబట్టి ఇనుపధాతు లోపం ఏర్పడే అవకాశం ఉంది. లేత ఆకులు పసుపు పచ్చగాను తర్వాత తెలుపు రంగుకు మారుతాయి. ఈ లోపాన్ని అధిగమించుటకు ఎకరాకు 1 కిలో అన్నభేధి మరియు 200 గ్రా. సిట్రిక్ ఆమ్లం 200 లీటర్లు నీటిలో కలిపి రెండు సార్లు పిచికారి చేసుకోవాలి.
- ఈ దశలో ఆలస్యంగా వచ్చే తిక్కా ఆకుమచ్చ మరియు కాండం కుళ్ళు తెగుళ్ళు ఎక్కువగా పంటనాశిస్తాయి. ఆకుమచ్చ తెగులు నివారణకు ఎకరానికి 200 మి.లీ. టెబ్యుకొనజోల్ లేదా 400 గ్రా. క్లోరోథలోనిల్ 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి. కాండం కుళ్ళు తెగులు నివారణకు హెక్సాకొనజోల్ 400 మి.లీ. చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి మొక్క మొదళ్ళు తడిచేటట్లు పిచికారి చేసుకోవాలి.

## ఆముదం

- వానాకాలం వేసిన పంట ప్రస్తుతం చివరికోత దశలో ఉంది. పక్వానికి వచ్చిన గెలలను కోసి, ఎండబెట్టుకొని, ఎండిన తర్వాత కర్రలతో లేదా త్రెషర్స్ సహాయంతో విత్తనాన్ని వేరు చేసుకోవాలి. యాసంగిలో సాగు చేసిన పంట 40-50 రోజుల దశలో ఉన్నప్పుడు పైపాటుగా 15 కిలోల యూరియాను నేలలో తేమ ఉన్నప్పుడు వేసుకోవాలి. యాసంగిలో సాగు చేసిన ఆముదంలో రసం పీల్చు పురుగుల ఉధృతి ఎక్కువగా ఉంటుంది. వీటి నివారణకు 2 మి.లీ. ప్రొఫెనోఫాస్ లేదా 0.2 గ్రా. ఎసిటామిప్రిడ్ లేదా 1.5 గ్రా. ఎసిఫేట్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. లద్దె పురుగు పంటను ఆశించినట్లైతే లీటరు నీటికి 1.0 మి.లీ. నొవాల్యురాన్ కలిపి పిచికారి చేసుకోవాలి. కాయతొలుచు పురుగు నివారణకు ప్రొఫెనోఫాస్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.



## ప్రొద్దుతిరుగుడు

- నీటి వసతి ఉన్నప్పుడు వేసవి పంటగా ప్రొద్దుతిరుగుడుని జనవరి రెండవ పక్షం నుండి ఫిబ్రవరి మొదటి పక్షం వరకు విత్తుకోవచ్చు. ప్రస్తుతం యాసంగిలో సాగు చేసిన పంట పూత దశలో ఉంది. ఈ దశలో పంటలో తేనెటీగల సంఖ్య తక్కువగా ఉన్నట్లైతే ఉదయం 8 నుండి 11 గంటల మధ్య సున్నితమైన గుడ్డతో వలయాకారంగా రుద్దాలి. ఈవిధంగా 15 రోజుల పాటు చేసినట్లైతే గింజ బాగా కడుతుంది. శనగపచ్చ పురుగు ఆశించినట్లైతే 1 గ్రా. థయోడికార్బ్ లీటరు నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి. త్రుప్పు తెగులు నివారణకు 2.5 గ్రా. మ్యాంకోజెబ్ లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. పక్షుల బెడద ఉన్నట్లైతే మెరుపు రిబ్బన్లను పంటకు పైన అడుగు ఎత్తులో సూర్యరశ్మి తాకేట్లు ఉత్తర-దక్షిణ దిశల్లో కట్టుకోవాలి. పువ్వు వెనుక భాగం నిమ్మ పండు రంగుకు మారినప్పుడు పంటను కోయవలెను. కోసిన తర్వాత 2-3 రోజుల వరకు ఆరనిచ్చి నూర్పిడి యంత్రం సహాయంతో విత్తనాన్ని వేరుచేసుకోవాలి.

## నువ్వులు

- వేసవి పంటగా నువ్వులను జనవరి రెండవ పక్షంలో విత్తుకోవచ్చు. శ్వేత, జగిత్యాల తిల్-1 (జె.సి.ఎస్-1020), జగిత్యాల తిల్-2 (జె.సి.ఎస్-2454), హిమ, చందన రకాలలో దేనినైనా ఎన్నుకొని వేసవిలో సాగు చేయవచ్చు. ఎకరానికి 2.5 కిలోల విత్తనాన్ని తీసుకొని, 2.0 మి.లీ. ఇమిడాక్లోప్రిడ్ కిలో విత్తనానికి చొప్పున కలిపి విత్తనశుద్ధి చేసుకొని విత్తుకోవాలి. వరుసల మధ్య 30 సెం.మీ. మరియు మొక్కల మధ్య 15 సెం.మీ. దూరం ఉండేటట్లు సాళ్ళలో విత్తుకోవాలి. విత్తుకునే సమయంలో ఎకరానికి 15 కిలోల నత్రజని, 8 కిలోల పొటాష్ మరియు 8 కిలోల భాస్వరాన్నిచ్చే ఎరువులు వేసుకోవాలి.

## కుసుమ

- ఈ మాసంలో కుసుమ పూత దశలో ఉంటుంది. ఈ దశలో పేనుబంక ఆశించే అవకాశం ఎక్కువ. నివారణకు డైమిథోయేట్ 2 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. లీటరు నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి. శనగ పంటకు దగ్గరలో కుసుమ పంట వేసుకున్నట్లైతే శనగపచ్చ పురుగు ఆశించే అవకాశాలు ఉన్నాయి. దాని నివారణకు 2.5 మి.లీ. క్లోరోపైరిఫాస్ 25 ఇసి లేదా 0.4 గ్రా. ఇమామెక్టిన్ బెంజోయేట్ లీటరు నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి. జనవరి మాసంలో ఆకాశం మేఘావృతమై వాతావరణంలో తేమ 70% కంటే ఎక్కువగా ఉన్నప్పుడు పంటపై ఆకుమచ్చ తెగులు ఆశించే అవకాశాలు ఉన్నాయి. ఆకులపై గోధుమ వర్ణంలో గుండ్రటి మచ్చలు గమనించినట్లైతే 2.5 గ్రా. మ్యాంకోజెబ్ లీటరు నీటికి కలిపి ఒకసారి మరియు 7-10 రోజుల వ్యవధిలో రెండవసారి పిచికారి చేసుకోవాలి.

డా॥ యస్. వాణిశ్రీ, ప్రధాన శాస్త్రవేత్త (నూనె గింజలు), ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పాలెం, ఫోన్ నెం.8186945838

## అపరాలు

**కంది**

**సస్యరక్షణ:** మన రాష్ట్రంలో కంది పంట పూత, కాయ దశలో ఉన్నది. ఈ పంటను కొన్ని ప్రాంతాలలో శనగ పచ్చ పురుగు మరియు మారుకా మచ్చల పురుగు ఎక్కువగా ఆశించుట గమనించటమైనది. ఈ పురుగుల నివారణకు నొవాల్యూరాన్ 1.0 మి.లీ. లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రా. లేదా ఫ్లూబెండమైడ్ 0.2 మి.లీ. లేదా స్పైనోసాడ్ 0.3 మి.లీ. లేదా ఇండాక్సాకార్బ్ 0.75 మి.లీ. ఒక లీటరు నీటికి కలిపి 10 రోజుల వ్యవధిలో 2-3 సార్లు పురుగు మందులు మార్చి మార్చి పిచికారి చేసి నివారించుకోవచ్చు.

- గత రెండు సంవత్సరాల నుండి పిందె, కాయ దశలో కాయ ఈగ ఉధృతి కూడా ఎక్కువగా ఉండటం గమనించడమైనది.



కాయ ఈగ ఆశించినప్పుడు నష్టం బయటకు కనిపించదు. కావున పిందె దశలో 5% వేప గింజల కషాయం పిచికారి చేసినట్లైతే తల్లి పురుగు గ్రుడ్లు పెట్టకుండా నివారించుకోవచ్చు. పిందె దశలో థయాక్లోప్రిడ్ 0.7 మి.లీ. లేదా డైమిథోయేట్ 2.0 మి.లీ. లేదా ప్రొఫెనోఫాస్ 2.0 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

- కొన్ని ప్రాంతాలలో వెర్రి తెగులు గమనించడం జరిగింది. ఇది ఇరియోఫిడ్ నల్లి ద్వారా వ్యాప్తి చెందే వైరస్ తెగులు. ఇది ఆశించిన మొక్క ఆకుల మీద ఆకుపచ్చ. పసుపు వర్ణపు మచ్చలు ఏర్పడి మొక్కలకు పూత, కాయ ఏర్పడదు. నల్లి నివారణకు నీటిలో కరిగే గంధకం 3 గ్రా. లేదా స్పైరోమెసిఫెన్ 1 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**యాసంగి కంది:** యాసంగిలో విత్తిన కంది పూత దశ నుండి చిరు పిందె దశలో ఉంది. దీనికి శనగపచ్చ పురుగు ఆశించవచ్చును. నివారణకై స్పైనోశాడ్ 0.4 మి.లీ. లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రా. లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.3 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

- పంట బెట్టకు గురికాకుండా మొగ్గ దశలో, చిరు పిందె దశలో, గింజ కట్టే దశలో తప్పనిసరిగా నీటి తడులు ఇవ్వవలెను. నేల స్వభావాన్ని బట్టి 7-10 రోజుల వ్యవధిలో కీలకదశల్లో నీరు అందించినచో దిగుబడి పెరుగుతుంది.

**శనగ:** కొన్ని ప్రాంతాలలో శనగ శాఖీయ దశలోనూ, మరికొన్ని ప్రాంతాలలో పూత మరియు కాయ దశలోనూ ఉంది. శాఖీయ పెరుగుదల దశలో పచ్చ రబ్బరు పురుగు, పూత, పిందె దశలలో శనగపచ్చ పురుగు ఆశించి నష్టం కలుగచేస్తుంది.

**శనగ పచ్చ పురుగు:** ఈ పురుగు కాయ దశలో ఎక్కువగా ఆశిస్తుంది. కాయలపై గుండ్రటి రంధ్రాలను చేసి తల లోపలికి పెట్టి గింజలను తినివేసి అధిక నష్టం కలుగచేస్తుంది. దీని నివారణకు సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించాలి. రసాయనిక మందులైన క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా క్వినాల్ఫాస్ 2.0 మి.లీ. లేదా థయోడికార్బ్ 1.5 గ్రా. లేదా స్పైనోసాడ్ 0.40 మి.లీ. ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**త్రుప్పు తెగులు:** పైరు పక్వానికి వచ్చే దశలో ఆకులపై గుండ్రటి పొక్కులు ఏర్పడి తీవ్రమైతే మొక్కలు పక్వానికి రాకముందే ఎండిపోతాయి. నివారణకు హెక్సాకొనజోల్ 2.0 మి.లీ. లేదా ప్రొపికొనజోల్ 1.0 మి.లీ. లేదా ట్రైఫ్లోక్సీస్ట్రోబిన్ + టెబ్యుకొనజోల్ 0.8 గ్రా. ఒక లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలి.

- ఆలస్యంగా విత్తిన శనగ పంటలో ప్రతి 7-10 రోజుల వ్యవధిలో 2% డి.ఎ.పి ద్రావణం (20 గ్రా. లీటరు నీటికి చొప్పున) పిచికారి చేసినచో శాఖీయంగా ఎదుగుదలకు తోడ్పడి పూత, కాయ నిల్చి మంచి దిగుబడులు సాధించడానికి తోడ్పడుతుంది.

**యాసంగి పెసర/మినుము సస్యరక్షణ:**

**తెల్లదోమ:** ఈ పురుగులు ఆకులలోని రసాన్ని పీల్చడమేగాక పల్లాకు తెగులును కూడా వ్యాపింపచేస్తాయి. తెల్లదోమ నివారణకు ఎసిఫేట్ 1.0 గ్రా. లేదా ప్రొఫెనోఫాస్ 1.5 మి.లీ. లేదా డైమిథోయేట్ 2.0 మి.లీ. లీటరు నీటిలో కలుపుకొని పిచికారి చేయవలెను.

**తామర పురుగులు:** ఈ పురుగు పైరు తొలి దశలో ఎక్కువగా ఆశించి ఆకులలో రసాన్ని పీల్చి నష్టాన్ని కలుగచేయటమే కాకుండా ఆకు ముడత అనే వైరస్ వ్యాధిని వ్యాపింపచేస్తాయి. తామర పురుగు నివారణకు ఎసిఫేట్ 1 గ్రా. లేదా ఫిప్రోనిల్ 2.0 మి.లీ లేదా డైమిథోయేట్ 2.0 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**మారుకా మచ్చల పురుగు:** పూత, పిందె దశలో ఉన్న పంటను 'మారుక' గూడు పురుగు ఆశించే అవకాశం ఉంది. పంటలో 35 రోజుల వయసులో వేప సంబంధిత మందులు (వేప నూనె/వేప గింజల కషాయం) పిచికారి చేసినట్లైతే రెక్కల పురుగులు గ్రుడ్లు పెట్టకుండా నివారించవచ్చు. పూత సమయంలో క్లోరిపైరిఫాస్



2.5 మి.లీ. లేదా క్వినాల్‌ఫాస్ 2.0 మి.లీ. లేదా ఎసిఫేట్ 1 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. పైరులో గూళ్ళు ఎక్కువగా ఉన్నట్లైతే క్లోరాంట్రానిలిప్రోల్ 20 ఎస్.సి 0.3 మి.లీ. లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవచ్చు. అవసరమైతే పురుగుల ఉధృతిని బట్టి 7 నుండి 10 రోజుల వ్యవధిలో మందులను మార్చి మార్చి పిచికారి చేయాలి.

**తెగుళ్ళ యాజమాన్యం:** సాధారణంగా కొరినోస్పోరా ఆకుమచ్చ తెగులు, బూడిద, త్రుప్పు మరియు సెర్కోస్పోరా ఆకుమచ్చ తెగుళ్ళు ఆశిస్తాయి. వీటిని సమర్థవంతంగా అరికట్టటానికి పైరు 30-35 రోజుల దశలో 1 మి.లీ. ప్రొపికొనజోల్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. వైరస్ తెగుళ్ళ నివారణకు సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించాలి. పల్లాకు తెగులు, ఆశించిన మొక్కలను తొలిదశలోనే గమనించి, పీకి వేసి, తెగులు వ్యాప్తికి కారకాలైన రసం పీల్చు పురుగులను నివారించాలి.

**వేసవి అపరాలు:** నీటి పారుదల క్రింద 3-4 తడులిచ్చే అవకాశమున్నచో వేసవిలో తేలికపాటి, మధ్యస్థ నేలల్లో పెసర, బరువైన నల్లరేగడి భూముల్లో మినుము సాగు చేయవచ్చును.

**సిఫార్సు చేయబడిన పెసర రకాలు:** యమ్‌జిజి-385, డబ్ల్యుజిజి -37, డబ్ల్యుజిజి-42, యమ్‌జిజి-351, టియమ్ 90-2.

**డా॥ కె. రుక్మిణి దేవి, ప్రధాన శాస్త్రవేత్త (అపరాలు) & హెడ్, వ్యవసాయ పరిశోధన స్థానం, మధిర, ఫోన్ నెం. 7675050041**

## ప్రత్తి

- ప్రస్తుతం చాలా చోట్ల ప్రత్తి చేన్లు ఆఖరి ప్రత్తి తీత దశలో ఉన్నాయి.
- తీసిన ప్రత్తిని పట్టాలపై నీడలో 8 శాతం తేమ వచ్చే వరకు ఆరబెట్టి అమ్మినట్లైతే మార్కెట్‌లో మంచి రేటు వస్తుంది.
- గులాబి రంగు పురుగు వచ్చే సంవత్సరం వేసే ప్రత్తి పంటను ఆశించకుండా ఉండాలంటే ఈ క్రింది సూచనలను విధిగా పాటించాలి.
- ప్రత్తి చేను (ప్రత్తి కట్టెను) రోటవేటర్ లేదా ష్రెడ్డర్‌తో భూమిలో కలియదున్నాలి. తద్వారా నేల సారవంతమవుతుంది మరియు నేలలో సేంద్రియ కర్బన శాతం పెరుగుతుంది. గులాబి రంగు పురుగు కోశస్థదశ నశిస్తుంది.
- ప్రత్తి ఏరిన చేనులలో గొర్రెలను లేదా పశువులను మేపాలి.
- గులాబి రంగు ఆశించిన ప్రత్తిని ఎక్కువ రోజులు నిల్వ చేయకుండా త్వరగా అమ్మి వేయాలి.
- ప్రత్తి జిన్నింగ్ మిల్లులలోపల, బయట గులాబి రంగు ఆశించిన ప్రత్తి గింజలు లేకుండా చూసుకోవాలి.
- నీటి వసతి ఉన్నచోట ప్రత్తి అడుగులో పెసర, మినుము, నువ్వులు, బొబ్బర లేదా కూరగాయ పంటలను జనవరి 2వ పక్షం నుండి సాగు చేసుకోవచ్చు.

**డా॥ జి. వీరన్న, ప్రధాన శాస్త్రవేత్త, (ప్రత్తి), ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, వరంగల్, ఫోన్ నెం. 9908033309**

## చెఱకు

- జనవరి మాసంలో చెఱకును నాటుటకు నేలను అనువుగా తయారు చేసుకోవాలి. ముందుగా నేలను లోతు దుక్కి చేసుకోవాలి. దీని వల్ల వేరు మండలం బాగా విస్తరించి పంట ఎదుగుదలకు అనుకూలంగా ఉంటుంది. ఆ తర్వాత పశువుల ఎరువు లేదా కంపోస్ట్ ఎరువులను ఎకరానికి 10 టన్నుల చొప్పున వేసి చెఱకును నాటుటకు 4 నుండి 6 వారాల ముందు పళ్ళెపు దంతితో భూమిలో కలియదున్నాలి.
- ఆలస్యంగా నాటుకునే రైతులు నీటి ఎద్దడిని తట్టుకునే రకాలైన 83 ఆర్ 23, 85 ఆర్ 186, కో 86032, కో విఎస్ఐ 12121,



93 వి 297, 2003 వి 46 వంటి రకాలను ఎంపిక చేసుకోవాలి. ఎటువంటి చీడపీడలు, తెగుళ్ళు ఆశించనటువంటి ఆరోగ్యకరమైన, నాణ్యమైన విత్తనాన్ని ఎంపిక చేసుకొని నాటుకోవాలి.

- కార్శి తోటల సాగులో మేలైన యాజమాన్య పద్ధతులను పాటించకపోవటం వలన కార్శితోటలలో సగటు చెఱకు దిగుబడులు పెరగకపోవటం ప్రధాన కారణం. అందువలన చెఱకు సాగు చేసే రైతులు వివిధ రకాల ఎంపిక నుండి మొక్క తోటలను సకాలంలో నరకటం వరకు జాగ్రత్త వహించాల్సి ఉంటుంది.
- చెఱకును నరికిన తరువాత కార్శి చేయటం వలన విత్తనపు ఖర్చుతో పాటు పొలం తయారీ ఖర్చు తగ్గి చెఱకు సాగులో ఎంతో లాభం చేకూరుతుంది. దిగుబడుల విషయంలో మొక్క తోటలలో కన్నా కార్శి తోటలలో ఎక్కువ దిగుబడులు సాధించవచ్చు.
- భూమి పైనున్న చెఱకు చెత్తను గట్ల వరకు ఎగదోసి పొలంలో ఉన్న ఎండిన చెఱకు కర్రలను ఏరివేయాలి. భూమిపై ఉన్న మోడులను కత్తితో నరకాలి. ఈ విధంగా చేయడం వలన భూమి లోపల ఉన్న మోడుల కణుపులు నుండి పిలకలు పుట్టి ఈ పిలకల వేర్లు నీరు, ఇతర పోషక పదార్థాలను సమర్థవంతంగా గ్రహించగలుగుతున్నాయి.
- మోడు చెక్కిన 10-20 రోజుల లోపల భూమిలో తగినంత పదును ఉన్నప్పుడు రెండు సాళ్ల మధ్య దుక్కి చేసి భూమి గుల్ల బారేటట్లు చేయాలి. మొక్క తోట వేర్లు నశించి ప్రతి పిలక నుండి కొత్త వేరు అభివృద్ధి చెందుతుంది. దీని వలన కార్శి తోటల వేర్లు ప్రాణ వాయువు సక్రమంగా అందుతుంది. అంతేకాకుండా తడులు పెట్టినప్పుడు నీరు భూమిలోకి ఇంకి కార్శి పిలకలను నీరు, పోషకాలు సమాంతరంగా తీసుకుంటాయి.
- కార్శి తోటల్లో ఖాళీలు ఎక్కువగా ఏర్పడి దిగుబడులు గణనీయంగా తగ్గుతాయి. పడిపోయిన తోటలకు నరకడం ఆలస్యమైన కొద్దీ దుబ్బులు చనిపోవడం ఎక్కువై వీటి నుండి కార్శి తోటలు పెంచినప్పుడు ఎక్కువగా ఖాళీలు ఏర్పడి, కార్శి దిగుబడులు గణనీయంగా తగ్గిపోతాయి. బాల్యదశలో నీటి ఎద్దడికి గురైన తోటల్లో కూడా దుబ్బులు చనిపోయి ఖాళీలు ఏర్పడతాయి. కార్శి తోటల్లో ఖాళీలు నింపడం వలన హెక్టారుకు సుమారుగా 8 టన్నుల అదనపు దిగుబడి పొందవచ్చు. ఖాళీలు నింపుటకు అదే రకానికి చెందిన మూడు కళ్ల ముచ్చెలను గాని పాలిథీన్ సంచులలో పెంచిన ఆరు వారాల వయస్సు గల మొలకలను గాని, మొక్క తోటలోని దుబ్బులను గాని ఉపయోగించవచ్చు. మోడు చెక్కిన వారం పది రోజులలోపు కార్శి తోటలలో ఖాళీలు నింపాలి. ఖాళీలు నింపిన మొలకలు లేదా దుబ్బులు బ్రతికే వరకు నీరు పోసి సంరక్షించుకోవాలి. లేత వయస్సులో రెండు, మూడు తడులు దగ్గర దగ్గరగా పెట్టడం వలన మొక్కలు బ్రతికి త్వరగా పిలకలు తొడుగుతాయి.
- తెలంగాణ మండలాలో సాగు చేసే కార్శి చెఱకు తోటకు హెక్టారుకు 375 కిలోల నత్రజని, 100 కిలోల భాస్వరం మరియు 100 కిలోల పొటాష్ ఎరువులను వేయాలి. అంటే ఒక ఎకరానికి 330 కిలోల నత్రజని రూపంలో ఉండే యూరియా మరియు 250 కిలోల భాస్వరం ఎరువు రూపంలో ఉండే సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ మరియు 86 కిలోల పొటాష్ రూపంలో ఉండే మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులను వేసుకోవాలి. అయితే మోడు చెక్కిన వెంటనే సగభాగం నత్రజని, పూర్తి భాగం భాస్వరం మరియు పొటాష్ ఎరువులను వేయాలి. మిగిలిన సగభాగం నత్రజని మోడు చెక్కిన 45 రోజులకు పిలకల మొదళ్లలో చిన్న గుంతలలో వేసి మట్టి నింపాలి. నత్రజని ఎరువులను గుంతలలో వేయడం వలన మొక్క ఎరువును బాగా సద్వినియోగ పరచుకుంటుంది.

**డా॥ యం. విజయ్ కుమార్, ప్రధాన శాస్త్రవేత్త (చెఱకు) & హెడ్**
**వ్యవసాయ పరిశోధన స్థానం, బసంత్‌పూర్, మెదక్,**
**ఫోన్ నెం. 9849535756**

# వాతావరణం-పంటల పరిస్థితి-విశ్లేషణ

డా॥ పి. లీలా రాణి మరియు డా॥ యస్. జి. మహాదేవప్ప
వ్యవసాయ వాతావరణ పరిశోధన కేంద్రం, వ్యవసాయ పరిశోధన స్థానం, రాజేంద్రనగర్, హైదరాబాద్

భారత వాతావరణ విభాగం వారి సమాచారం ప్రకారం తెలంగాణా రాష్ట్రంలో నైరుతి ఋతుపవనాలు జూన్ 22 వ తేదీన ప్రవేశించి జూన్ 24 వ తేదీన రాష్ట్రమంతటా విస్తరించాయి. రాష్ట్రంలో 01.06.2023 నుండి 30.09.2023 వరకు కురిసిన వర్షపాతాన్ని గమనించినట్లైతే సాధారణ వర్షపాతం 738.6 మి. మీ. గాను 861.1 మి.మీ. అనగా సాధారణ వర్షపాతం (17 శాతం) నమోదైనది.

రాష్ట్రంలో 01.10.2023 నుండి 31.12.2023 వరకు కురిసిన వర్షపాతాన్ని గమనించినట్లైతే సాధారణ వర్షపాతం 111.9 మి.మీ. గాను 42.9 మి.మీ. అనగా సాధారణ వర్షపాతం కంటే అతి తక్కువ వర్షపాతం (-62 శాతం) నమోదైనది.

రాష్ట్రంలో యాసంగి పంటకాలానికి ఇప్పటి వరకు (27.12.2023) సాధారణ విస్తీర్ణంలో (ఎకరాలలో) వరి-7.24 శాతం (293436), జొన్న-43.82 శాతం (44712), మొక్కజొన్న-48.96 శాతం (250423), కంది-87.22 శాతం (2137), పెసర- 10.66 శాతం (2439), మినుములు-58.65 శాతం (25635) మరియు వేరుశనగ-65.08 శాతం (180592) సాగు చేయటం జరిగింది.

ఈ సంవత్సరం వానాకాలంలో ఇప్పటి వరకు 20.19 శాతం మేర పంటలు సాగుచేయటం జరిగింది. ఇందులో ఆహార పంటలు 46.81 శాతం, పప్పుదినుసులు 64.21 శాతం, నూనె గింజల పంటలు 54.02 శాతం సాగుచేయటం జరిగింది.

## వాతావరణాధారిత వ్యవసాయ సలహాలు

- తెలంగాణ జిల్లాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు చాలా ప్రాంతాలలో 15 డిగ్రీల కంటే తక్కువగా నమోదవుతున్నందున, చలి ప్రభావం నుండి నారు మడులలో నారు ఎదగక పోవటం, ఆకులు పసుపు మరియు ఎరుపు రంగులోకి మారి కొన్నిసార్లు నారు చనిపోవటం వంటి వాటిపై రైతులు చేపట్టవలసిన రక్షణ చర్యలు:
  - నారుమళ్ళపై ఇనుప చువ్వలు లేదా వెదురు కర్రలతో ఊతమిచ్చిపైన పలుచని పాలిథీన్ షీట్ లేదా ఖాళీ యూరియా బస్తాలతో తయారు చేసిన పట్టాలతో సాయంత్రం పూట కప్పి వుంచి మరుసటి రోజు ఉదయాన్నే తీసివేయాలి.
  - రాత్రి వేళల్లో నారుమడిలో నీరు నిండుగా ఉంచి తెల్లవారు జామున తీసివేసి కొత్తనీరు పెట్టాలి.
  - 10-12 రోజుల దశలో నారు ఆరోగ్యంగా పెరగడానికి పైపాటుగా 1 కిలో యూరియాకి 2గ్రా. కార్బండాజిమ్ + మ్యాంకొజెబ్ మిశ్రమ మందును కలిపి వేసుకోవాలి.
- చలి వాతావరణం మరియు పొగమంచు అగ్గి తెగులు ఆశించుటకు అనుకూలం. పొలంలో మరియు పొలంగట్లపైన ఉండే గడ్డిజాతి కలుపు మొక్కలు అగ్గి తెగులు వ్యాప్తి చేస్తాయి. కావున పొలం గట్లను కలుపు మొక్కలు లేకుండా చూసుకోవాలి. వరి నారుమళ్ళలో అగ్గి తెగులు గమనించినచో నివారణకు 0.5 గ్రా. ట్రైసైక్లాజోల్ లేదా 1.5 మి.లీ. ఐసోప్రొథైయోలిన్ లేదా 2.5 మి.లీ. కాసుగామైసిన్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- యాసంగిలో కాండం తొలుచే పురుగు ఉధృతి అధికంగా ఉంటుంది. నారు ప్రధాన పొలంలో కాండం తొలుచు పురుగు ఉధృతి తగ్గించుకోవడానికి, వరి నారుమళ్ళలో కార్బోఫ్యూరాన్ 3 సిజి గుళికలను 200 చ.మీ. నారు మడికి (5 సెంట్లకు) ఒక కిలో చొప్పున నారు ప్రధాన పొలంలో నాటటానికి వారం రోజుల ముందు చల్లుకోవాలి.
- ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో జొన్నలో పేనుబంక ఆశించే అవకాశం ఉంది. నివారణకు డైమిథోయేట్ లేదా మలాథియాన్ 5% 2 మి.లీ లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.
- ప్రస్తుత వాతావరణ పరిస్థితులు జొన్న పంటలో బూడిద తెగులు ఆశించుటకు అనుకూలం. నివారణకు 3గ్రా. నీటిలో కరిగే గంధకం లేదా 1 గ్రా. కార్బండాజిమ్ లేదా 1గ్రా. థయోఫానేట్ మిథైల్ మందును లీటరు నీటికి కలిపి 10-15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలి.

ప్రస్తుత పొగమంచు వాతావరణ పరిస్థితులు మిరపలో బూడిద తెగులు ఆశించుటకు అనుకూలం. నివారణకు 3గ్రా. నీటిలో కరిగే గంధకము లేదా 1మి.లీ. అజాక్సిస్ట్రోబిన్ లేదా 2.5గ్రా. టెబ్యుకొనజోల్ + గంధకము లేదా 1.5గ్రా. కార్బండజిమ్ + మ్యాంకోజెబ్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

ఇతర వివరములకు సంప్రదించవలసిన
ఫోన్ నెం. 9989625231

# రైతు స్థాయిలో వరి విత్తనోత్పత్తిలో పాటించవలసిన మెళకువలు

జి. నీలిమ, డా॥ బి. సతీష్ చంద్ర, డా॥ వి. వెంకన్న,
డా॥ ఆర్. శ్రవణ్ కుమార్, డా॥ వై. హరి, బి. మాధవి, డి.అశ్విని
మరియు డా॥ ఆర్. ఉమా రెడ్డి
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, వరంగల్





తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా యాసంగిలో ప్రధానంగా సాగు చేసే ఆహార పంట వరి. మన రాష్ట్రంలో సుమారు 45-50 లక్షల ఎకరాలలో యాసంగిలో రైతులు వరి సాగు చేస్తున్నారు. వరిలో ఆశించినటువంటి ఉత్పత్తి మరియు ఉత్పాదకత పొందాలంటే నాణ్యమైన విత్తనం అందుబాటులో ఉండాలి. రైతులు క్షేత్ర స్థాయిలోనే శాస్త్రీయ పరిజ్ఞానంతో నాణ్యమైన విత్తనోత్పత్తి చేపట్టి అధిక దిగుబడులు పొందడమే కాకుండా తోటి రైతు సోదరులకు నాణ్యమైన విత్తనాలను అందించవచ్చు.

వరి సాధారణంగా స్వపరాగ సంపర్క పంట కావున రైతులు, శాస్త్రవేత్తల సూచనలను అనుసరించి తక్కువ ఖర్చుతో విత్తనం తయారు చేసుకోవచ్చు. విత్తనోత్పత్తి చేయుటకు పంట యొక్క పూత సమయం, యాజమాన్య పద్ధతులు, విత్తే దూరం, వేర్పాటు దూరం మరియు కేళీల ఏరివేత గురించి రైతులు అవగాహన పొందాలి.

## పాటించవలసిన మెళకువలు

**విత్తన మోతాదు:** ఎకరానికి దొడ్డు గింజ రకాలైతే 25 కిలోలు, సన్న గింజ రకాలైతే రకాలు 20 కిలోల విత్తనం సరిపోతుంది.

**విత్తనశుద్ధి:** ఒక కిలో విత్తనానికి 1 గ్రాము కార్బండాజిమ్ లీటరు నీటికి కలుపుకొని 24 గంటలు నానబెట్టి మండెకట్టిన మొలకలను నారుమడిలో చల్లుకోవాలి.

**మొక్కల సాంద్రత:** 25-30 రోజుల వయస్సు గల నారును, చదరపు మీటరుకు 66 కుదుళ్ళు ఉండేటట్లు చూసుకోవాలి.

**నేలలు:** సారవంతమైన మరియు మంచి నీటి వసతి గల పొలాలను ఎంపిక చేసుకోవాలి.

**వేర్పాటు దూరం:** వరి స్వపరాగ సంపర్కం జరుపుకునే మొక్క కాబట్టి విత్తనోత్పత్తికి ఎంచుకున్న పొలం చుట్టూ సుమారు 3 మీటర్ల వేర్పాటు దూరం పాటించాలి.

**విత్తనోత్పత్తి పొలం ఎంపిక:** బెరకులు లేకుండా జన్యు స్వచ్ఛత కొరకై అంతకు క్రితం పంటకాలంలో అదే రకం సాగు చేసిన పొలం లేదా ఇతర పంట సాగు చేసిన పొలం ఎంపిక చేసుకోవాలి.

**కలుపు యాజమాన్యం:** నాటిన 3-5 రోజులకు ఎకరానికి 1 లీ. బ్యూటాక్లోర్ లేదా ప్రెటిలాక్లోర్ 500-600 మి.లీ. మందును 20 కిలోల ఇసుకలో కలిపి పొలమంతా సమానంగా చల్లుకుంటే గడ్డి జాతి కలుపుని నివారించవచ్చు. నాటిన 15-20 రోజులకు ఎకరాకు సైహాలోఫాప్ పి బ్యూటైల్ 250-300 మి.లీ. మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి. గడ్డి జాతి మరియు వెడల్పాకు కలుపు నివారణకు బిస్పైరిబాక్ సోడియంను ఎకరాకు 100 మి.లీ.ను 200 లీటర్ల నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.

**నీటి యాజమాన్యం:** పంట యొక్క కీలక దశల్లో అనగా అంకురం, పూత దశ, గింజ పాలు పోసుకునే మరియు గింజ గట్టిపడే దశల్లో నీటి ఎద్దడికి గురికాకుండా జాగ్రత్త పడాలి.

**కేళీల ఏరివేత:** వరి విత్తనోత్పత్తిలో బెరకులను ఏరి వేయడం మూడు దశల్లో అనగా పైరు దుబ్బు చేసే దశ, పూత దశ మరియు గింజ గట్టిపడినప్పుడు చేపట్టాలి.

**శాఖీయ దశ:** సాగుకు ఎంపిక చేసుకున్న రకం యొక్క లక్షణాలు అనగా పైరు ఎత్తు, ఆకు రంగు, వెడల్పు, పొదపు మరియు దుబ్బు చేసే గుణం బట్టి కేళీలు (బెరుకులు) గమనించాలి.

**పూత దశ:** సాగు చేసిన రకం యొక్క లక్షణాలకు భిన్నంగా ముందుగా లేదా ఆలస్యంగా పూతకు వచ్చిన మొక్కలు, పోటాకు అమరికలో వ్యత్యాసాలున్న మొక్కలను గుర్తించి తీసివేయాలి.

**గింజ గట్టిపడే దశ:** ఈ దశల్లో వెన్ను లక్షణాలు, గింజ రంగు, ఆకారం, పరిమాణం మొదలగు లక్షణాల్లో వ్యత్యాసాలను గుర్తించి కేళీలను ఏరివేయాలి.

**పంట కోత:** వెన్నులోని 90 శాతం గింజలు పక్వానికి వచ్చిన తర్వాత పొలాన్ని ఆరబెట్టి కోయాలి. విత్తనంలో తేమ శాతం 12 చేరుకునేవరకు ఎండబెట్టాలి. విత్తనం నిల్వ చేయుటకు శుభ్రపరిచిన గోనె సంచులను లేదా కొత్త సంచులను ఉపయోగించాలి.

**విత్తన నాణ్యత ప్రమాణాలు:** అన్ని ప్రమాణాలు పాటించి తయారు చేసిన విత్తనం యొక్క జన్యు స్వచ్ఛత మరియు భౌతిక స్వచ్ఛత 98%, జడ పదార్థం 2% మించకుండా, కనీస మొలక శాతం 80%, తేమ 12% మించకుండా, ఇతర పంటలు లేదా రకాల విత్తనాలు కిలో గింజల్లో 20 గింజలు మించకుండా విత్తనాన్ని తయారు చేయాలి.

ఈ విధంగా వరి విత్తనోత్పత్తి చేసే రైతులు పైన వివరించిన మెళకువలను పాటించినట్లైతే అధిక దిగుబడులు పొందడానికి ఆస్కారముంటుంది.


ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. **9970402856**

## ఆకాశవాణి ప్రత్యక్ష ప్రసారాల ద్వారా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో రైతుల ముఖాముఖి కార్యక్రమము

**పి.జె.టి.యస్.ఏ.యు, శాస్త్రవేత్తల ప్రత్యక్ష రేడియో ప్రసార కార్యక్రమం ప్రతి బుధవారం రాత్రి 7:15-7:45 ఆకాశవాణి, హైదరాబాద్-ఏ స్టేషన్ నుంచి ప్రసారమవుతుంది. జనవరి, 2024 నెలలో ప్రసారమయ్యే రేడియో కార్యక్రమాలు**

| తేది | అంశం | సాంకేతిక సమాచారం అందిస్తున్న శాస్త్రవేత్త పేరు, హోదా మరియు ఫోన్ నెంబర్ |
| --- | --- | --- |
| 03-01-2024 | యాసంగి వరిలో కలుపు యాజమాన్యం | **డా॥ కె. శ్రీధర్,** శాస్త్రవేత్త (అగ్రో) ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పాలెం, 9948735896 |
| 10-01-2024 | యాసంగి పంటలలో ఎరువుల యాజమాన్యం | **డా॥ టి. సుకృత్ కుమార్,** ప్రధాన శాస్త్రవేత్త (సాయిల్ సైన్స్) భూసార పరీక్షల ఆధారిత పరిశోధనా విభాగం, రాజేంద్రనగర్ 9491402702 |
| 17-01-2024 | వ్యవసాయ విస్తరణలో ఎలక్ట్రానిక్ వింగ్ పాత్ర | **డా॥ యమ్. శ్రీనివాసులు,** కోఆర్డినేటర్ పి.జె.టి.యస్.ఎ.యు, ఎలక్ట్రానిక్ వింగ్, రాజేంద్రనగర్ 9154921220 |
| 24-01-2024 | యాసంగి వేరుశనగలో పోషకాల ఆవశ్యకత | **యన్. నవత,** శాస్త్రవేత్త (అగ్రో) ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పాలెం, 8074006521 |
| 31-01-2024 | వేసవిలో పశుగ్రాస పంటల సాగు | **డా॥ యమ్. రాజేశ్వర్ నాయిక్,** ప్రధాన శాస్త్రవేత్త (సాయిల్ సైన్స్) అఖిల భారత సమన్వయ పశుగ్రాస పంటల మరియు వినియోగ పరిశోధన విభాగం, రాజేంద్రనగర్, 8309101334 |

**రైతులు కాల్ చేయవలసిన ఫోన్ నంబర్ : 040-23244834 / 040-23244836**



# యాసంగి వరిలో సమగ్ర సస్యరక్షణ-పంటకు ఇచ్చును పూర్తి రక్షణ


నాగరాజు అలుగోజు, డా॥ కోట శివకృష్ణ, డా॥ జి. ప్రియా సుగంధి, డా॥ ఐ. తిరుపతి, డా॥ యు. స్రవంతి మరియు డా॥ బి. సతీష్

కృషి విజ్ఞాన కేంద్రం, బెల్లంపల్లి, మంచిర్యాల


తెలంగాణ రాష్ట్రంలో యాసంగిలో నీటి వసతి సమృద్ధిగా ఉన్న ప్రాంతాలలో, పొడి వాతావరణం ఉండటం, అధిక సూర్యరశ్మి మరియు చీడపీడల ఉధృతి తక్కువగా ఉండటం వంటి కారణాల వల్ల యాసంగిలో సుమారు 45-50 లక్షల ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు చేయటం జరుగుతుంది. కానీ డిసెంబర్, జనవరి మాసాలలో తెలంగాణ జిల్లాలలో ముఖ్యంగా ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, కరీంనగర్, వరంగల్ జిల్లాలలో చలి అధికంగా ఉండడం లేదా రాత్రి ఉష్ణోగ్రతలు 15 డిగ్రీల సెల్సియస్ కన్నా తక్కువగా ఉండటం వలన యాసంగి వరి సాగులో ప్రత్యేకించి నారు మరియు పిలకలు వేయు దశలపై అధిక ప్రభావం చూపి రైతులను ఇబ్బందికి గురి చేస్తున్నాయి. ముఖ్యంగా యాసంగి వరిలో నార్లు ఎర్రబడడం, చనిపోవడం, నారు ఎదగకపోవడం, నాటిన తరువాత పిలకలు వేయకపోవడం, జింకు ధాతు లోపం అధికమవడం, చౌడు సమస్యలు పెరగడంతో పాటు చలి ఉధృతిని బట్టి పంటకాలం 15-30 రోజుల వరకు పెరగడం వంటివి ప్రధాన సమస్యలు. యాసంగి వరిలో పంటకాలం పెరగడం మూలంగా నీటి కొరత, కరెంటు సమస్యలే కాకుండా కోతలు ఆలస్యమవడం వలన వడగండ్ల వానవల్ల పంట నష్టం కూడా జరుగుతున్నది. పంటకాలం పెరగడం వలన తెలంగాణలో పూత మరియు గింజ గట్టిపడు దశలలో అధిక ఉష్ణోగ్రతలు నమోదయి గింజ రాలడం, నూక శాతం అధికంగా ఉండి పంటకు సరియైన ధర లేక రైతులు నష్టపోవడం జరుగుతున్నది. ఈ సమస్యలకు అదనంగా యాసంగి వరి సాగులో కాండం తొలుచు పురుగు, వరి ఈగ, ఆకు నల్లి, అగ్గి తెగులు, మొదలు కుళ్ళు మరియు కాండం కుళ్ళు తెగుళ్ళ ఉధృతి ఎక్కువగా ఉండి పంటకు నష్టం వాటిల్లుతుంది. ఈ సమస్యలను దృష్టిలో ఉంచుకొని కొన్ని మెళకువలు పాటించినట్లైతే యాసంగిలో తక్కువ పెట్టుబడితో కూడా నాణ్యమైన వరి పంటను పండించి రైతాంగం అధిక దిగుబడులు పొందే అవకాశం ఉన్నది. పైన తెలుపబడిన చీడపీడల సమగ్ర సస్యరక్షణకి సంబంధించిన విధానాలను క్రింద వివరించడం జరిగింది.

**సస్యరక్షణ:**

**కాండం తొలిచే పురుగు (మొగి పురుగు / తెల్లకంకి):** ఈ పురుగు నారుమడిలో మరియు ప్రధాన పొలంలో పంటను ఆశించి నష్టాన్ని కలుగజేస్తుంది. ముఖ్యంగా పిలక దశలో ఆశిస్తే మొవ్వులు ఎండి చనిపోవడం మరియు అంకురం నుండి చిరుపొట్ట దశలో ఆశిస్తే ఈనిన తర్వాత తెల్లకంకులు బయటకు రావడం గమనించవచ్చు. ఆడ రెక్కల పురుగులు ముదురు గోధుమ / ఎండుగడ్డి / పసుపు రంగులో ఉండి ముందు జత రెక్కలపై నల్లటి మచ్చ కలిగి ఉండి చిన్న గోధుమ రంగు ముద్దవల్లె ఆకు కొనలపై లేదా కాండం మీద గోధుమ రంగు వెంట్రుకలతో కప్పబడిన గ్రుడ్ల సముదాయాన్ని పెడుతుంది. గ్రుడ్డు పొదిగిన తరువాత బయటకు వచ్చిన పిల్ల పురుగులు (లార్వాలు) తెలుపు-గోధుమ రంగులో ఉండి ఎదిగిన తర్వాత నారింజ-పసుపు రంగు తలను కలిగి ఉంటుంది. సమగ్ర సస్యరక్షణలో భాగంగా చదరపు మీటరుకు ఒక తల్లి పురుగు లేదా గ్రుడ్ల సముదాయం లేదా 10 శాతం చచ్చిన మొవ్వులు లేదా లింగాకర్షక బుట్టలలో వారానికి బుట్టకు 25-30 మగ రెక్కల పురుగులు గమనించినప్పుడు మాత్రమే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. నారు పీకే 7 రోజుల ముందు 2 గుంటల (200 చ.మీ.) నారుమడికి 800 గ్రా. కార్బోఫ్యూరాన్ 3 సిజి గుళికలను చల్లి ఆ మడిలోనే ఇంకేటట్లు చేయాలి మరియు నాటిన తరువాత పిలక లేదా దుబ్బు చేసే దశలో కార్బోఫ్యూరాన్ 3 సిజి గుళికలను ఎకరాకి 10 కిలోల చొప్పున లేదా ఎసిఫేట్ 75 ఎస్.పి. 1.5 గ్రా. లేదా కార్టప్ హైడ్రోక్లోరైడ్ 50 ఎస్.పి 2.0 గ్రా. చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. అంకురం నుండి చిరుపొట్ట దశలో కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జి గుళికలు 8 కిలోలు లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.4జి గుళికలు ఎకరానికి 4 కిలోలు చొప్పున లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50 ఎస్.పి 2 గ్రా. లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 18.5 యస్.సి 0.4 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారి చేయటం వలన కాండం తొలిచే పురుగు వల్ల కలిగే నష్టాన్ని చాలా వరకు అదుపు చేయవచ్చును.

**వరి ఈగ:** ఈ పురుగు యాసంగిలో ఎక్కువగా నారుమడి / పిలకదశలో 40-60 రోజులలోపు పైరును ఆశించి నష్టపరుస్తుంది. నీటికి దగ్గరగా ఆకుల అంకురాలను ఆశించడం వల్ల ఆకులు సన్నగా పెరిగి తెల్లగా మారి విరిగిపోతాయి లేదా తెల్ల ఆకుల అంచుల దగ్గర్లో రంధ్రాలు ఏర్పడతాయి. ఎండిన కొనలు రాలి పైరు ఎదుగుదల క్షీణిస్తుంది. కొన్ని సార్లు ఉధృతి ఎక్కువైతే వెన్నులోని కొన్ని గింజలు పాలుపోసుకోక పాక్షికంగా తాలుగా మారతాయి. సాధారణంగా దిగుబడులపై పెద్ద ప్రభావం చూపనప్పటికీ ఉధృతి ఎక్కువగా ఉంటే ఎకరానికి 8 కిలోల

కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జి గుళికలు లేదా ఫిప్రోనిల్ 5 యస్.సి 2.0 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

**తామర పురుగులు:** యాసంగిలో అధిక ఉష్ణోగ్రతలు మరియు నీటి ఎద్దడి పరిస్థితుల్లో పిల్ల, పెద్ద పురుగులు ఆకుల నుండి రసాన్ని పీల్చడం వల్ల ఆకుల అంచులు పైకి చుట్టుకుని, ఆకులు సూది మొనల్లాగా కనబడతాయి. ఉధృతి ఎక్కువైతే మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా ఫిప్రోనిల్ 5 యస్.సి 2 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**ఆకునల్లి / ఎర్రనల్లి / లక్క తెగులు:** సాలీడు జాతికి చెందిన ఈ నల్లులు నాలుగు జతల కాళ్ళతో తెలుపు లేదా పసుపు రంగులో ఆకుల వెనుక వైపు ఈనెల వెంబడి ఉండి రసాన్ని పీలుస్తాయి. ముందుగా ఆకులపై చిన్న తెలుపు మచ్చలు ఏర్పడి క్రమేపి బూడిద/ఎరుపు కషాయ రంగుకి మారతాయి. దూరం నుండి చేను ఎండిపోయినట్లు కనిపిస్తుంది. అవసరాన్ని బట్టి నీటిలో కరిగే గంధకం పొడి 3 గ్రా. లేదా స్పైరోమెసిఫెన్ 22.9 యస్.సి 1.0 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**అగ్గి తెగులు:** యాసంగిలో అనుకూల వాతావరణ పరిస్థితులలో అగ్గి తెగులును కలుగజేసే వ్యాధికారక శిలీంద్రం నారుమడిలో మరియు నాటిన వరి పైరు తొలిదశలో ఆశించి ఆకులపైన నూలుకండె ఆకారంలో మచ్చలు ఏర్పడి క్రమేణా ఇవి పెద్దవై మచ్చల చివర్లు మొనదేలి ఉంటాయి. ఈ మచ్చల అంచులు ముదురు గోధుమ రంగు లేదా నలుపు రంగులో ఉండి మచ్చల మధ్య భాగం బూడిద లేదా తెలుపు రంగులో ఉంటుంది. అనుకూల వాతావరణ పరిస్థితులలో తెగులు తీవ్రత ఎక్కువైనప్పుడు మచ్చలు ఒకదానితో ఒకటి కలిసిపోయి ఆకులు పాక్షికంగా లేదా మొత్తం ఎండిపోతాయి. క్రమేణా తెగులు సోకిన మొక్కల ఆకులు ఎండిపోయి దూరం నుండి చూసినట్లైతే తగలబడినట్లు కనిపిస్తుంది. పిలక దశలో ఆకులపైన ఉన్న మచ్చలు క్రమేపి మొక్కల కణుపులకు సోకడం వలన ఆ భాగం ముదురు గోధుమ రంగు లేదా నల్లగా మారి చివరకు కణుపులు కుళ్ళిపోతాయి. నత్రజని ఎరువులు అధిక మోతాదులో వాడటం, రాత్రి ఉష్ణోగ్రతలు 20 డిగ్రీ సెల్సియస్ కన్నా తగ్గినప్పుడు, పగటి ఉష్ణోగ్రతలు 25-30 డిగ్రీ సెల్సియస్‌గా ఉన్నప్పుడు, గాలిలో తేమ 90 శాతం కన్నా ఎక్కువ, జల్లులు మరియు మబ్బుతో కూడిన వాతావరణం, వారం రోజుల పాటు మంచు కురియటం, పొలంలో మరియు గట్లపైన గడ్డిజాతి కలుపు మొక్కలు ఉండటం అగ్గితెగులు వ్యాప్తి చెందటానికి దోహదం చేస్తాయి. పైరుపై తెగులు లక్షణాలు గమనించిన వెంటనే ట్రైసైక్లోజోల్ 76 డబ్ల్యు.పి 0.6 గ్రా. లేదా ఐసోప్రోథయోలేన్ 40 ఇ.సి 1.5 మి.లీ. లేదా కాసుగామైసిన్ 2.5 మి.లీ. లీటరు నీటికి చొప్పున తెగులు ఉధృతిని మరియు నెలకొన్న వాతావరణ పరిస్థితులను బట్టి 10-15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేసుకోవాలి.

**బ్యాక్టీరియా మొదలు కుళ్ళు / బ్యాక్టీరియా క్రౌన్ రాట్:** యాసంగి వరి పంటలో ఈ తెగులు నాటిన 15-25 రోజులలోపు ఆశించడం వలన లేత మొక్కలు వడలిపోయి వాటి లోపలి కణజాలం కుళ్ళిపోవుట వలన మొక్కలు మెత్తబడి పైరు వాలిపోతుంది. దుబ్బుకట్టే దశ లేదా ఈనిక దశలో ఆశిస్తే ఆకుల కొనలు ఎండిపోవటం మరియు దుబ్బు మొదలు కుళ్ళిపోవటం ఈ తెగులు యొక్క ప్రధాన లక్షణం. తెగులు సోకిన మొక్కల కాండం కూడా కుళ్ళిపోయి మెత్తబడిపోతుంది. మొదలు కుళ్ళు ఆశించిన పిలకలను వేర్ల నుండి నిలువుగా పైకి చీల్చి చూసినప్పుడు లోపలి కణజాలం ముదురు ఎర్ర రంగులోనికి మారి ఉంటుంది. మొక్కల మొదళ్ళు వేర్లతో బయటికి తీసినప్పుడు ఒక విధమైన దుర్వాసనతోపాటు బ్యాక్టీరియా నీటితో (ఊజ్) నిండి ఉంటుంది. మురుగు నీరు పోయే సౌకర్యం లేకపోవడం, పొలంలోని నీటిని అరికట్టకపోవటం మరియు మొక్కలకు కీటకాల వలన కలిగే గాయాలు ముఖ్యంగా కాండం తొలిచే పురుగు ఆశించటం ఈ తెగులు ఉధృతికి చాలా అనుకూలం. ప్రస్తుతానికి నివారణకు మందులు లేవు కాబట్టి మురుగు నీరు పోయేటట్లు చేసుకొని కాండం తొలిచే పురుగు ఆశించకుండా చూసుకుంటే దీని ఉధృతిని తగ్గించవచ్చు.

**కాండం కుళ్ళు తెగులు:** కాండం కుళ్ళు కలుగచేసే శిలీంద్రం దుబ్బుకట్టే దశలో ఆశించుట వలన దుబ్బులోని ఒక కర్ర లేదా పిలకలలోని క్రింద వరుస ఆకులు పసుపు రంగులోనికి మారిపోతాయి. వెన్నులు పాక్షికంగా రావడం లేదా వ్యాధి తీవ్రమయ్యే కొద్దీ పొలంలో పైరు పక్వానికి రాక ముందే ఎండిపోవడం జరుగుతుంది. మొదళ్ళ వద్దనున్న కణుపు లోపలి భాగం కుళ్ళిపోవడం వలన కాండం బలహీనపడి పైరు వాలిపోతుంది. ఈ దశలో ఎండిన పిలకలను చీల్చి చూసినప్పుడు లోపలి భాగంలో సన్నని ఆవాల గింజల రూపంలో స్క్లిరోషియాలు కనిపిస్తాయి. పొలంలోని నీటి మట్టాన్ని తగ్గించి హెక్సాకొనజోల్ 2.0 మి.లీ. లేదా వాలిడామైసిన్ 2.0 మి.లీ. లేదా ప్రొపికొనజోల్ 1.0 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపి పంట బాగా తడిచేలా పిచికారి చేయాలి.

ఈ విధంగా యాసంగి వరిలో వచ్చే వివిధ సమస్యలను ఎప్పటికప్పుడు గమనించుకొని తగు మెళకువలు పాటించినట్లైతే రైతాంగం తక్కువ ఖర్చు / పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించి తద్వారా అధిక నికరాదాయం పొందవచ్చు.







# యాసంగి మొక్కజొన్న సాగులో ప్రస్తుతం ఎదురయ్యే సమస్యలు - నివారణ

డా॥ కె. వాణిశ్రీ, డా॥ బి.మల్లయ్య , డా॥ శివలక్ష్మి, డా॥ డి. భద్రు మరియు డా॥ యం.వి. నగేష్ కుమార్
మొక్కజొన్న పరిశోధన కేంద్రం, వ్యవసాయ పరిశోధన సంస్థ, రాజేంద్రనగర్

మన రాష్ట్రంలో ప్రస్తుత యాసంగి సీజనులో డిసెంబర్ రెండవ పక్షం వరకు మొక్కజొన్నను సుమారు 2.03 లక్షల ఎకరాలలో సాగు చేయడం జరిగింది. యాసంగి మొక్కజొన్నను అక్టోబర్ నుండి నవంబర్ లోపల విత్తుకొనవలసి ఉండగా ఎక్కువ శాతం రైతులు డిసెంబర్ రెండవ పక్షం నుండి జనవరి రెండవ పక్షం వరకు విత్తుకునే అవకాశం ఉంది. ఇప్పటి వరకు విత్తిన మొక్కజొన్న మొలకెత్తే దశ నుంచి పూత దశలో ఉంది. ముఖ్యంగా వాతావరణ మార్పుల వలన వివిధ రకాల చీడపీడలు ఆశించే అవకాశం ఉన్నది. కత్తెర పురుగు మరియు కాండంకుళ్ళు తెగులు ఎక్కువగా సోకే అవకాశం ఉంది. అలానే చలి తీవ్రత వలన సూక్ష్మ ధాతు లోపాలు కూడా సమస్య కావచ్చును. సరియైన సమయంలో సూక్ష్మ ధాతు లోపాలు మరియు చీడపీడల ఉధృతిని గుర్తించి తగిన చర్యలను చేపట్టినట్లైతే మొక్కజొన్న ద్వారా నాణ్యమైన లాభసాటి పంటను సాధించవచ్చును.

**పోషక లోపాలు:** చలి తీవ్రత వలన ముఖ్యంగా భాస్వరం ధాతు లోపం ఏర్పడుతుంది.

**భాస్వరం ధాతు లోపాన్ని ఎలా గుర్తించాలి?**

ఈ పోషక ధాతు లోపం ఉన్నప్పుడు మొక్క పెరుగుదల తగ్గి ఆకులు ఊదా రంగులోకి మారుతాయి. ముఖ్యంగా వాతావరణం బాగా చల్లగా ఉన్నప్పుడు లేదా పొలంలో నీరు నిలిచిన ఎడల ఈ సమస్య కనిపిస్తుంది. దీని నివారణకు దుక్కిలో సిఫారసు మేరకు భాస్వరపు ఎరువును వేయాలి. పంటపై డి.ఎ.పి ద్రావణాన్ని లేదా 19-19-19 లీటరు నీటికి 10 గ్రా. చొప్పున 4 నుంచి 5 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేసి పోషక లోపాల్ని చాలా వరకు సవరించవచ్చును.

**జింక్:** పోషక ధాతు లోపం ఉన్నప్పుడు ఆకుల ఈనె మధ్య భాగాలు పాలిపోయి పసుపు మరియు తెలుపు రంగుగా మారుతాయి. ఈ లక్షణాలు జింక్ లోపించిన నేలల్లో, చలి ఉధృతి పెరిగినప్పుడు మరియు మోతాదుకు మించి అధికంగా భాస్వరము పైరుకు అందించినప్పుడు ఎక్కువ కనిపిస్తాయి. ఈ ధాతులోప నివారణకు దుక్కిలో ఎకరాకు 20 కిలోల జింకు సల్ఫేటును 2-3 పంటలకొకసారి వాడాలి మరియు పైరుపై జింక్ లోప నివారణకు 2 గ్రా. జింక్ సల్ఫేటు ఒక లీటరు నీటికి కలిపి 4 నుంచి 5 రోజుల వ్యవధితో రెండు సార్లు పిచికారి చేయాలి.

**సస్యరక్షణ:** తెలంగాణలో వివిధ జిల్లాల్లో ప్రస్తుతం మొక్కజొన్న శాఖీయ దశలో ఉంది. శాఖీయ దశలో ఉన్న మొక్కజొన్నను కత్తెర పురుగు ఎక్కువగా ఆశించినట్లు గమనించడమైనది.

**కత్తెర పురుగు:** మొదటిదశ లార్వాలు పత్ర హరితాన్ని గోకి తినుటవలన ఆకులపై తెల్లటి పొర ఏర్పడుతుంది. రెండు మరియు మూడవ దశ లార్వాలు ఆకుసుడిలో ఉండి రంధ్రాలు చేసుకుంటూ తినటం వలన విచ్చుకున్న ఆకుల్లో వరుస రంధ్రాలు ఏర్పడుతాయి. ఈ పురుగు సమస్య ఎక్కువైతే గొడ్డు మొక్కలు కూడా ఏర్పడుతాయి. సుడిలోని ఆకులను పూర్తిగా కత్తిరించి వేస్తుంది. పురుగు విసర్జించిన పసుపు పచ్చని గుళికలను సుడులలో గమనించవచ్చును. ఎదిగిన లార్వాదశలో ఆకులను వెలుపల నుండి లోపలి వైపుకు తినివేస్తూ, పూర్తిగా ఆకులను తిని ఈనెలను మాత్రమే మిగిల్చి మొక్క అంతా కత్తిరించినట్లు కనిపించును. కంకి పొరలను తొలుచుకుంటూ రంధ్రాలు చేసి లోపలి గింజలను ఆశించి నష్టపరుస్తుంది.

**యాజమాన్యం:**

- పంట విత్తిన వారానికి ఎకరానికి 4 లింగాకర్షక బుట్టలను అమర్చి పురుగు ఉనికిని గమనించాలి.
- పొలంలో నలుమూలల తిరిగి పురుగు ఆశించిన మొక్కలను గమనించాలి.
- పురుగు గ్రుడ్లను, మొదటి దశ పిల్ల పురుగులను నివారించుటకు, వేపసంబంధిత మందైన అజారిడిక్టిన్ (1500 పిపిఎం) 5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- రెండవ దశ దాటిన లార్వాల నివారణకు ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేసి నివారించాలి.
- పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నచో ఎదిగిన లార్వాల నివారణకు క్లోరాంట్రానిలిప్రోల్ 0.4 మి.లీ. లేదా స్పెనెటోరం 0.5 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి
- 65 రోజుల పైబడిన మొక్కజొన్న పంట అనగా పూత దశ తరువాత పురుగును గమనించినట్లైతే పురుగు మందులు పెద్దగా పనిచేయవు. ఎదిగిన లార్వాలను మనుషులతో ఏరించి కిరోసిన్ డబ్బాలో వేసి చంపివేయాలి. విషపు ఎరను వేసుకోవాలి.

**ఆకు ఎండు తెగుళ్ళు:** మొక్కజొన్నను ఆశించే తెగుళ్ళలో ముఖ్యమైనవి ఆకు ఎండు తెగుళ్ళు. ఇవి రెండు రకాలు. మొదటి రకం తెగులులో ఆకులపై మచ్చలు కోలగా ఉండి, నీటితో తడిచినట్లుగా కనిపిస్తాయి. క్రమంగా ఈ మచ్చల పరిమాణం పెరిగి, ఆకంతా వ్యాపించి, ఆకులు పూర్తిగా ఎండిపోతాయి. ఎక్కువ తేమ గల వాతావరణంలో మొక్కలు చనిపోతాయి. రెండవ రకం ఆకు ఎండు తెగులులో ఆకులపై చిన్న చిన్న కోలగా ఉండే బూడిద లేక గోధుమ రంగు మచ్చలు ఏర్పడతాయి. తరువాత ఈ మచ్చల పరిమాణం పెరిగి దీర్ఘచతురస్రాకారంగా మారుతాయి. వాతావరణంలో తేమ మరియు పగటి ఉష్ణోగ్రతలు బాగా పెరిగినపుడు ఈ తెగులు తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

**నివారణ:** మ్యాంకోజెబ్ 2.5 గ్రా. లీటరు నీటిలో కలిపి పిచికారి చేసి ఆకు ఎండు తెగుళ్ళను నివారించుకోవచ్చు

**పూతానంతర కాండం కుళ్ళు:** మసి కుళ్ళు తెగులు వేడి వాతావరణంలో మొక్కజొన్న సాగుచేయు ప్రాంతాలలో అగుపిస్తుంది. పంటకోత సమయంలో ఈ తెగులు స్పష్టంగా అగుపిస్తుంది. తెగులు సోకిన కణుపు మధ్య భాగాలు కుళ్ళి నలుపుగా మారి మొక్కలు ఎండిపోతాయి. పంటకోతకు రాక ముందే కాండం భాగం విరిగి నేలపై పడిపోతుంది. కాండము చీల్చి గమనించినచో అనేకమైన స్క్లీరోషియా బీజాలు కణజాలం పైన మరియు బెండు క్రింది భాగంలో అగుపిస్తాయి. ఈ తెగులు నేల పైభాగంలోని ఒకటి లేక రెండు కణుపులకు మాత్రమే సోకుతుంది. పూత దశనుండి నీటి ఎద్దడి ఉన్న పైరులో ఈ తెగులు ఎక్కువగా సోకే అవకాశం ఉంది.

కాండం కుళ్ళును కలిగించే శిలీంద్ర బీజాలు నేలలో మరియు మొక్కల అవశేషాలలో జీవించి ఉండి, నేలలో తేమ శాతం తగ్గినప్పుడు మరియు వాతావరణంలో ఉష్ణోగ్రత పెరిగినప్పుడు మొక్కజొన్న పంటను తీవ్రంగా ఆశిస్తాయి.

**నివారణ:**

- పంట వేసే ముందు పచ్చిరొట్ట పంటలను పండించి నేలలో కలియదున్నాలి.
- ట్రైకోడెర్మా శిలీంద్రాన్ని పశువుల ఎరువులో వృద్ధి చేసి వరుసగా 3-4 సంవత్సరములు భూమిలో కలపాలి.
- మ్యాంకోజెబ్ 2.5 గ్రా. కిలో విత్తనానికి కలిపి విత్తనశుద్ధి చేసి విత్తుకోవాలి.
- ఎండాకాలంలో నేలను లోతుగా దున్నుకోవాలి.
- పంట కోసిన తరువాత తెగులు ఆశించిన మొక్కల భాగాలను కాల్చివేయాలి.

చీడపీడలు మరియు పోషకలోపాలు ఉన్నప్పుడు ఏ పంటలోనైనా దిగుబడులు గణనీయంగా తగ్గి రైతుకు అపారమైన నష్టం కలుగజేస్తాయి. కావున సరియైన సమయంలో మొక్కజొన్నలో సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించడం వలన రైతు సోదరులు సాగు ఖర్చులు తగ్గించుకొని అధిక దిగుబడులు మరియు నికరాదాయం పొందవచ్చును.

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం.9494407924





# నూనె గింజల పంటల పరిస్థితులు - వేరుశనగ సాగుకు అవకాశాలు

ఎస్. నవత, డా॥ శంకర్, కే. స్రవంతి, డా॥ రామిరెడ్డి, డా॥ ఎం. మల్లారెడ్డి మరియు డా॥ ఎస్. వాణి శ్రీ
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పాలెం



ప్రపంచంలో నూనె గింజల పంటల ఉత్పత్తిలో ఐదవ అతిపెద్ద దేశంగా ఉన్నప్పటికీ, వంటనూనెలను అత్యధికంగా దిగుమతి చేసుకునే దేశాల్లో భారతదేశం కూడా ఒకటి. ప్రపంచ నూనె గింజల పంట సాగు విస్తీర్ణంలో 20%, నూనె ఉత్పత్తిలో 10% భారతదేశంలోనే జరుగుతోంది. గత 30 ఏళ్లలో దేశంలో నూనెగింజల పంటల విస్తీర్ణం, నూనెల ఉత్పత్తి గణనీయంగానే ఉన్నా, పెరుగుతున్న దేశ జనాభా అవసరాలకు ఏమాత్రం సరిపోనందున విదేశాల నుండి దిగుమతి చేసుకుంటున్నాం. 1990 ప్రారంభంలో ఎల్లోరెవల్యూషన్ ద్వారా సాధించిన నూనె గింజలలో స్వయం సమృద్ధి స్వల్పకాలానికి మించి కొనసాగ లేకపోయింది. సగటున ఒక్కొక్క మనిషి ఏటా 19 కేజీల వంట నూనెలు వాడుతున్నారు. దేశంలో పెట్రోలియం మరియు బంగారం తర్వాత అత్యధికంగా దిగుమతి అయ్యేవి ఎడిబుల్ ఆయిల్స్. ఇవి వ్యవసాయ దిగుమతుల్లో 40% వాటాను కలిగి ఉన్నాయి. ముఖ్యంగా ఎడిబుల్ ఆయిల్స్ డిమాండ్ సప్లైలో గ్యాప్ కారణంగా దేశ అవసరాల నిమిత్తం 60 శాతం భారీ దిగుమతులు చేసుకోవాల్సి వస్తోంది. గోధుమ, వరి మరియు ఇతర ఆహార పంటల సాగు విస్తీర్ణంతో పోలిస్తే నూనె గింజల పంటల సాగు తక్కువే. భారతదేశంలో నూనె దిగుమతులపై పెట్టే ఖర్చు 2020-21లో 10.92 బిలియన్ డాలర్ల నుంచి 2021-22లో 18.7 బిలియన్ డాలర్లకు పెరిగింది. భారతదేశం ఎక్కువగా దిగుమతులపై ఆధారపడి ఉన్నందున పెరుగుతున్న దిగుమతుల వ్యయం వల్ల ఖజానాపై విపరీతమైన ఆర్థిక భారం పడే అవకాశం ఉంది. ముఖ్యంగా ఎడిబుల్ ఆయిల్స్ సాగులో స్వయం సమృద్ధి సాధించడం ద్వారా దిగుమతులపై ఆధారపడడాన్ని తగ్గించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. నూనె గింజల పంటల సాగు ప్రధానంగా మధ్యప్రదేశ్ (28%), రాజస్థాన్ (21%), మహారాష్ట్ర (15%) లలో జరుగుతుంది. గుజరాత్, ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ, కర్ణాటకలోనూ వేరుశనగ, నువ్వులు, సోయాచికుడు, ప్రొద్దుతిరుగుడు, కుసుమ వంటి నూనె గింజల పంటలు సాగవుతున్నాయి వంటనూనెలకు ఏటా 6 శాతం గిరాకీ పెరుగుతోంది.

వేరుశనగ ముఖ్యమైన నూనె గింజలు మరియు అనుబంధం ఆహారపంట. ప్రపంచంలోనే అత్యధికంగా వేరుశనగ పండించే ప్రాంతాలు భారతదేశం మరియు చైనా. భారతదేశంలో పండించే వేరుశనగ పంటకు ప్రపంచ వ్యాప్తంగా మంచి డిమాండ్ ఉంది. ముఖ్యంగా వేరుశనగ పంటను భారతదేశంలో నీటి వసతి గల ప్రాంతాలలో ఏడాది పొడవునా సాగు చేయడం ద్వారా సుమారుగా 50 దేశాలకు ఎగుమతి చేస్తున్నారు గత సంవత్సరంతో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ - మే మధ్యకాలంలో 32 శాతం ఎగుమతులు పెరిగాయి. భారతదేశంలో పండించే వేరుశనగ అత్యధికంగా (ఎగుమతులలో 1/3వ వంతు) ఇండోనేషియా దిగుమతి చేసుకుంటుంది తరువాత వియత్నాం, ఫిలిప్పీన్స్, మలేషియా, థాయిలాండ్, యూఏఈ, బంగ్లాదేశ్, ఇరాన్, ఆఫ్ఘనిస్తాన్, రష్యా మరియు నేపాల్ దేశాలు ఉన్నాయి. ముఖ్యంగా భారతదేశంలో పండించే టేబుల్ నట్స్‌గా వినియెగింపబడే వేరుశనగ విదేశాలలో మంచి డిమాండ్ ఉంది. ఈ కారణంగా భారతీయ వేరుశనగ ఎగుమతులు ఏటా పెరుగుతున్నాయి. భారతదేశంలో వేరుశనగ ఎగుమతులు ఎక్కువగా గుజరాత్ మరియు రాజస్థాన్ రాష్ట్రాల నుంచి జరుగుతుంది. కానీ అఫ్లోటాక్సిన్ కారణంగా వేరుశనగ ఎగుమతులు తగ్గే అవకాశం కలదు. కానీ తెలంగాణ రాష్ట్రంలో సాగు చేసే వేరుశనగ పంట గుజరాత్ రాష్ట్రంలో పండించే వేరుశనగ కంటే నాణ్యమైనది మరియు అఫ్లోటాక్సిన్ పరిమితి

కూడా తక్కువగా ఉందని రుజువైన కారణంగా తెలంగాణ రాష్ట్రంలో వేసవిలో వేరుశనగకు మేలైన యాజమాన్య పద్ధతులు పాటించి సాగు చేయడం ద్వారా అధిక దిగుబడులను పొందటమే కాకుండా ఎగుమతులు పెంచడంలో కూడా తోడ్పడుతుంది.

**విత్తన మోతాదు:** నీటిపారుదల క్రింద వేసవిలో ఒక ఎకరానికి 80 కిలోల వేరుశనగ గింజ సరిపోతుంది.

**విత్తనశుద్ధి:** మొదలు కుళ్ళు తెగుళ్ళు లేదా కాండం కుళ్ళు తెగులు ఆశించే ప్రాంతాలలో ఒక కిలో విత్తనానికి ఒక గ్రా. టెబ్యుకొనజోల్ లేదా మ్యాంకోజెబ్. 3 గ్రా. పొడి మందును పట్టించాలి. కాండం కుళ్ళు వైరస్ తెగుళ్ల ఆశించే ప్రాంతాలలో ఇమిడాక్లోప్రిడ్ 2 మి.లీ. 7 మి.లీ. నీటిలో కలిపి ఒక కిలో విత్తనానికి పట్టించాలి. వేరు పురుగు ఆశించే ప్రాంతాలలో క్లోరిఫైరిపాస్ 6.5 మి.లీ. ఒక కిలో విత్తనానికి పట్టించాలి. కొత్తగా వేరుశనగ సాగు చేసే ప్రాంతాలలో ఒక ఎకరానికి సరిపడా విత్తనానికి 200 గ్రా. రైజోబియం అనే జీవన ఎరువుతో విత్తనశుద్ధి చేసుకోవాలి. కుళ్ళు తెగులు ఆశించే ప్రాంతాలలో కిలో విత్తనానికి 10 గ్రా. ట్రైకోడెర్మా విరిడి అనే జీవ శిలీంధ్రనాశినితో విత్తనశుద్ధి చేసుకోవాలి.

**విత్తే సమయం:** వేసవిలో వేరుశనగ సాగును జనవరి మొదటి వారం నుంచి జనవరి చివరి వారం వరకు నీటిపారుదల ఉన్న ప్రాంతాలలో విత్తుకోవచ్చు.

**విత్తే దూరం:** నీటిపారుదల క్రింద సాగు చేసేటప్పుడు వరుసల మధ్యలో 22.5 సెం.మీ. మరియు మొక్కల మధ్య 10 సెంటీమీటర్ల దూరం ఉండే విధంగా ఒక చదరపు మీటరుకు 44 మొక్కలు ఉండే విధంగా విత్తుకోవాలి.

**విత్తే పద్ధతి:** విత్తనాన్ని ఐదు సెం.మీ. లోతు మించకుండా విత్తుకోవాలి యాంత్రీకరణ పద్ధతిలో సీడ్ డ్రిల్ ద్వారా విత్తుకున్నట్లయితే తక్కువ సమయంలో తక్కువ ఖర్చుతో ఎక్కువ విస్తీర్ణంలో విత్తుకోవచ్చు.

**అనువైన నేలలు:** వేరుశనగ కాయలు భూమి లోపల ఏర్పడతాయి. కావున ఊడలు దిగడానికి మరియు గింజ కట్టడానికి అనుకూలమైన ఇసుక నేలలు, ఎర్రచల్క నేలలు ఎన్నుకోవాలి. బంకమన్ను ఎక్కువగా గల నల్ల రేగడి నేలలు అనుకూలం కావు. నేలను మెత్తగా దున్ని చదును చేసుకోవాలి.

**పోషక యాజమాన్యం:** భూసార పరీక్షల ఆధారంగా రైతులు ఎరువుల మోతాదును నిర్ణయించుకోవాలి. సమగ్ర పోషక యాజమాన్యం ద్వారా ఎకరానికి 3 నుంచి 4 టన్నుల బాగా మాగిన పశువుల ఎరువు, 100 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 33 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ మరియు 18 కిలోల యూరియాను ఆఖరి దుక్కిలో వేసుకోవాలి. 10 నుంచి 15 కిలోల యూరియాను పూత దశలో వేసుకోవాలి. వేరుశనగకు కావలసిన ముఖ్యమైన పోషకాలను (కాల్షియం మరియు గంధకం) అందించే జిప్సంను ఎకరానికి 200 కిలోలు ఊడలు దిగే సమయంలో మొదల దగ్గర వేసి మట్టిని ఎగదోయాలి.

**కలుపు యాజమాన్యం:** విత్తిన 48 గంటల లోపు డైక్లోసులం 84% డబ్ల్యుడిజి అని కలుపు మందును ఎకరానికి 12.4 గ్రా., పెండిమిథాలిన్ 38.7% అనే కలుపు మందును ఎకరానికి 700 మి.లీ. 200 లీ. నీటిలో కలిపి నేలలో తగినంత తేమ ఉన్నప్పుడు పిచికారి చేసుకోవాలి. ఆ తర్వాత దశలో ఆశించే కలుపును నివారించడానికి కలుపు 2-3 ఆకుల దశలో ఉన్నప్పుడు గడ్డి జాతి కలుపు ఎక్కువగా ఉన్నప్పుడు క్విజాలోపాప్ పి ఈథైల్ 400 మి.లీ. వెడల్పాకు మరియు గడ్డి జాతి కలుపు ఉన్నట్లయితే ఇమాజితపైర్ 10% ఎకరానికి 300 మి.లీ. ను లేదా ఇమాజితపైర్ + ఇమాజోమాక్స్ అనే కలుపు మందును ఎకరానికి 40 గ్రా. 200 లీ. నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి. విత్తిన 40 రోజుల తర్వాత ఎటువంటి అంతర సేద్యం చేయరాదు.

**నీటి యాజమాన్యం:** విత్తేముందు నేల బాగా తడిచేలాగా నీరు పెట్టి తగినంత పదును ఉన్నప్పుడు విత్తనం వేసుకోవాలి. రెండవ తడిని మొలక వచ్చిన 20 నుంచి 25 రోజుల సమయంలో ఇవ్వాలి. ఇలా చేయడం వలన పొలం ఒకేసారి పూతకు వస్తుంది తర్వాత నీటి తడులను నేల లక్షణం బంకమట్టి శాతాన్ని బట్టి ఏడు నుంచి పది రోజులకు ఒక నీటి తడిని ఇవ్వాలి. తేలిక నేలల్లో 6 నుంచి 8 నీటి తడులు అవసరం అవుతాయి. చివరి తడిని పంట కోతకు నాలుగు నుంచి ఏడు రోజుల ముందు ఇవ్వాలి. తేమ సున్నిత దశలైనా ఊడలు దిగేదశ నుండి కాయలు ఊరేదశ వరకు ఎటువంటి నీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలి.

వేరుశనగలో ప్రధానంగా ఆకుముడత, పొగాకు లద్దెపురుగు, పేనుబంక, పచ్చదీపపు పురుగులు, తామర పురుగులు మరియు వేరు పురుగు ఆశించి ఎక్కువగా పంట నష్టాన్ని కలిగిస్తాయి.

**ఆకుముడత పురుగు:** వేసవిలో వేడిగా మరియు పొడి వాతావరణం ఉన్నట్లయితే ఈ పురుగు ఎక్కువగా ఆశించటానికి దోహదపడుతుంది. విత్తిన 30 రోజుల తర్వాత బెట్ట పరిస్థితులు, పగటి ఉష్ణోగ్రతలు సాదారణం కంటే 2.3 $-5^{0}$ సెంటిగ్రేడ్ ఎక్కువగా ఉండటం అనుకూలం.

**యాజమాన్యం:** ఈ పురుగు ఉనికిని గమనించడానికి ఎకరానికి 4 లింగాకర్షక బుట్టలు పెట్టాలి. పురుగు ఉధృతిని ఎక్కువగా గమనించినప్పుడు ఒక లీటరు నీటికి ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా క్లోరిఫైరిపాస్ 2.5 మి.లీ. లేదా డెల్టా మెత్రిన్ 0.5 మీ.లీ. లేదా

లామ్డాసైహలోత్రిన్ 0.4 మీ.లీ లేదా మిథాక్సి ఫెనోజైడ్ 1.75 మీ.లీ చొప్పున కలిపి పిచికారి చేయాలి.

**పొగాకు లద్దెపురుగు:** గాలిలో తేమ శాతం 85% కన్నా ఎక్కువగా ఉండి పగటి, రాత్రి ఉష్ణోగ్రతలో 2-3$^0$ తగ్గుదల ఉన్నప్పుడు లద్దె పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు 30-32$^0$ సెంటిగ్రేడ్, రాత్రి ఉష్ణోగ్రతలు 21-23$^0$ సెంటిగ్రేడ్, 4 మి.మీ. కంటే ఎక్కువ వర్షపాతం పురుగు ఉధృతి పెరగడానికి దోహద పడుతుంది. ఈ పురుగులు పగటివేళ మొక్కల అడుగున లేదా మట్టి పెళ్ళల క్రింద దాగి, రాత్రి పూట మొక్కలను ఆశిస్తాయి.

**యాజమాన్యం:** పంట విత్తేటప్పుడు పొలం చుట్టూ అక్కడక్కడ ఎరపంటగా ఆముదం మొక్కలు నాటాలి. ఆముదం ఆకుల క్రింద భాగంలో గ్రుడ్ల సమూహాలు, మొదటి దశ మరియు రెండవ దశ లద్దె పురుగులను, జల్లెడాకులు ద్వారా గుర్తించి వాటిని నాశనం చేయాలి. పంట విత్తిన 10-15 రోజులలోపు ఎకరాకు నాలుగు లింగాకర్షక బుట్టలు పెట్టి పురుగు ఉనికిని, ఉధృతిని గమనించాలి. పురుగులు చిన్నవిగా ఉన్నప్పుడు 5% వేపగింజల కషాయం పిచికారి చేయాలి. ఎదిగిన లార్వాలను నివారించేందుకు నోవాల్యురాన్ 1 మి.లీ. లేదా ఫ్లూబెండమైడ్ 0.6 మి.లీ. ఒక లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలి. దీని ఉధృతి ఎక్కువగా ఫ్లూబెండమైడ్ + హెక్సాకొనజోల్ 3 మీ.లీ. లేదా థయోడికార్బ్ 1 గ్రా. లేదా క్లోర్‌ఫెన్‌పైర్ 2 మి.లీ. లేదా నోవాల్యురాన్ + ఇండాక్సాకార్బ్ 1.75 మీ.లీ. ఒక లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలి. పెద్ద లార్వాలను విషపు ఎర ఉపయోగించి నివారించవచ్చు. ఇందుకు గాను 10 కిలోల తవుడు, ఒక కిలో బెల్లం, ఒక లీటర్ మోనోక్రోటోఫాస్ లేదా ఒక లీటరు క్లోరిపైరిఫాస్ మందును కలిపి, తగిన నీటితో ఉండలుగా చేసిన ఎరను తయారు చేసుకొని సాయంత్రం వేళ సమానంగా ఒక ఎకరా పొలంలో చల్లి ఈ పురుగు ఉధృతిని నివారించుకోవచ్చు.

**పేను బంక:** జనవరి మాసంలో రాత్రి ఉష్ణోగ్రతలు 12-15$^0$ సెం.గ్రే. మధ్య ఉండి మబ్బులతో కూడిన వాతావరణం వ్యాప్తికి అనుకూలం

**యాజమాన్యం:** ఈ పురుగు ఉధృతి అధికంగా ఉన్నప్పుడు మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.4 మి.లీ. ఒక లీటరు నీటికి చొప్పున పిచికారి చేయాలి.

**పచ్చదీపపు పురుగు:** పచ్చ దీపపు పురుగుల ఉధృతి అధికంగా ఉన్నప్పుడు ఆకుల చివర్ల నుండి ఎండిపోతూ పంట కాలిపోయినట్లు కనిపిస్తుంది. దీనినే "హాపర్ బర్న్" అంటారు.

**యాజమాన్యం:** పసుపు రంగు జిగురు అట్టలు/ఎరలు ఉపయోగించి పురుగుల ఉనికిని ఉధృతిని తగ్గించవచ్చు. మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. + వేపనూనె 5 మి.లీ. లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.4 మి.లీ. లేదా లామ్డాసైహలోత్రిన్ 0.4 మీ.లీ లేదా థయోమిథాక్సామ్ + లామ్డాసైహలోత్రిన్ 0.5 మీ. లీ. ఒక లీటర్ నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి. పురుగు ఉధృతి అధికంగా ఉన్నచో థయోమిథాక్సామ్ 0.5 గ్రా. ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**తామర పురుగులు:**

**యాజమాన్యం:** పొలం చుట్టూ జొన్న లేదా సజ్జ 4-5 వరుసలు విత్తుకోవాలి. పొలంలో గాని, పొలం గట్లమీద కలుపు మొక్కలు ముఖ్యంగా వయ్యారిభామ (పార్థీనియం) లేకుండా చూడాలి. ఇమిడాక్లోప్రిడ్ 600 ఎఫ్.ఎస్. 2 మి.లీ. మరియు నీరు 7 మి.లీ.కిలో విత్తనానికి కలిపి విత్తనశుద్ధి చేసి వేరుశనగ పంటను రక్షించుకోవచ్చు. వేసవిలో పంటలో విత్తిన 30 రోజులలోపుగా ముడుత కనిపించినట్లయితే మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.4 మి.లీ. లేదా థయోమిథోక్సామ్ 0.5 గ్రా. ఒక లీటర్ నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

**వేరు పురుగు:** వేరుపురుగు ఆశించిన వేరుశనగ మొక్కలు ఎండుతెగులు సోకినట్లుగా అగుపించడం, వరుసల్లో సముదాయాలుగా మొక్కలు చనిపోవడం గమనించవచ్చు.

**యాజమాన్యం:** క్లోరిపైరిఫాస్ 6 మి.లీ. లేదా ఇమిడాక్లోప్రిడ్ 600 ఎఫ్.ఎస్. 2 మి.లీ. మరియు నీరు 7 మి.లీ. ఒక కిలోల విత్తనానికి కలిపి విత్తనశుద్ధి చేసి నివారించుకోవచ్చు. పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్న పొలాల్లో ఎకరాకు విత్తే ముందు 13 కిలోలు కార్బోఫ్యూరాన్ 3 సి.జి గుళికలు లేదా థయోమిథోక్సామ్ + బైఫెన్‌త్రిన్ గుళికలు 5 కిలోలు వేసుకోవాలి. క్లోరిపైరిపాస్ 2 మీ.లీ. ఒక లీటరు నీటికి కలిపి పిచాకారి చేయాలి. ఫిప్రోనిల్ + ఇమిడాక్లోప్రిడ్ 125 గ్రా. ఒక్క ఎకరానికి సరిపడా మోతాదులో కలిపి చల్లుకోవాలి.

**పంట కోత మరియు నిల్వ:** కాయలోపలి భాగం ముదురు గోధుమ రంగుకు మారినప్పుడు పంట కోత దశకు వచ్చిందని గుర్తించాలి. కోత అనంతరం మొక్కలను కట్టలుగా కట్టి నీడ ఉన్న ప్రదేశంలో ఉంచాలి. కూలీల కొరత బాగా ఉండే సమయాల్లో యంత్రాల ద్వారా వేరుశనగ కాయలను మొక్కల నుండి వేరు చేయవలెను. పచ్చి కాయలను మొక్కల నుండి వేరు చేసే యంత్రం మరియు ఎండు కాయలను మొక్కల నుండి వేరు చేసే యంత్రం ద్వారా ఒక గంట సమయంలో రెండు నుంచి 2.5 క్వింటాళ్ల కాయలను మొక్కల నుండి వేరు చేయవచ్చు. కాయలలో తేమ శాతం ఎనిమిది నుంచి తొమ్మిది శాతం తగ్గే వరకు నీడలో ఆరబెట్టాలి కాయలను గోనె సంచులలో నింపి గాలి మరియు వెలుతురు గల గోదాములలో నిల్వ ఉంచాలి.

ఇతర వివరములకు సంప్రదించవలసిన
ఫోన్ నెం.8074006521





# వేసవికి అనువైన నువ్వుల రకాలు - సాగు యాజమాన్యం

డా॥ డి. పద్మజ, డా॥ ఎన్. బలరాం, డా॥ ఇ. రజనీకాంత్, వై. స్వాతి, డా॥ డి. రజని దేవి, డా॥ జి. శ్రీనివాస్,
డా॥ ఎస్. వాణి శ్రీ మరియు కె. సోనియా
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పొలాస, జగిత్యాల

మన రాష్ట్రంలో నువ్వులు కరీంనగర్, జగిత్యాల, నిర్మల్, ఆదిలాబాద్, నిజామాబాద్, ఖమ్మం, వరంగల్ మరియు మహబూబ్‌నగర్ జిల్లాలలో వేసవిలో సాగు చేస్తున్నారు.

నువ్వు పంట ఉత్తర తెలంగాణ ప్రాంత జిల్లాల్లో ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేయబడుతోంది. వేసవికి అనువైన రకాలు శ్వేతాతిల్, హిమ, జగిత్యాల తిల్-1, జగిత్యాల తిల్-2, తెలంగాణ తిల్-1 వంటి మేలైన తెల్లగింజ రకాలు వేసవిలో సాగు చేయవచ్చును.

### రైతులు ప్రధానంగా పాటించవలసిన పద్ధతులు:

**అనువైన రకాలు:** అధిక దిగుబడి సాధించాలంటే అనువైన రకాల ఎంపిక చాలా అవసరం. ఇందుకుగాను ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పొలాస, జగిత్యాల నుండి విడుదల చేసిన తెల్లనువ్వు రకాలు వేసవి కాలంలో విత్తుకోవడానికి అనుకూలంగా ఉంటాయి.

**1. రాజేశ్వరి**

విడుదలైన సంవత్సరం : 1988
దిగుబడి : వేసవి 800 కి./హె.
గింజ రకం : తెల్లగింజ రకం
కాలపరిమితి : వేసవి 85-90 రోజులు
నూనె శాతం : 50%

**2. శ్వేత (జె.సి.యస్ 96)**

విడుదలైన సంవత్సరం : 1996
దిగుబడి : వేసవి 950-1000 కి./హె.
గింజ రకం : తెల్లగింజ రకం
కాలపరిమితి : వేసవి 85-90 రోజులు
నూనె శాతం : 46-48%

**3. హిమ (జె.సి.యస్ 9426)**

విడుదలైన సంవత్సరం : 2006
దిగుబడి : వేసవి 1000-1050 కి./హె.
గింజ రకం : తెల్లగింజ రకం, కాయలు పొడుగ్గా ఉంటాయి
కాలపరిమితి : వేసవి 80-85 రోజులు
నూనె శాతం : 46-48%

**4. జగిత్యాల తిల్-1 (జె.సి.యస్ 1020)**

విడుదలైన సంవత్సరం : 2022
దిగుబడి : వేసవి 1050-1100 కి./హె.
గింజ రకం : జడకాతతో కూడిన తెల్లగింజ రకం
కాలపరిమితి : వేసవి 85-95 రోజులు

| | | |
|---|---|---|
| నూనె శాతం | : | 46-49% |
| ప్రత్యేక లక్షణాలు | : | బూడిద తెగులు, ఆకుమచ్చ తెగులు మరియు వెర్రి తెగులును కొంత వరకు తట్టుకుంటుంది. |

**5. జగిత్యాల తిల్-2 (జె.సి.యస్ 2454)**

| | | |
|---|---|---|
| విడుదలైన సంవత్సరం | : | 2021 |
| దిగుబడి | : | వేసవి 970-1030 కి./హె. |
| గింజ రకం | : | తెల్లగింజ రకం |
| కాలపరిమితి | : | వేసవి 90-95 రోజులు |
| నూనె శాతం | : | 46-49% |
| ప్రత్యేక లక్షణాలు | : | బూడిద తెగులు మరియు ఆకుమచ్చ తెగులును కొంత వరకు తట్టుకుంటుంది. |

**6. తెలంగాణ తిల్-1 (జె.సి.యస్ 3202) సివిఆర్‌సి:**

| | | |
|---|---|---|
| విడుదలైన సంవత్సరం | : | 2022 |
| దిగుబడి | : | వేసవి 820-980 కి./హె. |
| గింజ రకం | : | తెల్లగింజ రకం |
| కాలపరిమితి | : | వేసవి 91-95 రోజులు |
| నూనె శాతం | : | 44-49% |
| ప్రత్యేక లక్షణాలు | : | వేరు మరియు కాండం కుళ్లు, ఆకుమచ్చ మరియు వెర్రి తెగులును కొంత వరకు తట్టుకుంటుంది. |

**1.పొలాల ఎంపిక:** పసుపు మరియు మిరప పండించిన ప్రాంతాల్లో కూడా పంట తీసిన తరువాత నువ్వు పంట వేసుకోవడానికి అనుకూలంగా ఉంటుంది. చదునుగా ఉన్న పొలాన్ని పొడిదుక్కి చేసి సిద్ధంగా ఉంచుకోవాలి. పొడిదుక్కిలో విత్తనాలు బాగా మొలకెత్తుతాయి. నీటి వసతి ఉన్న పొలాలను ఎంచుకోవడం వల్ల పంట వివిధ కీలక దశల్లో బెట్టకు గురికాకుండా చూడవచ్చు. డ్రిప్ పద్ధతిలో నువ్వు సాగు వలన అధిక దిగుబడులు సాధించవచ్చు.

**2. ఎరువుల యాజమాన్యం:** తమకు అందుబాటులో ఉన్నంతమేర సేంద్రియ ఎరువులను బాగా మాగిన 4 టన్నుల పశువుల ఎరువు లేదా 1 టన్ను వర్మికంపోస్టు లేదా 1 టన్ను గొర్రెల ఎరువు లేదా 1 టన్ను కోళ్ళ ఎరువు వేసి కలియదున్నాలి. సేంద్రీయ ఎరువులు వాడుట వలన మంచి దిగుబడి సాధించవచ్చు. ప్రధాన పోషకాలను నత్రజని 16 కిలోలు, 8 కిలోల పొటాష్ మరియు 8 కిలోల భాస్వరాన్నిచ్చే ఎరువులు వేసుకోవాలి. విత్తిన 30 రోజులకు నీటితడి పెట్టుకొని ఎకరానికి మరో 18 కిలోల యూరియా పైపాటుగా మొక్కల మొదల్లో వేయాలి.

**3. విత్తన సేకరణ:**

**మోతాదు-సమయం విత్తుపద్ధతి:** విత్తనాన్ని వ్యవసాయ పరిశోధన స్థానాలు/తెలంగాణ సీడ్స్/యన్‌యస్‌సి/ నమ్మకమైన విత్తన రైతుల నుండి మాత్రమే సేకరించాలి.

విత్తన మొలకశాతం కనీసం 80 శాతానికి పైగా ఉండాలి. విత్తు సమయం విత్తన మోతాదు వేసవి (జనవరి రెండవ పక్షం నుండి ఫిబ్రవరి మొదటి పక్షం వరకు 2.5 కిలోల విత్తనం విత్తుకోవడానికి అనుకూలంగా ఉంటుంది. ఎకరాకు 2.5 కిలోల విత్తనానికి 7 కిలోల పొడి ఇసుకలో కలిపి వేసుకోవాలి. విత్తనాన్ని 2.5 సెం.మీ. లోతు మించకుండా వరుసలలో విత్తుకోవాలి.

పంటను వరుసలలో గొర్రు/ట్రాక్టరు నడిచే సీడ్‌డ్రిల్‌తో విత్తడం వల్ల వరుసల మధ్య దూరం (30 సెం.మీ.) మొక్కలు మధ్య దూరం (15 సెం.మీ.) గా నియంత్రించవచ్చు. రైతుస్థాయిలో పొడిదుక్కులో విత్తనాన్ని సమంగా చల్లుకుని గొర్రు తోలుకుంటారు.

**4.విత్తనశుద్ధి చేయుట:** పంటను తొలి దశలో ఆశించే తెగుళ్ళ నుండి కాపాడుకోవడానికి కిలో విత్తనానికి 3 గ్రా. మ్యాంకోజెబ్‌తో విత్తనశుద్ధి చేయాలి. అలాగే పంటను తొలిదశలో ఆశించే పురుగుల నుండి కాపాడడానికి ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ. కిలో విత్తనానికి కలిపి విత్తనశుద్ధి చేసుకోవాలి.





**5. కలుపు నివారణ:** విత్తిన 20 రోజులకు అదనపు మొక్కలను తొలగించి పలుచన చేయాలి. చేయని ఎడల మొక్క ఎత్తు బాగా పెరుగుతుంది మరియు ఆకులు మాత్రమే ఏర్పడి పూత మరియు కాత ఎక్కువగా రాక దిగుబడి తగ్గిపోతుంది. విత్తిన 30 రోజులకు మనుషులతో ఒకసారి కలుపు తీయించాలి.

**6. నీటి తడులు:** విత్తనాలు మొలకెత్తుటకు నేలలో సరిపడా తేమ ఉండాలి. అలాలేని పక్షంలో విత్తిన వెంటనే అదే రోజు నీటి తడిని ఇవ్వాలి లేని ఎడల మొలకశాతం దెబ్బతింటుంది. విత్తిన 4వ రోజు తేలికపాటి నీటితడి ఇవ్వాలి. దీని వలన మంచి మొలకశాతం వస్తుంది.

విత్తిన 12-15 రోజులకు మొదటి కలుపు తీసిన తర్వాత నీటితడి పెట్టుకోవాలి. విత్తిన 30-40 రోజుల నుండి 65-70 రోజుల వరకు నీటి ఎద్దడి లేకుండా చూడాలి. ఎందుకంటే ఈ సమయంలో పూత, కాతతో పాటు గింజలు నిండటం జరుగుతుంది.

**7. పంట కోత మరియు నూర్పిడి:** నువ్వులలో నాణ్యమైన మరియు అధిక మొలకశాతం కలిగిన విత్తనాన్ని పొందాలంటే పంటను సకాలంలో కోయాలి. విత్తనపంటను సరైన పక్వదశలో కోసినట్లైతే నాణ్యమైన విత్తనాన్ని పొందవచ్చు. త్వరగా లేదా ఆలస్యంగా కోయటం మరియు కోసిన తర్వాత ఎక్కువ రోజులు ఎండనివ్వటం చేయకూడదు. 75-80% కాయలు లేత పసుపు రంగుకి మారి క్రింది 1-2 కాయలు పగిలి ఉండాలి. కాయల్లో తేమ 50-60%, విత్తనాలలో తేమ 25-30% ఉండాలి. కోత ఆలస్యం చేసిన కాయలు పగిలి విత్తనాలు రాలిపోయి దిగుబడి తగ్గుతుంది. మొక్కలను కోసి పైకి కాయలు వచ్చేలాగా తిరిగి నిలబెట్టాలి. ఇలా చేయడం వలన పూర్తిగా పక్వం కాని కాయలు కూడా పక్వానికి వస్తాయి. ఇలా 5-7 రోజులు ఉంచిన తేమశాతం 15-18% కు తగ్గుతుంది. పంటను నూర్చే సమయంలో విత్తన కవచం దెబ్బతినకూడదు. విత్తనం ఎండబెట్టే సమయంలో నేరుగా సూర్యరశ్మి తగులకుండా జాగ్రత్తపడాలి. లేని ఎడల ఆ వేడికి విత్తన పొర దెబ్బతింటుంది.

ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతు ధరను కూడా ప్రతీ సంవత్సరం ప్రకటించడం జరుగుతుంది. కనీస మద్దతు ధరలను విశ్లేషిస్తే ప్రతీ సంవత్సరం పెరుగుదలను గమనించవచ్చు. ఈ పెరుగుదలను గనుక విశ్లేషిస్తే 2000-2001 సంవత్సరంలో నువ్వులకు కనీస మద్దతు ధర ఒక క్వింటాల్‌కు రూ. 1300/- ఉండగా, 2023-2024 సంవత్సరంకు ఒక క్వింటాల్ నువ్వులకు రూ. 8635/- ఉండడం జరిగింది. అంటే 9.47 శాతం వార్షిక వృద్ధి రేటుగా ఉంది. కనుక రైతులు నువ్వు పంటను సాగు చేసి వ్యవసాయంను లాభసాటి మార్గంలోకి తీసుకెళ్ళడానికి అవకాశం ఉంది.

**నువ్వుల వలన లాభాలు:**

- నువ్వుల వల్ల చాలా ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. ప్రధానంగా వీటిలో ఉండే ఫైబర్ కంటెంట్, విటమిన్లు అనేక అనారోగ్య సమస్యలకు చెక్ పెడతాయి.
- నువ్వులలో ఉండే అధిక మెగ్నీషియం నిల్వలు, బ్లడ్ ప్లెజర్ స్థాయిని తగ్గించి, గుండెజబ్బులు, ఇతర స్ట్రోక్‌ల నుండి కాపాడుతుంది.
- బోన్ హెల్త్ కోసం పనిచేసే కాల్షియం, మెగ్నీషియం, మాంగనీస్, జింక్ పుష్కలంగా ఉండి ఎముకల బలహీనతలను నివారించి, బలంగా ఉండటానికి ఔషధంగా పనిచేస్తాయి.
- ప్రతి రోజూ నువ్వులని ఆహారంలో భాగంగా చేసుకుంటే అధిక కొలెస్ట్రాల్, అధిక ట్రైగ్లిజరైడ్స్ స్థాయిలకు చెక్ పెట్టవచ్చు.
- నువ్వుల నూనెలో ప్రత్యేకంగా విటమిన్ కె, విటమిన్ బి కాంప్లెక్స్, విటమిన్ డి, విటమిన్ ఇ మరియు ఫాస్ఫరస్‌లను సమృద్ధిగా కలిగి ఉంటుంది.
- నువ్వుల్లో ఉండే సెలీనియం, థైరాయిడ్ పేషెంట్లకు మేలు చేస్తుంది.

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం.9959306929







# తేనెటీగల పెంపకం - ఉపఉత్పత్తులు

డా॥ వి.సునీత, డా॥ డి. స్నేహలత, డా॥ ఎమ్. ఉదయ్ కుమార్, డా॥ ఐ. అరుణ శ్రీ, డా॥ వి. రవిందర్ రెడ్డి,
డా॥ సి. వి. సమీర్ కుమార్, డా॥ పి. వెంకటేశ్వర్లు మరియు ఎ. వి. ఎల్. ఎన్. రావు
సకశేరుక చీడపీడల యాజమాన్యం, రాజేంద్రనగర్


మనం తీసుకునే ఆహారం ప్రత్యక్షంగా (లేదా) పరోక్షంగా తేనెటీగల మీద ఆధారపడి ఉంటుంది. ఇది ముఖ్యంగా పరపరాగ సంపర్కంలో సహాయపడి అధిక దిగుబడులు పొందడంలో దోహదపడుతున్నాయి. అంతేకాకుండా వీటిని పెంచడం ద్వారా ఇతర ఉపఉత్పత్తులు అనగా తేనె, రాజాహారం/ రాయల్ జెల్లీ, పుప్పొడి, మైనం, 'బీ బ్రెడ్' తేనెటీగ విషం మరియు ప్రొపోలిస్ కూడా పొందవచ్చు.

**తేనెటీగల విషం:** తేనెటీగ విషాన్ని "ఎపిటాక్సిన్" అని పిలుస్తారు. తేనెటీగ కుట్టించే విధానాన్ని "ఎపిథెరపీ" అంటారు. ఇవి కుట్టడం వలన ఆర్థ్రరైటిస్ వంటి వ్యాధుల చికిత్సలో విస్తృతంగా ఉపయోగపడుతుంది. తేనెటీగ విషంలో 'యాంటీ ఇన్ఫ్లమేటరీ', 'యాంటీ ఆక్సిడెంట్', 'యాంటి ఫంగల్', 'యాంటీ మైక్రోబియల్' లక్షణాలను కలిగి ఉండుట వలన ఈ విషం మానవులకు అత్యంత విలువైనది. ఈ విషాన్ని సేకరించి ఇంజక్షన్‌లు తయారు చేస్తారు. ఒక కిలో తేనెటీగ విషం ఖరీదు సుమారు రూ॥ 70,00,000/- వరకు ఉంటుంది.

**తేనెటీగ పుప్పొడి:** పుప్పొడిని తేనెటీగలు పుష్పాల నుండి సేకరించి వాటి వెనుక జత కాళ్ళభాగంలో రవాణా చేస్తాయి. తేనెటీగ పుప్పొడిలో వివిధ పోషకాలు కలిగి ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచడంలో దోహదపడతాయి.

- తేనెటీగ పుప్పొడిలో 'యాంటీ ఈస్ట్రోజన్' లక్షణాలను కలిగి ఉన్నందున ఈ సూపర్‌ఫుడ్ రొమ్ము క్యాన్సర్ ప్రమాదాన్ని కూడా తగ్గిస్తుంది, అంతే కాకుండా ఇది మన నాడీ వ్యవస్థకు, రక్త ప్రసరణను మెరుగు పరుస్తుంది.
- తేనెటీగ పుప్పొడి ఆరోగ్య ప్రయోజనాలు కలిగి ఉన్నప్పటికీ దానిని పరిమిత పరిమాణంలో తీసుకోవడం ఉత్తమం. ఇంకా పుప్పొడి ఎలర్జీలు ఉన్నవారికి (లేదా) గర్భిణీ (లేదా) తల్లిపాలు ఇస్తున్న మహిళలకు తేనెటీగ పుప్పొడి మంచిది కాదు. దీర్ఘకాలిక ఔషధాలను తీసుకునే వారు తమ ఆహారంలో తేనెటీగ పుప్పొడిని చేర్చేముందు వైద్యులను సంప్రదించడం ఉత్తమం. పుప్పొడిలో అధిక పోషక విలువలుండటం మూలానా దీనిని ఔషధంగా, ఆహారం, కాస్మోటిక్ పరిశ్రమలలో విరివిగా ఉపయోగిస్తున్నారు.
- **తేనె:** ప్రకృతి సహజ సిద్ధమైన తేనెవల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. తేనెలో 'యాంటీ బ్యాక్టీరియల్'





మరియు 'యాంటీ మైక్రోబియల్' లక్షణాలు ఉండటం వలన కాలిన గాయాలు మాన్పడంలో మరియు చర్మ సౌందర్యం పెంపొందించడంలో కూడా ఉపయోగిస్తారు. తేనెలో కొన్ని రకాల తేమ గుణాలు కలిగించే లక్షణాలు ఉండుట వలన సులభంగా చర్మం తేమగా ఉంచుటలో ఉపయోగపడుతుంది.

- తేనె గ్లూకోస్ వంటి చక్కెరలను కలిగి ఉంటుంది. అంతేకాక ఇతర ఖనిజలవణాలు అయినటువంటి ఫ్రక్టోస్, మెగ్నీషియం, పొటాషియం, కాల్షియం, సోడియం, క్లోరిన్, ఐరన్ మరియు ఫాస్ఫేట్ వంటి పోషకాలను కలిగి ఉంటుంది.
- తేనె వినియోగం వలన రక్తహీనత తగ్గుతుంది.
- తేనె స్థూలకాయాన్ని నియంత్రించడంలో కీలకపాత్ర పోషిస్తుంది. ఇది క్రమంగా శరీరంలో ఎక్కువగా ఉన్న క్రొవ్వును కరిగించి జీవక్రియను వేగవంతం చేయడానికి సహాయపడుతుంది.

**తేనెటీగ మైనం:** తేనెటీగ మైనం అనేది తేనెగూడును నిర్మించడానికి కూలీ ఈగలు తమ మైనపు గ్రంథుల నుండి ఉత్పత్తి చేస్తాయి.

- ఇది క్రొవ్వొత్తులు, చర్మ సౌందర్య సాధనాలు మరియు కలప పాలీష్‌లలో వివిధ రకాల ఔషధాల తయారీలో, బట్టల పరిశ్రమలో, వాటర్‌ప్రూఫ్/ జల నిరోధిత కాగితపు పరిశ్రమలో దీనిని ఉపయోగిస్తున్నారు.

**ప్రొపోలిస్:** అనేది మైనం మరియు రెసిన్‌ల మిశ్రమం. దీనిని తేనెటీగలు చెట్ల యొక్క జిగురు, బంక, మైనం, రెసిన్‌ల నుండి సేకరిస్తాయి. ఇటువంటి పదార్థాలు మొక్క యొక్క మొగ్గలు మరియు బెరడు నుండి ఉత్పత్తి చేయబడుతాయి.

- ప్రొపోలిస్‌లో 'యాంటీ బ్యాక్టీరియల్', 'యాంటీ వైరల్' 'యాంటీ ఫంగల్' మరియు యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలను కలిగి ఉండుట వలన ఆహార పరిశ్రమలలో ఉపయోగిస్తున్నారు మరియు గాయాలను నయం చేయగలదు.
- హృద్రోగ, రక్త సంబంధిత, క్యాన్సర్, అల్సర్ వంటి రోగాలను నియంత్రించడంలో కూడా ఔషధంగా వాడుతున్నారు.
- ప్రొపోలిస్‌కు గాయాలను మాన్పే శక్తి ఉంది. నోటి శుభ్రతను కాపాడటంలో సహాయపడుతుంది.

**రాజాహారం/ రాయల్ జెల్లీ:** రాజాహారంని 'బీ మిల్క్' అని కూడా పిలుస్తారు. ఇది కూలీ ఈగల నుండి ప్రవించబడుతుంది. మొదటి 3 రోజుల దశలో ఉన్న రాణి ఈగ, కూలీ ఈగ, మరియు పోతు ఈగల లార్వాలకు ఆహారంగా ఉపయోగపడుతుంది మరియు రాణి ఈగకు జీవితకాలం దీనిని ఆహారంగా ఇస్తుంది.

రాయల్ జెల్లీలో ఫేషియల్ క్రీమ్‌లలో మరియు స్కిన్ కండీషన్ వంటి సౌందర్య సాధనాలలో ఉపయోగించబడుతుంది. ఉదర, కాలేయ, జీర్ణకోశ సంబంధ వ్యాధుల నివారణలో మరియు బరువు తగ్గడంలో రక్తపీడనం తగ్గించడంలో ఉపయోగిస్తారు.

రాయల్ జెల్లీలో 60-70% నీరు, 12-15% ప్రోటీన్‌లు, 10-16% చక్కెర, 3-6% క్రొవ్వు, 2-3% విటమిన్‌లు, లవణాలు మరియు అమైనో ఆమ్లాలు ఉంటాయి.

ఇతర వివరములకు సంప్రదించవలసిన
ఫోన్ నెం. **9985581919**



# ప్రత్తి పంట తర్వాత వేసవిలో వేసుకోదగ్గ పంటలు

డా॥ టి. ప్రభాకర్ రెడ్డి, డా॥ ఎన్. లావణ్య, కె. జ్ఞానేశ్వర్ నారాయణ, డా॥ బి. రాజశేఖర్, డా॥. ఓ. శైల, కె. రామకృష్ణ, డా॥ ఆదిశంకర్ మరియు ఇ. జ్యోత్స్న

కృషి విజ్ఞాన కేంద్రం, పాలెం





తెలంగాణ రాష్ట్రంలో ప్రత్తి పంట వానాకాలంలో సుమారు 45 లక్షల ఎకరాలలో సాగయింది. అయితే వానాకాలం ప్రత్తి పంట తర్వాత వేసవి పంట కాలంలో కొద్దిపాటి నీటి వసతి ఉన్నప్పుడు జనవరి నుండి ఫిబ్రవరిలో వేసుకోదగిన ఆరుతడి పంటలు మరియు అనుకూల రకాలను ఎంచుకోవాలి. నేల యొక్క రకాన్ని బట్టి నీటి వసతిని బట్టి మరియు విత్తే సమయాన్ని బట్టి వేసవికి అనువైన పంటలను ఎంచుకోవాలి.

**వేసవి అపరాల సాగు:** జనవరి రెండవ వారం నుండి మార్చి మొదటి వారం వరకు పెసర మరియు మినుమును సాగు చేయవచ్చు. ఎర్ర చల్కా నేలలు, నల్లరేగడి నేలలు మరియు సారవంతమైన నేలలు అనుకూలం. ఈ పంటలకు 3-4 నీటి తడులు సౌకర్యం ఉన్నప్పుడు సాగుకు అనుకూలం. పెసరలో యం.జి.జి-225, డబ్ల్యూ.జి.జి-42, యం.జి.జి-348 రకాలు వేసవి సాగుకు అనువైనవి. ఈ రకాలు 60-65 రోజులలో కోతకు వచ్చి ఎకరాకు సగటున 5-6 క్వింటాళ్ళ దిగుబడినిస్తాయి. మినుములో తేజ (జి.బి.జి-1), టి.బి.జి-104, ఎల్.బి.జి-752, ఎల్.బి.జి-787, యం.బి.జి-1070 రకాలు జనవరిలో విత్తుకోవడానికి అనువైనవి. ఈ రకాలు 75-80 రోజుల్లో కోతకు వచ్చి ఎకరానికి సగటున 6-8 క్వింటాళ్ళ దిగుబడి ఇస్తాయి. ఎకరానికి 10-12 కిలోల విత్తనాన్ని వరుసల మధ్య 30 సెం.మీ. మొక్కల మధ్య 10 సెం.మీ. దూరంలో పదునులో విత్తుకోవాలి. కిలో విత్తనానికి 5 మి.లీ. ఇమిడాక్లోప్రిడ్ కలిపి విత్తనశుద్ధి చేసినట్లైతే 15 నుండి 20 రోజుల వరకు రసం పీల్చే పురుగుల బారి నుండి రక్షించుకోవచ్చు.

### ఇతర వేసవి పంటలు

**ప్రొద్దుతిరుగుడు:** వేసవిలో నీటి పారుదల క్రింద జనవరి రెండవ పక్షం నుండి ఫిబ్రవరి మొదటి పక్షం వరకు ప్రొద్దుతిరుగుడు విత్తుకోవాలి. విత్తు సమయం కూడా నూనె నాణ్యతను పెంచుతుంది. కెబిఎస్‌హెచ్-44, డిఆర్ఎస్‌హెచ్-1, ఎన్ఆర్ఎస్‌హెచ్-1 రకాలు వేసవికి అనువైనవి. పంటకాలం 90-95 రోజులు ఎకరానికి 3 కిలోల విత్తనం అవసరమవుతుంది. వరుసల మధ్య 45 సెం.మీ. మొక్కల మధ్య 20 సెం.మీ. దూరంలో పదునులో విత్తుకోవాలి. విత్తే సమయంలో 20 కిలోల యూరియా, 4 బస్తాల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ మరియు 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ 30 రోజుల తర్వాత 20 కిలోల యూరియా మరియు 60 రోజుల తర్వాత 20 కిలోల యూరియా వేసుకోవాలి. పంట పూత దశలో ఉన్నప్పుడు 2 గ్రా. బోరాక్స్ లీటరు నీటికి చొప్పున కలిపి పంటపై పిచికారి చేయాలి. పువ్వు వికసించే మరియు విత్తనం గట్టిపడే సమయంలో ఎక్కువ పగలు (12 గంటలు) మరియు సూర్యరశ్మి ఉన్నట్లైతే నూనె శాతం ఎక్కువ

వస్తుంది. ప్రొద్దుతిరుగుడు వేసవిలో ఉష్ణోగ్రత, సూర్యరశ్మిలో తేడాలున్నా తట్టుకొని అధిక దిగుబడినిచ్చే శక్తి ఉంటుంది.

**నువ్వులు:** నువ్వుల పంటను జనవరి 15 నుండి ఫిబ్రవరి 15 వరకు విత్తుకోవచ్చు. తెల్ల గింజ రకాలైన రాజేశ్వరి, శ్వేతాతిల్, హిమ, జె.సి.ఎస్-1020, గోధుమ గింజ రకాలైన చందన, ఎలమంచిలి-66 రకాలు సాగుకు అనుకూలంగా ఉన్నాయి. ఎకరాకు 2.5 కిలోల విత్తనాన్ని మూడింతల ఇసుక కలిపి గొర్రుతో వరుసల్లో వేసుకోవాలి. నేల స్వభావాన్ని బట్టి పంటకాలంలో 3-4 తడులు అవసరమవుతాయి. పూత దశలో బెట్ట పరిస్థితులు ఏర్పడకుండా చూసుకోవాలి. ఎకరానికి మూడు నుండి నాలుగు క్వింటాళ్ళ దిగుబడి వస్తుంది.

**శనగ:** వేరుశనగను జనవరి మొదటి వారం నుండి చివరి వరకు విత్తుకోవాలి. కె6, కె9, ధరణి, ట్యాగ్-24, టి.సి.జి.ఎస్-1694 అనువైన రకాలు. పంటకాలం 110 రోజులు ఉంటుంది. ఈ పంటకు తేలిక నేలలు మరియు తుంపర పద్ధతి ద్వారా నీటి యాజమాన్యం అనుకూలమైనవి. వేరుశనగకు తేలిక నేలలో 8-9 తడులు అవసరం నీటిని తుంపర్ల ద్వారా ఇచ్చినట్లైతే 25 శాతం సాగు నీటి ఆదాతో పాటు దిగుబడి పెరుగుతుంది.

**సజ్జ:** వేసవి సజ్జ పంటను జనవరి మాసంలో విత్తుకోవచ్చు. ఈ పంటను తేలికపాటి ఎర్రనేలల్లో తక్కువ కాలంలో తక్కువ పెట్టుబడితో సాగు చేసుకోవచ్చు. పంటకాలం 80-85 రోజులు సాగుకు అనుకూల హైబ్రిడ్‌లు పి.హెచ్.బి-3, హెచ్.హెచ్.బి -67, ఆర్.హెచ్.బి-121, వేసవికి అనుకూలం. వెర్రికంకి తెగులును తట్టుకుంటుంది. ఎకరాకు 2 కిలోల విత్తనం సరిపోతుంది. నేరుగా విత్తడానికి సాళ్ళ మధ్య 45 సెం.మీ. మరియు మొక్కల మధ్య 10 సెం.మీ. దూరంలో విత్తుకోవాలి. ఎకరాకి 35 కిలోల నత్రజని, 16 కిలోల భాస్వరం మరియు 15 కిలోల పొటాష్ ఎరువులో వేయాలి.

**రాగి:** వేసవి రాగి పంటను జనవరి మాసంలో విత్తుకోవాలి. ఎకరాకు 2 కిలోల విత్తనాన్ని 5 సెంట్లలో (200 చ.మీ.) నారు పెంచి ఎకరా పొలంలో నాటుకోవచ్చు. స్వల్పకాలిక రకాలు 85-90 రోజులలో కోతకు వస్తాయి.

**పుచ్చ సాగు:** పుచ్చ, కర్బూజ పంటలను తొందరగా కాపుకు రావడానికి జనవరిలో విత్తుకోవాలి. 2 నుండి 2.5 మీటర్ల ఎడంతో 60 సెం.మీ. వెడల్పు గల నీటి కాలువలను తయారు చేసుకొని కాలువకు ఇరువైపులా 40 సెం.మీ. ఎడంతో విత్తుకోవాలి. ఈ పద్ధతిలో ఎకరానికి 500 గ్రా. విత్తనం సరిపోతుంది. బిందు సేద్యం ఏర్పాటు చేసుకున్నట్లైతే తక్కువ నీటితో అధిక దిగుబడిని పొందవచ్చు. మొక్క ఎదిగే దశలో, కాయ పెరిగే దశలో పుచ్చ పంటకు నీరు అవసరం.

ప్రత్తి పంటను ఏక పంటగా 6 నుండి 7 నెలల వరకు సాగు చేయడం వలన గులాబి రంగు పురుగు ఉధృతి ఎక్కువై పంట తర్వాత కూడా వాటి కోశస్థ దశలు భూమిలోనే ఉండి మరలా వానాకాలంలో వేసే ప్రత్తి పంటను నష్టపరుస్తుంది. అంతేగాక లోతైన వేరువ్యవస్థ గల ప్రత్తి పంట యొక్క కాలం పొడిగించడం వలన నేలలోని పోషకాలను ఎక్కువ మొత్తంలో తీసుకోవడం వలన పోషకాలు తగ్గి నేల నిస్సారమవుతుంది. కాబట్టి కొద్దిపాటి నీటి వసతి అందుబాటులో ఉన్నప్పుడు ప్రత్తి పంటను తీసివేసి పైన సూచించిన పంటలు వేసుకోవడం వలన తక్కువ పంట కాలంలో అధిక దిగుబడులతో పాటు నికరాదాయం పొందే అవకాశం ఉంటుంది.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9848774820**







# వ్యవసాయ పదవినోదం

**కూర్పు : డా॥ కె. వాణిశ్రీ**

| | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | | | | | | | | 2 | | 3 |
| | | | | | 3 | 5 | | | | | |
| | | | | | | | | | | | |
| | | | | | | | | | | | |
| | 4 | | | | 5 | | | | | | |
| | | | | | | | | | | | |
| | 6 | | | | | | | | | | |
| | | | | | | | 6 | | | | |
| | | | | | 7 | | | | | | |
| | | | | | | | | | | | |


### అడ్డం

1. వివిధ పంటల్లో ఆశించే నల్లి నివారణకు ఉపయోగించే కీటకనాశిని? (3) కుడి నుండి ఎడమకు
2. ఈ పచ్చిరొట్ట పైరు కాండం నుండి నారను కూడ సంగ్రహించవచ్చును (3)
3. అలహాబాద్ సఫేద ఏ పంట రకం (2)
4. ప్రోటీనులు అధికంగా ఉండే పండు (3)
5. తెలంగాణలో ఈత, తాటి ఉత్పత్తుల పెంపుదల కోసం ఉద్యాన పరిశోధన స్థానం ఎక్కడ ఏర్పాటు చేశారు (6)
6. ఎండు తెగులును కొంత వరకు తట్టుకునే మధ్యస్థ నేలలు తక్కువ వర్షపాతం గల ప్రాంతాల్లో సాగుకు అనుకూలమైన కంది రకం? (6)
7. కాలీఫ్లవర్‌లో నత్రజని లోపం వల్ల చిన్న చిన్న పూలు ఏర్పడటాన్ని ఏమంటారు? (4)

### నిలువు

1. వరిలో ఏ పురుగు ఆశించినప్పుడు దుర్వాసన వస్తుంది? (3)
2. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం నుండి విడుదల కాబడిన వేరుశనగ రకం? (7)
3. పి.కె.యం-1 అనే రకం ఏ పంటకు సంబంధించింది? (3)
4. యాసంగి వరిలో ఎక్కువగా ఆశిస్తున్న తెగులు పేరు? (5)
5. ఐ.సి.పి. హెచ్-2740 హైబ్రిడ్ కంది రకం పేరు? (6)
6. కాలీఫ్లవర్‌లో బోరాన్ లోపం వలన పువ్వుపై గోధుమ రంగు మచ్చలు ఏర్పడటాన్ని ఏమంటారు? (3)

సమాధానాలు 43వ పేజీలో



# వ్యవసాయ మార్కెట్ ఇంటలిజెన్స్

డా॥ ఆర్. విజయ కుమారి, జి. రామకృష్ణ, పి. వెంకటేష్ మరియు ఏ. శ్రీనివాస్
వ్యవసాయ ఆర్థిక శాస్త్ర విభాగం, వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్, హైదరాబాద్

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో వ్యవసాయ ఆర్థిక శాస్త్ర విభాగం, వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్‌లో వ్యవసాయ మార్కెట్ ఇంటలిజెన్స్ కేంద్రంను ఒక పరిశోధన పథకంగా వ్యవసాయ పంటల ముందస్తు ధరలను అంచనా వేయుటకు తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ వారి ఆర్థిక సహాయంతో స్థాపించడం జరిగింది. ఈ కేంద్రం 2023-24 సంవత్సరం వానాకాలం (ఖరీఫ్), యాసంగి (రబీ) మరియు ఎండాకాలంలో సాగు చేసే వివిధ రకాల పంటల ముందస్తు ధరలను పంట కోత సమయంలో ఏవిధంగా ఉండునో అంచనా వేయడం జరిగింది. ఈ ముందస్తు ధరలను అంచనా వేయుటకు రాష్ట్ర ప్రధాన మార్కెట్లలోని 21 సం॥ ల నెలవారీ మోడల్ ధరలు మరియు 6 సంవత్సరాల పక్షం రోజుల మోడల్ ధరలను తీసుకొని విశ్లేషణ చేయడం జరిగింది. ఈ విశ్లేషణ ఫలితాలు మరియు మార్కెట్ సర్వేలను అనుసరించి 2023-24 వానాకాలం, యాసంగి మరియు ఎండాకాలం పంట కోత సమయంలో ధర ఏ విధంగా ఉండునో అంచనా వేయడం జరిగింది దానిని అనుసరించి

### 2023-24 వానాకాలం (ఖరీఫ్) పంట కోత సమయంలో వివిధ పంటల ధరలు

| క్ర.సం | పంటలు | ప్రధాన మార్కెట్ | అంచనా ధరలు వర్తించు సమయం | అంచనా ధరలు (రూ./క్వి). |
|---|---|---|---|---|
| 1. | కంది | తాండూర్ | జనవరి-ఫిబ్రవరి | 8400-8700 |
| 2. | మిరప | ఖమ్మం | జనవరి-మార్చి | 18500-19500 |

### 2023-24 యాసంగి (రబీ) పంట కోత సమయంలో వివిధ పంటల ధరలు

| క్ర.సం | పంటలు | ప్రధాన మార్కెట్ | అంచనా ధరలు వర్తించు సమయం | అంచనా ధరలు (రూ./క్వి). |
|---|---|---|---|---|
| 1. | మొక్కజొన్న | బాదేపల్లి | జనవరి-మార్చి | 2090-2320 |
| 2. | శనగలు | నారాయణపేట | జనవరి-ఫిబ్రవరి | 4800-5000 |
| 3. | వేరుశనగ | గద్వాల్ | జనవరి-మార్చి | 6250-6550 |
| 4. | ప్రొద్దుతిరుగుడు | సిద్ధిపేట్ | జనవరి-మార్చి | 4300-4600 |

### 2023-24 ఎండాకాలం పంట కోత సమయంలో వివిధ పంటల ధరలు

| క్ర.సం | పంటలు | ప్రధాన మార్కెట్ | అంచనా ధరలు వర్తించు సమయం | అంచనా ధరలు (రూ./క్వి). |
|---|---|---|---|---|
| 1. | టమాటా | బోయినపల్లి | మార్చి-ఏప్రిల్ | 1100-1300 |
| 2. | వంకాయ | బోయినపల్లి | మార్చి-ఏప్రిల్ | 1310-1550 |
| 3. | బెండ | బోయినపల్లి | మార్చి-ఏప్రిల్ | 3000-3300 |
| 4. | బత్తాయి | గడ్డిఅన్నారం | అక్టోబర్-నవంబర్ | 3700-3900 |
| 5. | మామిడి | గడ్డిఅన్నారం | మార్చి-మే | 3580-4250 |


ముందస్తు ధరల గురించిన సమాచారం కోసం దిగువ ఇవ్వబడిన ఫోన్ నెంబర్లని సంప్రదించగలరు.
మొబైల్ నెం. : 9948780355, 9154828514, ఈ మెయిల్ : amic.pjtsau@gmail.com
వెబ్ సైట్ : https://pjtsau.edu.in/agri-marketing-intelligence.html

**గమనిక :** గత 20 సంవత్సరాల ధరలను విశ్లేషించి పైన తెలిపిన ధరలను వివిధ పంటల ముఖ్య మార్కెట్లలో అంచనా వేయడం జరిగింది. పంట రకము, నాణ్యత, అంతర్జాతీయ ధరలు, ఎగుమతి లేదా దిగుమతి పరిమితుల మూలంగా అంచనా ధరలలో మార్పు ఉండవచ్చును, కావున భవిష్యత్‌లో పంటల ధరల మార్పునకు ఈ కేంద్రం ఏ విధమైన బాధ్యత వహించదు.


# సుస్థిర వ్యవసాయంలో వానపాముల పాత్ర

డా॥ వి. వెంకట్ రెడ్డి, డా॥ సిహెచ్. అనూష, కె. మానస, కె. స్వాతి, సుహాసిని మరియు డా॥ ఎం. బలరాం
వ్యవసాయ కళాశాల, వరంగల్






**సుస్థిర వ్యవసాయం అంటే ఏమిటి?**

సుస్థిర వ్యవసాయం అంటే పర్యావరణం మరియు జీవజాతులను రక్షించే వివిధ వ్యవసాయ పద్ధతులను ఉపయోగించి మొక్కలు లేదా జంతువుల నుండి ఆహారాన్ని ఉత్పత్తి చేయడం.

పంట దిగుబడి పెంచడానికి రసాయన పురుగుల మందులు మరియు ఎరువులను విస్తృతంగా ఉపయోగించడం వల్ల దిగుబడి మరియు ఉత్పాదకత పొందవచ్చు, కానీ ఈ ఎరువులతో వ్యవసాయం ప్రపంచ వ్యాప్తంగా రోజు రోజుకు నేల ఉత్పత్తి సామర్థ్యం క్షీణించటానికి, కారణం అవుతుంది.

**సుస్థిర వ్యవసాయంలో వానపాముల పనితీరు:** వానపాములను రైతు మిత్రుడు, పొలం దున్నేవారు, భూమి యొక్క ప్రేగులు, పర్యావరణ ఇంజనీర్లు మరియు జీవ సూచికలు అని కూడా పిలుస్తారు. వానపాములు వివిధ రకాల సేంద్రియ వ్యర్థ పదార్థాలను పోషకాలు అధికంగా ఉండే ఉత్పత్తులుగా మార్చడం ద్వారా నేల యొక్క భౌతిక రసాయనిక లక్షణాలను పెంపొందిస్తాయి మరియు వాటి బొరియల నుండి విడుదలయ్యే మల పదార్థాన్ని (వర్మీకాస్ట్) ఉపరితలంపై జమచేస్తాయి.

**సాధారణంగా మూడు రకాల వానపాములు నేలలో ఉంటాయి:**

1. **భూమి లోతైన పొరలలో నివసించే వానపాములు: ఉదా: లాంపిటా మారుతి**

ఈ వానపాములు భూమిలో లోతైన మరియు శాశ్వతమైన బొరియలు చేసుకొని జీవిస్తాయి. రాత్రిపూట మాత్రమే బొరియలు నుండి భూమి ఉపరితలానికి వచ్చి సేంద్రియ పదార్థాన్ని తింటాయి. కావున ఈ వానపాములు వర్మికంపోస్ట్ తయారీకి అనువైనవి కావు.

2. **భూమి లోపల పొరలలో నివసించే వానపాములు ఉదా: పెంటాస్కొలెక్స్ మరియు ద్రావిడా**

ఈ వానపాములు భూమిలో తక్కువ లోతైన బొరియలు చేసుకొని నివసిస్తాయి. ఇది నేలలో ఉన్న సేంద్రియ పదార్థాన్ని తింటాయి. ఇవి భూమి ఉపరితలానికి అరుదుగా వస్తాయి. కావున ఇవి వర్మికంపోస్ట్ తయారీకి అనువైనవి కావు.

3. **భూమి ఉపరితలం మీద నివసించే వానపాములు ఉదా: ఐసినియా పోయిటిడా**

ఈ వానపాములు భూమిపై పొరలలో బొరియలు చేసుకొని సేంద్రియ పదార్థాన్ని తింటాయి. కావున ఇవి వర్మికంపోస్ట్ తయారీకి అనువైనవి. ఇవి శాశ్వత బొరియలు ఏర్పాటు చేయవు. ఉదా: యుడ్రిల్లస్ యుజినియ, పెరియోనిక్స్ ఎక్సకవేటస్

వానపాములు హెర్మాఫ్రొడైటాలు అనగా ప్రతి వానపాము లో మగ మరియు ఆడ రెండు అవయవాలు ఉంటాయి. అవి భూమి యొక్క లోపల నుండి మట్టిని పైపొరల్లోకి తీసుకువచ్చే అవిశ్రాంతంగా పని చేసే జీవులు. ఈ వానపాములు నేలలో లోతుగా సొరంగం చేసి భూసారాన్ని ఉపరితలానికి తీసుకుని, మట్టితో కలుపుతాయి. దీనితో పాటు అతి చిన్న పరిమాణం కలిగిన సరళ సొరంగాల సమూహంగా ఏర్పడుతాయి. వానపాములు చనిపోయిన తర్వాత కూడా సొరంగాలు ఎక్కువ కాలం ఉంటాయి. ఈ సొరంగాలు నీటిని భూగర్భంలోకి చొప్పించడాన్ని సులభతరం

చేస్తాయి మరియు నీటి ప్రవాహాన్ని తగ్గిస్తాయి. వర్షపు నీటిని నేలలో నిల్వ చేయడంలో సహాయపడుతుంది. అటువంటి నిల్వ తేమ నెమ్మదిగా వేసవికాలంలో పంటకు విడుదల అవుతుంది.

ఇవి నేలలో సూక్ష్మ రంధ్రాలను ఏర్పాటు చేయడం వలన నీటి చొరబాటు రేటును పెంచుతాయి మరియు నేలకోతను తగ్గిస్తాయి. కొన్ని అధ్యయనాల ప్రకారం వానపాములు విటమిన్ బి మరియు విటమిన్ డి వంటి కొన్ని ఎంజైములను నేలలోకి విడుదల చేస్తాయి. ఇవి మొక్కల పెరుగుదలకు దోహదపడుతాయి. వానపాములు భూమిని సారవంతమైన భూమిగా మార్చగలవని మరియు వ్యవసాయ ఉత్పత్తిని పెంచగలవని వివిధ అధ్యయనాలు తెలియజేస్తున్నాయి. వర్మికాస్ట్‌లో ఉండే హ్యూమిక్ ఆమ్లాలు మరియు హార్మోన్లు పంట దిగుబడి పెంచుతాయి. వర్మికంపోస్ట్‌ను రసాయనిక ఎరువులతో పాటుగా, సమీకృత పోషకాల నిర్వహణలో పంటలలో రసాయనిక ఎరువుల వాడకం గణనీయంగా తగ్గుతుంది. ఈ సేంద్రియ పదార్థం ఉపయోగం వలన వివిధ మార్గాల్లో మొక్కలు పెరుగుదలను మెరుగుపరుస్తుంది. అనగా ఆకుల సంఖ్య, విత్తనాలు మొలకశాతం వేరు బయోమాస్, పండ్ల ఉత్పత్తి, విత్తనాల సంఖ్య మరియు దిగుబడి గణనీయంగా పెరుగుతుంది. ఇది చెక్కర, నూనె మరియు ప్రోటీన్ సమ్మేళనాలను పెంచడం ద్వారా పంటల పోషక నాణ్యతను మెరుగుపరుస్తుంది. నేలలోని ఈ చిన్నజీవులు మానవాళికి తమ అమూల్యమైన సేవలను అందిస్తూ ఉండేలా సంరక్షించడం అత్యంత అవసరం.

**నేలలో వానపాముల సంతతి పెంచే మార్గాలు:**

1. మోతాదుకు మించి రసాయనిక ఎరువులను పంటలలో వాడరాదు.
2. సిఫారసుకు మించి పురుగు మందులను వాడరాదు.
3. ప్రతి సంవత్సరం కాంపోస్ట్ లేదా పచ్చిరొట్ట ఎరువులను పొలంలో వేయాలి.
4. పంట పొలంలో ప్లాస్టిక్ లేదా పరిశ్రమల వ్యర్థాలను వేయరాదు.
5. నేలలో తగినంత తేమ ఉండాలి.
6. పొలంలో నీటి పారుదల వ్యవస్థ సరిగా ఉండాలి.
7. నేల గట్టిగా ఉండకూడదు మరియు బరువైన వ్యవసాయ పనిముట్లను నేలలో వాడరాదు.
8. వీలైనంత వరకు తక్కువగా పొలంను దున్నాలి మరియు భూమిపై పొరల వరకు మాత్రమే దున్నడం మంచిది.

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9908186020

**పి.జె.టి.యస్.ఏ.యు వారి రేడియో కార్యక్రమం చేనుకబుర్లు ప్రతి బుధవారం మధ్యాహ్నం 1:30 నుండి 2:30 వరకు ఆకాశవాణి, హైదరాబాద్-ఏ స్టేషన్ నుంచి ప్రసారమవుతుంది.**

| తేది | అంశం |
|---|---|
| 03-01-2024 | భూసార పరీక్ష ప్రాముఖ్యత |
| | చిరుధాన్యాల ప్రాముఖ్యత (ఇంటర్వ్యూ) |
| 10-01-2024 | పశుగ్రాసాల నిలువ పద్ధతులు |
| | అనుబంధ ఆహారం (ఇంటర్వ్యూ) |
| 17-01-2024 | మిరుమిట్లు గొలిపే మొక్కజొన్న సాగు |
| | మహిళల హక్కులు |
| 24-01-2024 | వేరుశనగ సాగు వెలితి ఇక లేదు |
| | బాల్య వివాహం |
| 31-01-2024 | చిరుధాన్యాల ప్రాసెసింగ్ - సిరులు కురిపించేగా! |
| | ధూమపానం యొక్క చెడు ప్రభావాలు |

# పట్టు పురుగుల పెంపకంలో రోగ నిరోధక చర్యలు - ఆవశ్యకత

డా॥ ఎస్. ఉపేందర్ మరియు డా॥ కె. వాణిశ్రీ
వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్





పట్టు పురుగుల పెంపకంలో రోగనిరోధక చర్యలను విధిగా పాటించడం ద్వారా నాణ్యమైన మరియు అధిక దిగుబడి సాధించవచ్చును. ప్రతి పంట పెట్టే ముందు మరియు ప్రతి పంట తీసిన తర్వాత పెంపకంలో ఉపయోగించే పరికరములను రోగనిరోధక ద్రావణంలో తప్పనిసరిగా శుభ్రపరచాలి.

**ప్రస్తుతం మార్కెట్‌లో విరివిగా లభ్యమయ్యే రోగ నిరోధకాలు**

1. 2 శాతం బ్లీచింగ్ పౌడర్ గల 0.3% సున్నపు పొడి ద్రావణం
2. 2.5 శాతం శానిటిక్ ద్రావణంలో 0.5% శాతము సున్నపు పొడి ద్రావణం
3. అస్త్ర ద్రావణం

**2 శాతం బ్లీచింగ్ పౌడరు గల 0.3 శాతం సున్నపు పొడి ద్రావణం తయారు చేయడం:**

- వ్యాపార యోగ్యమైన బ్లీచింగ్ పౌడరులో సగటున 20% క్లోరిన్ ఉంటుంది. శుద్ధి ప్రక్రియకు 0.4% క్లోరిన్ అవసరం కాబట్టి 2 శాతం బ్లీచింగ్ పౌడర్‌ను వాడతారు. దీనిని 0.3% కాల్చిన సున్నంతో కలిపిన మిశ్రమాన్ని వాడినప్పుడు వ్యాధి క్రిములు నశింపబడును.
- ముందుగా 60 గ్రా. కాల్చిన సున్నపు పొడిని 20 లీ. నీటిలో కరిగించాలి.
- 400 గ్రా. బ్లీచింగ్ పౌడర్‌ను పైన తయారు చేసిన ద్రావణంలో అర లీటరు తీసుకొని దానిలో కరిగించి పేస్టుగా తయారు చేయాలి.
- ఈ బ్లీచింగ్ పౌదరు పేస్టుకు మిగిలిన సున్నపు నీటిలో బాగా కరిగించాలి.
- బ్లీచింగ్ పౌదరు ద్రావణాన్ని ప్రతి చదరపు మీటరు నేల విస్తీర్ణానికి 2 లీ. చొప్పున స్ప్రే చేయాలి.
- ఈ ద్రావణాన్ని చాకీ పురుగుల పెంపకం (కట్టుటకు) 3 రోజుల ముందుగా వాడుకోవాలి.
- 100 డిఎఫ్ఎల్ పెంచే వసతి కల పెంపక గృహానికి 75-100 లీ. ద్రావణం అవసరం.
- డిసిన్‌ఫెక్షన్ గావించునప్పుడు ఈ ద్రావణము ముఖానికి తగులకుండా జాగ్రత్త వహించాలి.

**2.5 శాతం శానిటిక్ (క్లోరిన్ డై ఆక్సైడ్) ద్రావణం గల 0.5% సున్నపు పొడి ద్రావణం:**

- ముందుగా 50 గ్రా. ఉత్తేజకారిణి (ఆక్టివేటర్) ను ఒక శుద్ధమైన పాత్రలో వేయాలి.
- ఈ 50 గ్రా. ఆక్టివేటర్ పొడికి 500 మి.లీ. శానిటిక్ ద్రావణాన్ని కలపాలి.
- ఈ ద్రావణ మందు ఆక్టివేటర్ పొడి కరిగి పసుపు రంగుగా మారనంత వరకు ఈ మిశ్రమాన్ని 5 నిమిషాల వరకు ఉంచాలి.
- పసుపు రంగు మారిన 500 మి.లీ. శానిటిక్ ద్రావణానికి 19 లీ. నీటిని కలపాలి.








- వేరొక శుద్ధమైన పాత్రలో 100 గ్రా. సున్నపు పొడిని 500 మి.లీ. నీటిలో కరిగించి ముందుగా తయారు చేసుకొన్న 19 లీటర్ల ద్రావణంలో కలపాలి.
- ఇప్పుడు 500 పిపియం క్లోరిన్ డై ఆక్సైడ్ + 0.5% సున్నపు నీరు పురుగుల గృహము మరియు పరికరములను డిసిన్‌ఫెక్షన్ గావించుటకు వాడవచ్చును.
- ఈ ద్రావణాన్ని ప్రతి చదరపు మీటరు నేల విస్తీర్ణానికి 2 లీ. చొప్పున పురుగుల పెంపక గృహమునందు స్ప్రే చేయాలి.
- చాకీ పురుగుల పెంపకమునకు / (కట్టుటకు) 3 రోజుల ముందుగా స్ప్రే చేయాలి.
- 100 డిఎఫ్ఎల్ (గ్రుడ్లు) పెంచే వసతి కల పెంపక గృహానికి 75-100 లీ. ద్రావణం అవసరం.
- డిసిన్‌ఫెక్షన్ చేయునప్పుడు చేసే వారి ముఖమునకు ఈ ద్రావణం తగులకుండా జాగ్రత్త వహించాలి.

**అస్త్ర ద్రావణం:** అన్ని సాధారణ పట్టు పురుగుల రోగ క్రిములను సమూలంగా నశింప చేసే క్లోరిన్ ఆధారిత క్రొత్త రోగ నిరోధక ద్రావణం.

- 100 లీ. ద్రావణం తయారు చేయుటకు 50 గ్రా. అస్త్ర పొడిని 100 లీ. నీటిలో కలిపి కర్ర సహాయంతో బాగా కలియ తిప్పి రెండు గంటల తరువాత పిచికారి చేయాలి.
- అస్త్ర ద్రావణం తయారు చేయుటకు సున్నపు పొడిని కలుపవలసిన అవసరం లేదు.

**పురుగుల పెంపక గృహము మరియు పరికరాలను డిసిన్‌ఫెక్షన్ గావించటం:**

- పురుగుల పెంపకపు గృహము లోపల డిసిన్‌ఫెక్షన్ గావించిన పిదప గృహము వెలుపలి గోడలను కూడా డిసిన్‌ఫెక్షన్ గావించాలి.
- పట్టు పురుగుల పెంచు గదిలోనికి, పరిసరాలలోనికి ఇతరుల ప్రవేశాన్ని సాధ్యమైనంత తక్కువగా ఉంచాలి.
- చాకీ పురుగుల పెంపక పనిలో ఉన్నవారు, పెద్ద పురుగులు లేదా గూళ్ళు కట్టు దశలలో ఉన్న చోటికి గాని వెళ్ళకూడదు.
- చాకీ మరియు పెద్ద పట్టు పురుగుల పెంపక పరిసరాలలోకి మరియు ప్రవేశ ద్వారం వద్ద కాల్చిన సున్నం మరియు పొడి సున్నం (1:19) ల మిశ్రమాన్ని చల్లాలి.

**ముఖ్య గమనిక:**

- రోగ నిరోధక ద్రావణం ఉదయం 10 గంటలలోపే పిచికారి చేయాలి.
- రేరింగ్ చేయునప్పుడు గది వెలుపల చుట్టూ 3 అడుగులు 2 శాతం బ్లీచింగ్ పౌడరును 0.3 శాతం సున్నపు పొడిలో కలిపి ప్రతి 3/4 రోజులకు ఒకసారి చల్లుకోవాలి.

పైన తెలిపిన చర్యలు సకాలంలో పాటించి, రైతు సోదరులు అత్యంత విలువైన దిగుబడులు పొందవచ్చును.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9948499284**











# జనవరి మాసంలో ఉద్యాన పంటల్లో చేపట్టవలసిన సేద్యపు పనులు

డా॥ ఐ.వి. శ్రీనివాస రెడ్డి
వ్యవసాయ కళాశాల, అశ్వారావుపేట

**మామిడి:** పూత పిందె సమయంలో తేనె మంచు పురుగు, తామర పురుగులతో పాటు బూడిద తెగులు కూడా సోకే అవకాశం ఉంది. వీటి నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ., కార్బండాజిమ్ + మ్యాంకోజెబ్ 1 గ్రా. + ప్లానోఫిక్స్ పావు మి.లీ. లను లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి. ఏనుగు/రాతి మంగు రాకుండా నల్లపూత దశలో 2 మి.లీ. ఫిప్రోనిల్ మందును లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేసుకోవాలి. 75 శాతం పైగా పిందె కట్టిన తరువాత మొదటి తడి ఇవ్వాలి. నీటి వసతి లేనట్లైతే 1 శాతం యూరియా (10 గ్రా./లీటరు నీటికి) ద్రావణంను పిచికారి చేసుకోవడం ద్వారా కట్టిన పిందెలు రాలకుండా చూడవచ్చు.

**జామ:** ముదురు ఆకుల మీద గోధుమ రంగు మచ్చలు ఏర్పడుతాయి. ఉధృతి ఎక్కువైనప్పుడు ఆకులు ముడుచుకొని రాలిపోతాయి. దీని నివారణకు మ్యాంకోజెబ్ మందును 2.5 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి. ఆకులపై తెల్ల సుడిదోమ పిల్లపురుగులు తెల్లని దూది వంటి మెత్తని పదార్థంలో కప్పబడి రసాన్ని పీలుస్తాయి. ఆశించిన ఆకులు ఎర్రబడి ముడతలు పడతాయి. ఆశించిన కొమ్మలు కత్తిరించి వేసి, 5 మి.లీ. వేపనూనె లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి. ఉధృతి ఎక్కువైనచో ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

**బత్తాయి, నిమ్మ:** అంబే బహర్ (జనవరిలో వచ్చే పూత) లో వచ్చే లేత ఆకులపై ఎగిరే పేను పురుగు బెడద ఎక్కువగా ఉంటుంది. నివారణకు డైమిథోయేట్ 2 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి మొగ్గ పగిలే దశలో ఒకసారి, మళ్ళీ 10 రోజుల తరువాత పిచికారి చేయాలి. పిందె బాగా కట్టడానికి ప్లానోఫిక్స్ 1.5 గ్రా., 1 కిలో యూరియా 100 లీటర్ల నీటిలో కలిపి మొగ్గ, పూత దశలో పిచికారి చేయాలి.

**ద్రాక్ష:** ఈ మాసంలో పిండినల్లి ఆశించిన కొమ్మలను, ద్రాక్ష గుత్తులను కత్తిరించి నాశనం చేయాలి. బూప్రోఫెజిన్ 1.25 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. జనవరి–ఫిబ్రవరి మాసాలలో తామర పురుగుల ఉధృతి ఎక్కువగా ఉంటుంది. వీటి నివారణకు థయోమిథాక్సామ్ 0.25 గ్రా. లేదా ఫిప్రోనిల్ 2 మి.లీ. లేదా స్పైనోసాడ్ 0.3 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**బొప్పాయి:** ఆకులపై గోధుమ రంగు మచ్చలు ఏర్పడి ఆకులు పసుపు రంగుకు మారి రాలిపోవును. దీని నివారణకు క్లోరోథలోనిల్ 2 గ్రా. కలిపి 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలి.

**ఉసిరి:** కాయలపై త్రుప్పు తెగులు కనిపిస్తుంది. కాయలు కోతకు ముందే రాలిపోతాయి. నివారణకు మ్యాంకోజెబ్ 2.5 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.





**జీడిమామిడి:** ఈ మాసంలో ఎండు తెగులు ఆశిస్తుంది. దీని వల్ల పుష్ప గుచ్ఛాలు, ఎదుగుతున్న గింజలు మెత్తబడి, పూర్తిగా పెరగకుండా ఎండిరాలిపోతాయి. నివారణకు కార్బండాజిమ్ 1 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

**కూరగాయలు:**

**బెండ:** వేసవి పంటను జనవరి రెండవ పక్షం నుండి విత్తుకోవచ్చు. 2.5 కిలోల విత్తనంను, వరుసల మధ్య 45 సెం.మీ. మొక్కల మధ్య 15-20 సెం.మీ. దూరం ఉండేటట్లు విత్తుకోవాలి.

**వంగ:** వేసవి పంట కోసం ఈ మాసంలో విత్తనాలను నారుమడిలో నాటుకోవాలి.

**టమాట:** వేసవి పంటను ఈ మాసం నుండి నాటుకోవచ్చు. 21-25 రోజుల మధ్య వయస్సు ఉండి 3-4 ఆకులు గల మొక్కలను 45×30 సెం.మీ. దూరంలో నాటుకోవాలి. సాధ్యమైనంత వరకు 30 రోజులు మించిన ముదురు నారును నాటరాదు.

**పందిరి కూరగాయలు:** ఆనప, దోస, కాకరలను జనవరి రెండవ పక్షం నుండి నాటుకోవచ్చు. గుమ్మడి, పొట్లను జనవరి చివరి వరకు నాటుకోవచ్చు. గుమ్మడి పెంకు పురుగుల పిల్లపురుగులు పెరుగుదల దశలో ఆకులను కొరికి తింటాయి. నివారణకు మలాథియాన్ 2 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి. పెరుగుదల దశ నుండి పూత వచ్చే వరకు 5% వేప గింజల కషాయాన్ని 15 రోజుల వ్యవధిలో పిచికారి చేయాలి.

**చిక్కుడు:** వేసవి చిక్కుడును ఈ మాసంలో విత్తుకోవచ్చు. పందిళ్ళపై పెంచే పంటకు 2-2.5 మీ. దూరంలో కాలువలు చేసి 1.5-2.0 మీ. దూరంలో పాదులు చేసి ఒక్కో పాదులో 3-4 విత్తనాలు పెట్టాలి. 5-7 రోజుల తరువాత బలమైన రెండు మొక్కలుంచి మిగిలినవి పీకి వేయాలి.

**గోరు చిక్కుడు:** వేసవి పంట కోసం 12-16 కిలోల విత్తనాలను 45×15 సెం.మీ. దూరంలో జనవరి రెండవ పక్షం నుండి విత్తుకోవాలి.

**మిరప, పేనుబంక:** ఈ మాసంలో పేనుబంక, లేత కొమ్మల ఆకుల అడుగున చేరి రసాన్ని పీల్చడం వల్ల పెరుగుదల తగ్గుతుంది. ఆకులు, కాయలు, నల్లటి మసిపూసినట్లుగా మారిపోతాయి. దీని నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా థయోమిథాక్సామ్ 0.5 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

**అల్లం:** సాధారణంగా అల్లం దుంపలు ఈ మాసంలో త్రవ్వడానికి వస్తాయి. ఆకులు పసుపు పచ్చగా మారి ఎండిపోవడం, కాండం ఎండిపోవడంను బట్టి అల్లం దుంపలు పక్వానికి వచ్చినట్లుగా గుర్తించి త్రవ్వుకోవచ్చు.



**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం.9441168156**




# కూరగాయ పంటల్లో వైరస్ తెగుళ్ళు - యాజమాన్యం

ఎమ్. సాయిచరణ్, జి. నరేందర్, జి. రాకేష్, డా॥ ఎ. కృష్ణ చైతన్య, ఎ. దినేష్ మరియు డా॥ బి. బాలాజీ నాయక్
ప్రాంతీయ చెఱకు మరియు వరి పరిశోధన స్థానం, రుద్రూరు


రైతుకు ప్రతి రోజు ఆదాయాన్నిచ్చే పంటలు కూరగాయలు. ప్రణాళిక బద్ధంగా దఫాదఫాలుగా పంటలు వేసుకుంటే ఏడాది పొడవునా దిగుబడులను తీయవచ్చు. మనదేశంలో ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో ఏడాదంతా కూరగాయలు సాగు చేసేందుకు అనువయిన వాతావరణ పరిస్థితులు ఉన్నాయి. తెలంగాణలో ప్రతి సంవత్సరం సుమారుగా ఐదు లక్షల కన్నా ఎక్కువ విస్తీర్ణంలో వివిధ కూరగాయల పంటలు సాగు చేయబడుతున్నాయి. మన రాష్ట్రంలో సుమారుగా 40 లక్షల టన్నులు కూరగాయలు అవసరం ఉన్నప్పటికీ సంవత్సరానికి కేవలం 19 లక్షల టన్నుల ఉత్పత్తి జరుగుతుంది. దీని వలన కూరగాయల సాగు కోసం పక్క రాష్ట్రాల మీద ఆధారపడవలసి వస్తుంది. కావున రైతులు మార్కెట్‌లో కూరగాయలకు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వ ఆమోదిత సంస్థల నుండి మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలి. విత్తనాలు 70 శాతం కంటే ఎక్కువ మొలకశాతం ఉండేలా చూసుకోవాలి, బిందు, తుంపర సేద్యం చేపట్టాలి. భూసార పరీక్షలకు అనుగుణంగా పోషకాలను నిర్ణీత మోతాదులో అందించాలి. ముఖ్యంగా కూరగాయ పంటలను ఆశించి నష్టపరిచే వైరస్ తెగుళ్ళను గురించి సాంకేతిక అవగాహన కలిగి ఉండి సరైన సస్యరక్షణ చర్యలను చేపట్టాలి.

**ముఖ్యమైన కూరగాయ పంటలను ఆశించే వైరస్ తెగుళ్ళు క్రింద పేర్కొనబడినవి.**

**టమాట స్పాటెడ్ విల్ట్ వైరస్ తెగులు:** దీనినే తలమాడు తెగులు అని అంటారు. ఈ తెగులు తామర పురుగుల ద్వారా వ్యాప్తి చెందుతుంది. టమాట చిగురాకుల పైభాగంలో ఈనెలు గోధుమ వర్ణంకు మారి, ఆకుల మీద పసుపు రంగు మచ్చలు ఏర్పడి మాడి పోతాయి. తరువాతి దశలో మొక్కల లేత కాండపు భాగాలపైన, తొడిమెలపైన కూడా గోధుమ రంగు చారలు ఏర్పడుతాయి. మొక్కలు గిడసబారి, పూత పిందె పట్టక ఎండిపోతాయి.

**నివారణ:** తెగులు ఆశించిన మొక్కలను పీకి నాశనం చేయాలి. వైరస్‌కు ఆశ్రయమిచ్చే కలుపు మొక్కలను పీకి నాశనం చేయాలి. తెగులును వ్యాప్తి చేసే తామర పురుగుల నివారణకు డైమిథోయేట్ 2 మి.లీ.ను లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. నారుమడిలో మడికి 250 గ్రా. మరియు నాటిన 10వ రోజున ఎకరాకు 10 కిలోల కార్బోఫ్యూరాన్ 3సిజి గుళికలు వేసుకొని, వైరస్ తెగుళ్ళ నుండి పంటను కాపాడవచ్చును.

**వంగలో వెర్రితెగులు (లిటిల్ లీఫ్):** ఈ వైరస్ తెగులు సోకిన మొక్క యొక్క ఆకులు సన్నగా మారి, పాలిపోయిన ఆకుపచ్చని రంగు కల్గి ఉంటాయి. మొక్కలు గుబురుగా, చీపురు కట్టలాగా కనపడతాయి. పూత, కాత లేకుండా మొక్కలు గొడ్డు బారి పోతాయి. ఈ వైరస్ తెగులు పచ్చదోమ ద్వారా వ్యాప్తి చెందుతుంది.





**నివారణ:** తెగులు సోకిన మొక్కలను పీకి నాశనం చేయాలి. నారుమడి దశలో నాటడానికి వారం రోజుల ముందు 250 గ్రా. కార్బోఫ్యూరాన్ 3 సిజి గుళికలను 100 చ.మీ. నారుమడికి వేసుకోవాలి. ఇవే గుళికలను నాటిన 2 వారాల తర్వాత ఎకరాకు 8 కిలోల చొప్పున వేసుకోవాలి. నారును టెట్రాసైక్లిన్ 1000 పి.పి.ఎమ్. ద్రావణంలో ముంచి నాటుకోవాలి. నాటిన 4-5 వారాల తర్వాత డైమిథోయేట్ 2 మి.లీ.ను లీటరు నీటికి కలిపి వారం వ్యవధిలో 2-3 సార్లు పిచికారి చేసుకొవాలి. తెగులు సోకిన మొక్కలను పీకివేసి జిబ్బరిల్లిక్ ఆమ్లం 50 మి.గ్రా.ను లీటరు నీటికి కలిపి పిచికారి చేసి తెగులు ఉధృతి కొంతవరకు తగ్గించవచ్చు.

**బెండలో పల్లాకు తెగులు:** ఈ వైరస్ తెగులు తెల్లదోమ ద్వారా వ్యాప్తి చెందుతుంది. తెగులు ఆశించిన ఆకుల ఈనెలు పసుపు రంగుకు మారి, కాయలు గిడసబారి తెల్లగా మారిపోతాయి. ఒక వేళ ఈ తెగులు గింజలు మొలిచిన 20 రోజులలోపే ఆశించినట్లయితే దిగుబడిలో ఎక్కువ నష్టం కలుగుతుంది.

**నివారణ:** ఒక కిలో విత్తనానికి ఇమిడాక్లోప్రిడ్ 17.8%ను 5 మి.లీ. తో కలిపి విత్తనశుద్ధి చేయాలి. తెగులును తట్టుకునే అర్క అనామిక, అర్క అభయ రకాలను విత్తుకోవాలి. పొలంలో ఎకరాకు 10-12 పసుపు రంగు జిగురు అట్టలను ఏర్పాటు చేసుకోవాలి. తెల్లదోమ నివారణకు డైమిథోయేట్ 2 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.5 గ్రా.ను లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.

**మిరపలో కుకుంబర్ మొజాయిక్ వైరస్ తెగులు:** ఈ వైరస్ తెగులు పేనుబంక ద్వారా వ్యాప్తి చెందుతుంది. మొక్కలు గిడసబారి ఎదుగుదల లోపించి పొట్టిగా కనిపిస్తాయి. ఆకులు పత్రహరితం కోల్పోయి. ఆకారం మారిపోయి కొనలు సాగి మొజాయిక్ లక్షణాలు కనిపిస్తాయి. ఈ వైరస్ సోకిన మొక్కలకు పూత, కాత ఉండదు.

**నివారణ:** వ్యాధి సోకిన మొక్కలను పీకి నాశనం చేయాలి. వ్యాధిని వ్యాప్తి చేసే పేనుబంక నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రా. లేక ఇమిడాక్లోప్రిడ్ 0.25 మి.లీ.ను లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.

**మిరపలో పీనట్ బడ్ నెక్రోసిస్ వైరస్ తెగులు:** ఈ తెగులును మొవ్వుకుళ్ళు తెగులు అని కూడా అంటారు. ఇది తామర పురుగుల ద్వారా వ్యాప్తి చెందుతుంది. ఈ తెగులు ఆశించిన మొక్కల చిగుర్లు ఎండిపోతాయి. కాండంపైన నల్లటి ఆకారంలేని మచ్చలు ఏర్పడి క్రమేణ చారలుగా మారతాయి. ఆకులపై వలయాలుగా నెక్రోటిక్ మచ్చలు ఏర్పడతాయి. వ్యాధి ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు ఆకులు పండుబారి రాలిపోతాయి.

**నివారణ:** ఒక కిలో విత్తనానికి 8 గ్రా. ఇమిడాక్లోప్రిడ్‌తో విత్తనశుద్ధి చేయాలి. పొలంలో ఎకరాకు 10-12 నీలం రంగు జిగురు అట్టలను ఏర్పాటు చేసుకోవాలి. వ్యాధి వ్యాప్తికి కారణమయ్యే తామర పురుగుల నివారణకు ఫిప్రోనిల్ 0.3 శాతం గుళికలు నాటిన 15 రోజులు మరియు 45 రోజులకు ఎకరానికి 8 కిలోల చొప్పున నేలలో తగినంత తేమ ఉన్నప్పుడు వేసుకోవాలి. వైరస్ సోకిన మొక్కలను పీకి నాశనం చేయాలి.

**పందిరి తీగ కూరగాయలలో వెర్రి తెగులు/ వైరస్ తెగులు:** ఆకుల ఈనెల మధ్య మందంగా చారలు ఏర్పడి, ఆకులు పెళుసుగా మారి గిడసబారిపోతాయి. పూత, పిందె వేయడం ఆగిపోతుంది. ఈ తెగులు పేనుబంక ద్వారా ఒక మొక్క నుండి ఇంకో మొక్కకు వ్యాప్తి చెందుతుంది.

**నివారణ:** తెగులు సోకిన మొక్కలను పీకి నాశనం చేయాలి. తెగులును వ్యాప్తి చేసే పేనుబంక నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా డైమిథోయెట్ 2 మి.లీ.ను లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.

కూరగాయలు సాగు చేసే రైతులు ఎరువుల సమతుల్యత పాటించాలి. రసాయన ఎరువులతో పాటు తప్పని సరిగా సేంద్రియ ఎరువులను వేసుకోవాలి. సిఫారసుకు మించి నత్రజని ఎరువులను వేయకూడదు. వైరస్ తెగులు ఆశించిన మొక్కలు కన్పించిన వెంటనే పీకి వేసి నాశనం చేయాలి. వైరస్ వ్యాప్తి చేసే రసం పీల్చే పురుగులను సకాలంలో గుర్తించి, సస్యరక్షణ చర్యలు చేపట్టడం వలన అధిక దిగుబడులు సాధించవచ్చు.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన**
**ఫోన్ నెం. 8919798959**









# పసుపు కోత అనంతరం తీసుకోవలసిన జాగ్రత్తలు

డా॥ బి. వెంకట రాజ్ కుమార్, డా॥ టి. అంజయ్య, శ్రీ. పి. విజయ్ కుమార్, డా॥ ఎం. శ్వేత,
ఎన్. స్వప్న, బి. శ్రీలక్ష్మి మరియు కుమార్
కృషి విజ్ఞాన కేంద్రం, నిజామాబాద్, రుద్రూర్

పసుపును ప్రధానంగా తెలంగాణ రాష్ట్రంలో ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల్లో ఎక్కువగా సాగు చేస్తున్నారు. పసుపు పంటను తెలంగాణ 60 వేల హెక్టార్లలో సాగు చేస్తూ సాలీన 3.7 లక్షల టన్నుల దిగుబడి సాధిస్తున్నాం.

ఎలాంటి రోగాలు రాకుండా పంట సాగయితే అత్యధికంగా ఎకరానికి 25-30 క్వింటాళ్ల ఎండిన పసుపు దిగుబడి వస్తుంది. ఎకరానికి రైతులు సుమారు రూ. 90 వేల నుండి లక్ష వరకు పెట్టుబడి పెడుతున్నారు. ఇంత పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టి పంటను సాగు చేసినప్పటికీ రాబడి తగ్గడం రైతులకు గిట్టుబాటు కాకుండా చేస్తుంది.

ఈ నేపథ్యంలో పంటపై పెట్టుబడి తగ్గించుకోవడం, పండించిన పంటకు అధిక ధరకు దక్కించుకుంటే తప్ప రాబడి పెంచుకోలేని పరిస్థితి ఏర్పడింది. ఒకటి, రెండు నెలల్లో మార్కెట్‌కు రాబోయే పసుపుకు మంచి ధర లభించాలంటే రైతులు తమ పసుపు నాణ్యమైనదిగా ఉండేలా చూసుకోవాలి. పసుపు కోత అనంతరం తీసుకోవాల్సిన మెళకువలను పాటించినట్లయితే నాణ్యమైన పసుపు దిగుబడిని పొందే అవకాశం ఉంది.

### పసుపు కోత మరియు తవ్వకం:

- సాగుచేసే రకాన్ని బట్టి పసుపు పంట కాలం 7-9 నెలలు ఉంటుంది. పంట పక్వానికి వచ్చినప్పుడే కోత కోయడం ప్రారంభించాలి. పక్వదశకు రాకముందే పంట కోత చేపడితే దిగుబడి తగ్గడంతో పాటు, కుర్కుమిన్ శాతం కూడా తక్కువగా ఉండి నాణ్యత లోపిస్తుంది.
- కొంత మంది రైతుసోదరులు పసుపు తర్వాత సజ్జ, నువ్వు, టమాట సాగు చేయాలనే ఉద్దేశ్యంతో పంటకాలం పూర్తి కాకమునుపే తవ్వకాలు ప్రారంభిస్తున్నారు. ఈ పద్ధతి సరైనది కాదు.
- పంటకాలం పూర్తి అయినప్పుడు మొక్కల ఆకులు పాలిపోయి, తర్వాత ఎండిపోయి నేలపై పడిపోతాయి. ఈ దశలో దుంపలను, కొమ్ములను తవ్వితీయాలి.
- పసుపు తవ్వే 2 రోజుల ముందు మొక్క ఆకులు, కాండాలను భూమట్టానికి కోసివేయాలి. తర్వాత తేలికపాటి నీటితడిని ఇచ్చి 2 రోజుల తర్వాత పసుపు తవ్వకం ప్రారంభించాలి.
- భూమిలో మిగిలిపోయిన దుంపలను నాగలితో దున్ని ఏరివేయాలి.
- తరువాత పసుపు దుంపలకు అంటి ఉన్న మట్టిని తొలగించి శుభ్రపరచాలి.
- పంటకోత సమయంలో కొమ్ములకు ఏవిధమైన దెబ్బ తగలకుండా జాగ్రత్తపడాలి.
- శుభ్రపరచిన తల్లి, పిల్ల దుంపలు వేరుచేయాలి.
- వీటితోపాటు దుంప పుచ్చు / కుళ్ళు ఆశించిన దుంపలను, కొమ్ములను కూడా వేరు చేయాలి.

### పసుపు ఉడక బెట్టడం:

- పసుపుకోత తర్వాత చర్యల్లో అతి ప్రధానమైనది, అత్యంత శ్రమతో పాటు ఇబ్బందికరమైనది ఉడక బెట్టడమే.
- కాబట్టి తవ్విన 2-3 రోజుల్లోపు ఉడికించాలి. దీని వల్ల మంచి నాణ్యతతో పాటు రికవరీ కూడా అధికంగా ఉంటుంది.
- ఆలస్యంగా ఉడకబెట్టడం వల్ల రికవరితో పాటు నాణ్యత కూడా తగ్గుతుంది.
- ఉడకబెట్టేటప్పుడు దుంపలను, కొమ్ములను వేరుగా ఉడకబెట్టాలి.
- ఉడకబెట్టడం ద్వారా పసుపు దుంపలు, కొమ్ముల్లో ఉన్న పిండి పదార్థం గట్టిపడి రంగు సమానంగా అభివృద్ధి చెందుతుంది.







- ఉడకబెట్టడం వల్ల పచ్చివాసనపోయి, పసుపుకుండే ప్రత్యేకమైన సువాసన దుంప (లేదా) కొమ్ములోని భాగమంతటికి వస్తుంది.
- ఉడకబెట్టడం వల్ల పసుపు ఆరడానికి పట్టే సమయం తగ్గుతుంది.
- పసుపు ఎక్కువగా ఉడకబెడితే ఆరిన తరువాత రంగు చెడిపోతుంది.
- పసుపు తక్కువగా ఉడకబెడితే దుంపలు పెళుసుగా మారి, ఎండబెట్టి మెరుగు పరిచేటప్పుడు ముక్కలుగా విరిగిపోతాయి.
- గతంలో కడాయిలలో పసుపు ఉడకబెట్టడం ఆనవాయితీ. ఈ విధానంలో చాలా సమస్యలు ఉండటం వల్ల ఇటీవల కాలంలో రైతులు స్టీమ్ బ్రాయిలర్‌లను వినియోగిస్తున్నారు.
- కరెంట్ ద్వారా (లేదా) డీజిల్ ద్వారా (లేదా) కట్టెల ద్వారా మధ్య ఉండే ఆవిరి ఉత్పత్తి చేసే యూనిట్‌లో వేడి ఆవిరి ఉత్పత్తి చేయబడుతుంది.
- ఈ ఆవిరిని తగిన పీడనం వద్ద 4 డ్రమ్ములలోకి వాల్వుల ద్వారా పంపడం ద్వారా పసుపు ఉడకబెట్టడం జరుగుతుంది.
- అన్ని డ్రమ్ములకు వేడి సమానంగా అందేలా ఆవిరిని వదలాలి.
- ఈ విధానంలో గంటకు 1 టన్ను పచ్చి పసుపును ఉడక బెట్టవచ్చు.
- స్టీమ్ బ్రాయిలర్‌ను ఉపయోగించడం వల్ల నీటి ఆవిరితో, తక్కువ సమయంలో ఎక్కువ పసుపు ఉడికించడమే కాకుండా మంచి నాణ్యతతో కూడిన పసుపు పొందవచ్చు.

### పసుపు ఆరబెట్టడం

- ఉడకబెట్టిన పసుపును చదునైన, శుభ్రమైన నేల (లేదా) టార్పాలిన్ షీట్ (లేదా) సిమెంట్ ప్లాట్‌ఫారం పై కుప్పగా పోయాలి.
- 24 గంటల తర్వాత 2, 3 అంగుళాల మందం ఉండేలా పరచాలి.
- పలుచగా పరిస్తే ఎండిన పసుపు రంగు చెడిపోతుంది. పసుపును అప్పుడప్పుడు తిరగబెట్టాలి.
- మధ్యాహ్నం పూట తిరగబెడితే సమానంగా ఎండుతాయి.
- ఒక క్రమపద్ధతిలో ఆరబెట్టడం అన్నది జరగాలంటే పసుపును, దుంపలను, కొమ్ములను రాత్రిపూట కుప్పగా చేసి, వాటిని కప్పివేసి ఉంచాలి. మరల ఉదయం పూట నేర్పాలి.
- కొమ్ములను విరిస్తే కంచు శబ్దంతో విరిగే దశ వరకు ఎండబెట్టాలి.
- దుంపలు (లేదా) కొమ్ములలో తేమ 8 శాతం వరకు వచ్చేదాకా ఎండబెట్టాలి.
- ఈ స్థితికిరావడానికి సాధారణంగా 18-20 రోజులు పడుతుంది.
- పసుపు ఆరబెట్టినప్పుడు వర్షానికి తడువరాదు.
- ఉడికిన పసుపు తడిస్తే పసుపు రంగు కోల్పోయి నారింజ రంగు వస్తుంది.
- కాబట్టి అకస్మాత్తుగా కురిసే వర్షాలకు పసుపు తడవకుండా పాలిథీన్ షీట్లు (లేదా) టార్పాలిన్‌లు సిద్ధంగా ఉంచుకోవాలి.
- మంచు ఎక్కువగా పడేచోట రాత్రివేళల్లో పసుపును కప్పిఉంచటం మంచిది. పచ్చి పసుపులో సుమారు ఎండిన పసుపు 20 శాతం మేర తూకముంటుంది.

### పసుపు పాలిషింగ్ మరియు గ్రేడింగ్

- పాలిషింగ్ చేయడం వల్ల దుమ్ము, ధూళితో పాటు వేర్లు, పొలుసులు తొలగించబడి చూడటానికి ఆకర్షణీయంగా కనబడుతాయి.
- ప్రస్తుతం చేతితో తిప్పే (లేదా) విద్యుత్‌తో నడిచే పాలిషింగ్ డ్రమ్ములు అందుబాటులోకి వచ్చాయి.
- పాలిషింగ్ చేసేటప్పుడు రంగు కొరకు పసుపు పొడి తప్ప ఇతర కృత్రిమ రంగులు/ రసాయనాలు కలుపరాదు.
- పాలిష్ చేసిన కొమ్ములను, దుంపలను సైజును బట్టి గ్రేడింగ్ చేసి, మార్కెట్‌కు పంపితే మంచిధర రావడమే కాకుండా, ఎగుమతులకు అవకాశం ఉంటుంది.

### పసుపులో నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలు

| | |
|---|---|
| మొత్తం కీటక అవశేషాల సంఖ్య | : 3 |
| క్షీరదాల విసర్జన పదార్థాలు | : 5 మి. గ్రా./పౌన్డ్ |
| ఇతర విసర్జన పదార్థాలు | : 5 మి. గ్రా./ పౌన్డ్ |
| శిలీంధ్రాల బరువు శాతం | : 3 |
| కీటకాల బరువు శాతం | : 2.5 |
| ఇతర వ్యర్థ పదార్థాల బరువు శాతం | : 0.5 |

ఈ విధంగా రైతులు శాస్త్రీయంగా సూచించిన సలహాలను సరైన సమయంలో పాటించినట్లయితే చీడపీడలను నివారించుకొని నాణ్యమైన పంటను పొందవచ్చు.

ఇతర వివరములకు సంప్రదించవలసిన
ఫోన్ నెం.9866240346





# పనస - పోషక విలువలు, ఆరోగ్య ప్రయోజనాలు మరియు విలువాధారిత ఉత్పత్తులు



యల్. సుహాసిని, యం. హారిక, కె. మానస, డా॥ జె. కమలాకర్
మరియు డా॥ యం. బలరాం
వ్యవసాయ కళాశాల, వరంగల్

ఉద్యానవన పంటల్లో 30 నుండి 40 శాతం వరకు కోత అనంతరం నష్టం వాటిల్లుతుంది. కనుక విలువాధారిత ఉత్పత్తులను తయారీ చేయడం వలన కోత అనంతరం జరిగే నష్టాలను కొంత వరకు నివారించటమే కాకుండా, మార్కెట్ వెసులుబాటును కూడా కల్పించుకోవచ్చును. అలాగే పోషకాహార విలువలను కూడా పెంపొందించవచ్చు.

పనస అనేక రకాలైన పోషక విలువలను కలిగి ఉంది. పనసలో ఉన్న పోషక విలువలు అవకాడో మరియు ఆలివ్ పండ్లు మరియు తల్లి యొక్క పాల పోషక విలువలతో సమానం. పనస పండులో విటమిన్ బి, సి, పొటాషియం, కాల్షియం, ఇనుము, ప్రోటీన్లు మరియు కార్బోహైడ్రేట్లు ఉన్నాయి.

పనస పండు యొక్క విత్తనంలో కూడా అధిక మొత్తంలో ప్రోటీన్లు ఉన్నాయి. పనస పండులో 'జెకలిన్' అనే రసాయనం ఉంది. అది కొలన్ క్యాన్సర్ మరియు ఎయిడ్స్ వ్యాధి నివారణలో తోడ్పతుంది.

పనస నుండి వెలువడే వాసన వలన సాధారణంగా తినడానికి ఇష్టపడరు. పనసతో వివిధ రకాల విలువాధారిత పదార్థాలు తయారుచేయటం వలన, తినడానికి సౌకర్యంగాను మరియు అనేక రకాలైన పోషక విలువలను పొందవచ్చును.

## పనస పండు యొక్క పోషక విలువలు (100 గ్రా.)

| | | |
|---|---|---|
| 1. | తేమ (%) | 76.20 |
| 2. | శక్తి (క్యాలరీలు) | 88.00 |
| 3. | ప్రోటీన్లు (గ్రా.) | 1.90 |
| 4. | లిపిడ్లు (గ్రా.) | 0.10 |
| 5. | పీచు (గ్రా.) | 1.10 |
| 6. | కార్బోహైడ్రేట్లు (గ్రా.) | 19.80 |
| 7. | పొటాషియం (మి.గ్రా.) | 107.00 |
| 8. | కాల్షియం (మి.గ్రా.) | 20.00 |
| 9. | ఫాస్ఫరస్ (మి.గ్రా.) | 41.00 |
| 10. | ఇనుము (మి.గ్రా.) | 0.50 |
| 11. | బీటా–కెరోటిన్ (మి.గ్రా.) | 175.00 |
| 12. | థయమిన్ (మి.గ్రా.) | 0.03 |
| 13. | రైబోఫ్లావిన్ (మి.గ్రా.) | 0.13 |
| 14. | నియాసిన్ (మి.గ్రా.) | 0.40 |
| 15. | విటమిన్ సి (మి.గ్రా.) | 7.00 |

## పనసతో కలిగే ఆరోగ్య ప్రయోజనాలు

పనసను క్రమం తప్పకుండా తీసుకోవటం వలన అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. అందులో ముఖ్యమైనవి

1. రోగ నిరోధక శక్తిని బలపరుస్తుంది.
2. క్యాన్సర్ నుండి కాపాడుతుంది.
3. జీర్ణక్రియలో తోడ్పడుతుంది.
4. కంటి మరియు చర్మ రక్షణలో తోడ్పడుతుంది.
5. త్వరితంగా శక్తిని ఇస్తుంది.
6. అధిక రక్తపోటును తగ్గిస్తుంది.
7. ఆస్తమాని నియంత్రిస్తుంది.
8. ఎముకలను బలోపేతం చేస్తుంది.
9. రక్తహీనతను తగ్గిస్తుంది.
10. థైరాయిడ్‌ను నివారిస్తుంది.



**పనస యొక్క విలువాధారిత పదార్థాలు:**

పచ్చి మరియు పండ్లతోనే కాకుండా పనస విత్తనాలతో కూడా విలువాధారిత పదార్థాలను తయారుచేయవచ్చును. అవి

1. పనస కూర
2. బజ్జీలు
3. పచ్చడి
4. కట్‌లెట్
5. పాపడ
6. మసాల పాపడ్
7. చిప్స్
8. పకోడీలు
9. బిర్యానీ
10. పనస పండ్ల గుజ్జు
11. హల్వా
12. గులాబీ జామున్
13. మిని అప్పమ్
14. తీపి వడలు
15. కస్టర్డ్
16. వైన్
17. కీర్ (పానీయం)
18. పుడ్డింగ్
19. స్క్వాష్ (పానీయం)
20. జామ్
21. లెదర్
22. చాక్లెట్
23. పాయసం (పనస గింజ)
24. పనస గింజ బర్ఫీ
25. పనస గింజ పకోడీలు

ఇందులో పనస పచ్చళ్ళు, పాపడ్, చిప్స్, గుజ్జు, హల్వా, జామ్, లెదర్, వైన్, స్క్వాష్, పనస విత్తన పిండి, విత్తన బర్ఫీ, చాక్లెట్ లాంటి పదార్థాలను కొంత కాలం పాటు నిల్వ చేసుకోవచ్చును.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9160760095**

**30వ పేజీలోని వ్యవసాయ పదవినోదం సమాధానాలు**

| | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 కం | ధ | గం | | | | | | | 2 జ | ను | 3 ము |
| పు | | | | | 3 జా | 5 మ | | | గి | | న |
| న | | | | | | న్నెం | | | త్యా | | గ |
| ల్లి | | | | | | కొం | | | ల | | |
| | 4 అ | ర | టి | | 5 కొం | డ | మ | ల్లే | ప | ల్లి | |
| | గ్గి | | | | | కం | | | ల్లి | | |
| | 6 తె | లం | గా | ణ | కం | ది | | | -1 | | |
| | గు | | | | | | 6 బ్రౌ | | | | |
| | లు | | | | 7 బ | ట | నిం | గ్ | | | |
| | | | | | | | గ్ | | | | |

# కుందేళ్ళ పెంపకం మరియు వాటి యాజమాన్య పద్ధతులు


డా॥ జె. శశాంక్, డా॥ ఎన్. రాజన్న మరియు డా॥ జె. సాయికిరణ్

కృషి విజ్ఞాన కేంద్రం, పి వి నరసింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ, మామునూరు, వరంగల్








కుందేళ్ళ పెంపకాన్ని ఆవులు, గేదెలు, కోళ్ళ పోషణ కంటే సులభంగా తక్కువ ఖర్చుతో నిర్వహించవచ్చు.

కుందేళ్ళు పుట్టిన తర్వాత 5-6 మాసాల వయస్సుకే లైంగిక పరిపక్వత చెంది, సాలీనా అయిదారుసార్లు ఈని 30-40 పిల్లలను ఇస్తాయి. కుందేళ్ళలో ప్రాణాంతక వైరస్ లేదా బాక్టీరియా (సూక్ష్మజీవులు) వ్యాధులు సోకడం తక్కువ. మరణాల రేటు కూడ తక్కువ. టీకాలు వేయాల్సిన అవసరం లేదు. కోళ్ళ, డెయిరీ ఫారాల కంటే మందుల ఖర్చు చాల తక్కువ.

ఒక కిలో దాణా (35 రూ.లు విలువగల), ఒక కుందేలుకు దాదాపు పది రోజులకు సరిపోతుంది. రోజుకు 100 నుంచి 150 గ్రాముల దాణా తింటుంది. క్యారెట్, క్యాబేజీ ఆకులు, గరిక గడ్డి, స్టయిలో హెమటా, బర్సీం, లూసర్న్ లాంటి గ్రాసాలను కుందేళ్ళు ఇష్టంగా తింటాయి. ఈ ఆకులను, గ్రాసాలను వాడి దాణా ఖర్చును బాగా తగ్గించవచ్చు.

కుందేలు మాంసంలో మాంసకృత్తులు 21-22 శాతం ఉంటాయి. కొలెస్ట్రాల్ చాల తక్కువ. అందుచేత మధ్య వయస్సులో ఉన్నవారికి, ముసలివారికి, చిన్న పిల్లలకు సులభంగా జీర్ణమవుతుంది. సన్న, చిన్నకారు రైతులు 5 నుంచి 10 జతలతో ప్రారంభించి వాటి యాజమాన్యం మార్కెటింగ్ గురించి పూర్తి అవగాహన పొందిన తరువాత క్రమంగా సంఖ్యను పెంపొందించడం మేలు.

కుందేళ్ళ వసతికి గాను షెడ్ల నిర్మాణం, కెజెస్ తయారీ మొదలైన వాటిపైన ప్రారంభదశలో ఎక్కువ ఖర్చయినా, అవి దీర్ఘకాలికంగా ఉంటాయి. ఆ తర్వాత రోజు వారి యాజమాన్య ఖర్చులు మాత్రమే ఉంటాయి.

**మాంసోత్పత్తికి అనువైన జాతులు:** ప్రసిద్ధి గాంచిన ఫ్లెమిష్ జైంట్, గ్రే జెయింట్, సోవియట్ చించిల్లా, న్యూజిలాండ్ వైట్, క్యాలిఫోర్నియన్ వైట్ కుందేళ్ల జాతులను దిగుమతి చేసుకొని 1960 నుంచి మన దేశంలో పెంచుతున్నారు. బ్రీడర్ కుందేళ్ళు సుమారు 3-6 కిలోల బరువు తూగుతాయి. వీటి జీవితకాలం 6-7 సంవత్సరాలు. సాలీనా 5-6 సార్లు ఈనుతాయి. ప్రతి ఈతలో 5-12 పిల్లల్ని కంటాయి.

**వసతి సౌకర్యం:** కుందేళ్ల యాజమాన్యం కేజ్ పద్ధతిలో సులభం. ప్రతి ఆడ కుందేలుకు 2.5' పొ. × 1.5' వె. × 1' ఎత్తు, మగ కుందేలుకు 1.5' పొ. × 1.5' వె. × 1' ఎత్తు పరిమాణం గల కేజ్‌లు సరిపోతాయి. షెడ్లోకి గాలి, వెలుతురు పుష్కలంగా రావాలి. షెడ్లో ఉష్ణోగ్రత 25-30 డిగ్రీ. సెం.గ్రే. మించరాదు. ఎండాకాలం లో చూరుపైన వరిగడ్డి కప్పి స్ప్రింకర్ల ద్వారా నీటితో తడపాలి. షెడ్ల

చుట్టూ తడిగోనె సంచులు కట్టాలి. చలికాలంలో ఈదురు గాలులు రాకుండా గోనె పట్టాలు కట్టాలి. కుందేళ్ల ఫారం చుట్టూ నీడనిచ్చే చెట్లు నాటాలి. ఫారం రోడ్డు పక్కన ఉండరాదు. శబ్ద కాలుష్యానికి కుందేళ్లు భయపడి ఒత్తిడికి గురై, ఉత్పాదక సామర్థ్యం తగ్గుతుంది.

**చూడి కాలం, గర్భధారణ, పిల్లల పట్ల జాగ్రత్తలు:** 5 నెలల నుండి 6 నెలల వయస్సులో సుమారు 3 కిలోల బరువున్న ఆడ కుందేలును మగ కుందేలుతో జత కట్టించాలి. ఆడ కుందేలును మగ కుందేలు కేజ్లో సుమారు 6-8 గంటలు ఉంచితే సంయోగక్రియ పూర్తవుతుంది. ఆడ కుందేళ్లలో అండం విడుదల మగకుందేళ్ల సంపర్కం అయిన 4 నుండి 6 గంటల్లో జరిగి ఫలదీకరణ చెంది పిండంగా మారుతుంది. చూడికాలం 28 నుండి 30 రోజులు. ఆడ కుందేళ్లను ఈనిన తర్వాత 7వ రోజు నుంచి ఎప్పుడైన మగవాటితో జత కట్టించవచ్చును. సంపర్కం జరిగిన 12-15 రోజుల్లో చూడి నిర్ధారణ చేయవచ్చు. ఆడకుందేలు కేజ్లో 2-4 రోజుల ముందే కట్టెతో చేసిన (80 సెం.మీ. పొడవు, 40 సెం.మీ. వెడల్పు, 30 సెం.మీ. ఎత్తుగల పైభాగంలో పావువంతు కప్పుగల) నెస్టు బాక్సును అమర్చాలి. నెస్టుబాక్సులో వరిగడ్డి ముక్కలను వేసి అమరిస్తే, ఆడకుందేలు తన దేహం నుండి ఉన్నిని పీకి గూడును తయారు చేసుకుంటుంది. సాధారణంగా ఆడకుందేలు రాత్రి సమయంలో గాని, తెల్లవారుజామునగాని బోనులో దూరి 15-16 నిముషాలలో 5 నుంచి 12 వరకు పిల్లలను ఈనుతుంది. పిల్లలు కేజ్ నుండి వెలుపలకు రాకుండా, నెస్టాబాక్స్ ఉండేటట్లుగా జాగ్రత్తపడాలి. ఈనినప్పుడు తల్లికి సరిపడు దాణా, నీరు ఉండాలి. ఆడకుందేలు దినంలో ఒకసారి బోనులో దూరి పాలిస్తుంది. ఆడకుందేలుకి 8 చన్నులే ఉంటాయి. కనుక ఎక్కువ పిల్లలు పెడితే వేరే ఆడ కుందేలు పాలు పట్టాలి. పుట్టిన పిల్లలు 30-50 గ్రా. బరువుంటాయి. 10-15 రోజుల వరకు చర్మంపై బూరు ఏర్పడదు. కళ్ళు తెరవడానికి 5-6 రోజులు పడుతుంది. పుట్టినప్పటి నుంచి 20 రోజుల వరకు తల్లి పాలే ఆహారం. ఆ తరువాత గడ్డి, దాణా తింటాయి. సుమారు 4 వారాల వయస్సులో పిల్లల్ని తల్లి నుంచి వేరుచేసి ఆడకుందేలును మళ్ళీ మగదానితో జతకట్టించాలి. ఎలుకలు, పందికొక్కులు, పిల్లుల బారినుంచి చిన్నపిల్లలను కాపాడాలి. 4-5 నెలల్లో సగటున మూడు కిలోల బరువుతూగె సమయంలో అమ్ముకోవాలి. ఒక మగకుందేలును 5-6 ఆడ కుందేళ్లను దాటించడానికి వాడవచ్చు.

**కుందేళ్ళ దాణా మిశ్రమం:** ల్యూసర్న్, బర్సీమ్ వంటి పచ్చిమేతలే కాకుండా కుందేళ్ళకు దాణా కూడ అవసరం. ఒక క్వింటాలు దాణా మిశ్రమాన్ని 50 కిలోల మొక్కజొన్నలు, 22 కిలోల వేరుశనగ చెక్క, 25 కిలోల తవుడు మరియు 3 కిలోల లవణ మిశ్రమాన్ని కలిపి తయారు చేసుకోవచ్చును.

**షెడ్ పరిశుభ్రత:** షెడ్డులో మలమూత్రాలు రోజు కడిగివేసి కనీసం వారానికి ఒకసారైన ఫినైల్ చల్లాలి. కేజ్లో పేరుకు పోయిన వెంట్రుకలను, బూజును నెలకొకసారైనా బర్నర్తో కాల్చాలి. కేజ్లో దాణా, నీళ్ళకుండలను, 6 నెలలకొకసారైన శుభ్రపరిచి నీటిలో ముంచి ఆరబెట్టి శుభ్రం చేసి వాడాలి. నెస్టాబాక్స్ లో ఈనిన తర్వాత ప్రతిసారి డెట్టాల్తో గాని సోడియం హైడ్రాక్సైడ్తో గాని శుభ్రం చేసి ఎండబెట్టి వాడాలి.

చెవుల లోపలి పేరుకు పోయిన జిడ్డును (గివిలి) స్పిరిట్తో శుభ్రం చేయాలి. విరేచనాలు ఉన్నప్పుడు సల్ఫాక్వినాక్షలీన్ పశువైద్యుని సలహా మేరకు 0.1 నుంచి 0.2 శాతం వాడాలి లేదా ఆంప్రోలియం 5-6 గ్రా.లు, 5 లీటర్ల నీటిలో కలిపి ఇవ్వాలి. చర్మ సంబంధ వ్యాధులు ఉన్నప్పుడు అస్కాబియాల్ చర్మంపై రాయడం లేదా ఐవర్మెక్టిన్ ఒక చుక్క చర్మం కింద సూదితో ఇవ్వాలి. గాయాలకు హిమాక్స్, లోరాక్సేన్ లాంటి క్రీములు రాయాలి. పెరిగిన గోళ్ళు, దంతాలు కత్తిరించాలి.

ఒక సంవత్సరంలో బాగా బరువు కల్గిన ఒక మగ, ఒక ఆడ కుందేలు విత్తనానికి ఎంపిక చేసి మిగతావి అమ్మువచ్చు. మెడలు వంకర తిరగటం, పిల్లల్ని తినే కుందేళ్ళు, పక్షవాతం, దొడ్డి కాళ్ళున్న కుందేళ్లను ఏరివేయాలి. ప్రతి 2-3 సంవత్సరాలకు విత్తనపు మగకుందేళ్ళు, ఆడకుందేళ్ళు వేరే ఫారాల నుంచి తెచ్చుకోవడం మేలు. పిల్లల మరణాల శాతం తగ్గి ఎదుగుదల బాగా ఉంటుంది. ఫారం లాభదాయకంగా కొనసాగుతుంది.

ఎండాకాలం నీళ్ల తొట్లలో ఎల్లప్పుడు నీరు కుందేళ్ళకు లభ్యమయ్యేలా చూడాలి. లేకపోతే ఆడకుందేళ్ళు పిల్లల్ని తినేస్తాయి. అపరిచితుల ప్రవేశం, శబ్దకాలుష్యం వల్ల కుందేళ్ళు భయాందోళనలకు గురవుతాయి.

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం.9866922336

# టి.వి. ఛానళ్ళలో ప్రత్యక్ష ప్రసారాల ద్వారా వ్యవసాయ విశ్వవిద్యాలయు శాస్త్రవేత్తలతో రైతుల ముఖాముఖి కార్యక్రమాలు

డా॥ యం. శ్రీనివాసులు, డా॥ జె.ఎస్. సుధారాణి మరియు డా॥ కె. రాజమణి
ఎలక్ట్రానిక్ మీడియా వింగ్, రాజేంద్రనగర్, హైదరాబాద్

| క్రమ సంఖ్య | తేది | అంశము | సాంకేతిక సమాచారం అందిస్తున్న శాస్త్రవేత్త పేరు, హోదా మరియు ఫోన్ నెంబర్ |
|---|---|---|---|
| | | I. డి.డి.- యాదగిరి (రైతు నేస్తం) : సాయంత్రం 6.00-7.00 | |
| 1. | 5.1.2024 | యాసంగి పంటలలో తెగుళ్ళ యాజమాన్యం | డా॥ జి. పద్మజ, శాస్త్రవేత్త (ప్లాంట్ పాథాలజి) ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, వరంగల్, 9032974787 |
| 2. | 8.1.2024 | నాసిరకం, కల్తీ విత్తనాల విక్రయాన్ని అరికట్టేందుకు చట్టపరమైన చర్యలు అవగాహన | డా॥ కె. ఝూన్సీ రాణి, ప్రొఫెసర్ & హెడ్ వ్యవసాయ కళాశాల, పొలాస, జగిత్యాల, 9246216175 |
| 3. | 15.1.2024 | యాసంగి పంటలలో సాగు యాజమాన్యం | డా॥ ఆర్. ఉమా రెడ్డి, సహ పరిశోధన సంచాలకులు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, వరంగల్ 9989625223 |
| 4. | 19.1.2024 | యాసంగి వరిలో ఎరువుల యాజమాన్యం | డా॥ టి. ప్రభాకర్ రెడ్డి, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ కృషి విజ్ఞాన కేంద్రం, నాగర్ కర్నూల్, 9848774820 |
| 5. | 22.1.2024 | వేసవికి అనువైన నువ్వుల రకాలు- సాగు యాజమాన్యం | డా॥ డి. పద్మజ, శాస్త్రవేత్త (ప్లాంట్ బ్రీడింగ్) ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, జగిత్యాల, 9959306929 |
| 6. | 24.1.2024 | యాసంగి పంటలలో పురుగుల యాజమాన్యం | డా॥ బి. దిలీప్ కుమార్, కోఆర్డినేటర్ ఏరువాక కేంద్రం, వరంగల్, 9100253305 |

II. టి-శాట్ (రైతు మిత్ర): సాయంత్రం 4.00-5.00

| | | | |
|---|---|---|---|
| 1. | 8-01-24 | వేసవి కూరగాయల సాగు - మెళకువలు | కె. సరిత, శాస్త్రవేత్త (ఉద్యాన శాస్త్రం) ఏరువాక కేంద్రం, జోగిపేట, 8074151952 |
| 2. | 15-01-24 | జీరోటిల్లేజి పద్ధతిలో మొక్కజొన్న సాగు | డా॥ సి.హెచ్. భరత్ భూషన్ రావు, ప్రధాన శాస్త్రవేత్త (అగ్రో) & కోఆర్డినేటర్, ఏరువాక కేంద్రం, పాలెం, 8328273535 |
| 3. | 22-01-24 | వరి మరియు చెఱకు పంటలో ప్రస్తుతం తీసుకోవలసిన సస్యరక్షణ చర్యలు | యమ్. సాయి చరణ్, శాస్త్రవేత్త (కీటక శాస్త్రం) ఆర్.యస్ & ఆర్.ఆర్.యస్, రుద్రూరు, 8919798959 |
| 4. | 29-01-24 | యాసంగి నూనె గింజల పంటల్లో ఎరువుల యాజమాన్యం | డా॥ కె. రాజమణి, శాస్త్రవేత్త (యస్.యస్.ఎ.సి) ఎలక్ట్రానిక్ వింగ్, రాజేంద్రనగర్, 9441352517 |



# రైతన్నకో ప్రశ్న...

డా॥ సిహెచ్. వేణు గోపాల రెడ్డి మరియు డా॥ ఆర్. సునీత దేవి
వ్యవసాయ సమాచార ప్రసార మరియు ముద్రణాలయం, రాజేంద్రనగర్, హైదరాబాద్

**1. ప్రధాన పంటలకన్నా పురుగులు ఎక్కువగా ఆకర్షించే పంటలను ఏమంటారు?**

ఎ) ఎర పంటలు బి) కంచె పంటలు
సి) రక్షక పంటలు డి) ఏదీకాదు

**2. భారతదేశంలో క్రింద తెలిపిన ఏ సస్యరక్షణ మందులు వాడకానికి నిషేధించబడినవి?**

ఎ) డైకోఫాల్ బి) డైనోకాప్
సి) మిథోమిల్ డి) పైవన్నీ

**3. వరి నారుమడిలో చలి ప్రభావం తగ్గించి నారు ఎదుగుదలకు తీసుకోవలసిన జాగ్రత్తలు ఏవి?**

ఎ) పాలిథీన్ షీట్లతో నారుమడిని రాత్రిళ్ళు కప్పి ఉదయం వేళల్లో తీసివేయాలి
బి) రాత్రి వేళల్లో నీరు నిండుగా ఉంచి తెల్లవారు జామున తీసివేసి క్రొత్త నీరు పెట్టాలి
సి) ఎ మరియు బి డి) ఏదీకాదు

**4. కాలీఫ్లవర్ పంటలో ఆకులు పసుపుగా మారి అంచులు తెల్లబడటంతో పాటు మధ్య ఈనె కొరడా వలే మారటం వంటి లక్షణాలు ఏ ధాతు లోపం వలన కనబడుతుంది?**

ఎ) మాలిబ్డినం బి) బోరాన్
సి) జింక్ డి) నత్రజని

**5. ట్రిపుల్ సూపర్ ఫాస్ఫేట్‌లో ఎంత శాతం భాస్వరం ఉంటుంది?**

ఎ) 16% బి) 24%
సి) 48% డి) 20%

**6. ఐసిఏఆర్ ఆధ్వర్యంలోని జాతీయ ఆయిల్‌పామ్ పరిశోధన స్థానం (ఐఐఓపిఆర్) ఎక్కడ ఉన్నది?**

ఎ) రాజమండ్రి బి) పెదవేగి
సి) మైసూర్ డి) హైదరాబాద్

**7. రైజోబియం లేదా నత్రజనిని స్థిరీకరించే జీవన ఎరువును ఈ పంటలో వాడుకోవచ్చును?**

ఎ) కంది బి) శనగ
సి) సోయాచిక్కుడు డి) పైవన్నీ

**8. ఒక ఎకరా వరి పండించే నీటితో ఎన్ని ఎకరాల మొక్కజొన్నను పండించవచ్చు?**

ఎ) రెండు బి) మూడు
సి) నాలుగు డి) ఐదు

**9. టి-శాట్ టి.వి ఛానల్లో ప్రత్యేక్ష ప్రసారం ద్వారా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తల్లో రైతుల ముఖాముఖి, రైతు మిత్ర కార్యక్రమం ఏ వారం ప్రసారమవుతుంది?**

ఎ) సోమవారం బి) బుధవారం
సి) గురువారం డి) శుక్రవారం

**10. నత్రజని, భాస్వరం మరియు పొటాష్ ఆహార పంటలకు ఏ నిష్పత్తిలో వాడాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు?**

ఎ) 3:2:1 బి) 4:2:1
సి) 4:2:2 డి) ఏదీకాదు

పై ప్రశ్నలకు సమాధానాలు 50వ పేజీలో చూడవచ్చు




## డా॥ బి.ఆర్. అంబేడ్కర్‌కు ఘనంగా నివాళులు

భారత రాజ్యాంగ నిర్మాత డా॥ బి.ఆర్. అంబేడ్కర్ 67వ వర్ధంతిని విశ్వవిద్యాలయ పరిపాలనా భవనంలో డిసెంబర్ 6న నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డా॥ బి.ఆర్. అంబేడ్కర్ చిత్రపటానికి రిజిస్ట్రార్ డా॥ ఎం. వెంకట రమణ పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు. అలాగే విశ్వవిద్యాలయం పరిధిలోని అన్ని కేంద్రాల వద్ద అంబేడ్కర్‌కు ఘనంగా నివాళులర్పించారు.

## ఘనంగా నిర్వహించిన వ్యవసాయ విద్యా దినోత్సవం

భారత తొలి రాష్ట్రపతి మరియు మొదటి వ్యవసాయశాఖ మంత్రి డా॥ బాబూ రాజేంద్రప్రసాద్ జయంతిని పురస్కరించుకొని వ్యవసాయ విద్యా దినోత్సవాన్ని డిసెంబర్ 3న వర్సిటీలో ఘనంగా నిర్వహించారు. వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్‌లో వ్యవసాయ విద్య, పరిశోధన రంగాల్లో సాధించిన ప్రగతిని వివరిస్తూ ఏర్పాటు చేసిన ప్రదర్శనను విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు మరియు పాఠశాల విద్యార్థులు ప్రారంభించి స్టాల్స్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్‌లోని వివిధ పాఠశాలల నుండి సుమారు 1600 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే విశ్వవిద్యాలయం పరిధిలోని అన్ని వ్యవసాయ కళాశాలల్లో కూడా వ్యవసాయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

## తేనెటీగల పెంపకం పై శిక్షణ కార్యక్రమం

అఖిల భారత సకశేరుక చీడల యాజమాన్య విభాగం ఆధ్వర్యంలో నేషనల్ బీ కీపింగ్ మరియు హనీ మిషన్లో భాగంగా డిసెంబర్ 10-16 వరకు రాజేంద్రనగర్‌లో రైతు శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డా॥ ఎం. వెంకట రమణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ వ్యవసాయంలో తేనెటీగల పాత్ర వాటి సంరక్షణపై వివరిస్తూ రైతులు తేనెటీగల పెంపకాన్ని వ్యాపార దృక్పథంతో చేస్కోవడం వలన మంచి లాభాలు గడించవచ్చన్నారు. డా॥ యస్.జె. రెహమాన్, ప్రొఫెసర్ & యూనివర్సిటీ హెడ్ (ఎంటమాలజీ) మాట్లాడుతూ రైతులు వ్యవసాయంతో పాటు తేనెటీగలు పెంపకం చేపట్టి అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. డా॥ వి. రవీందర్ రెడ్డి, ప్రధాన శాస్త్రవేత్త & హెడ్ మాట్లాడుతూ తేనెటీగలు పంటలలో పరపరాగ సంపర్కం చేయడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయని తద్వారా దిగుబడులు పెరుగుతాయని అన్నారు.

ముగింపు కార్యక్రమానికి విశ్వవిద్యాలయ డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డా॥ జెల్లా సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై వ్యవసాయంలో తేనెటీగల పాత్ర వాటి సంరక్షణ గురించి వివరించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు ఇంకా ఎక్కువగా నిర్వహించడం ద్వారా రైతులు తేనెటీగల పెంపకం చేపట్టి లాభాలు పొందుతారని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు మరియు రైతులు పాల్గొన్నారు.

## ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పాలెంలో రైతు సదస్సు

ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పాలెంలో డిసెంబర్ 21న రైతు సదస్సు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ డా॥ జి.వి. సుబ్బారెడ్డి హాజరై మాట్లాడుతూ వ్యవసాయ భూమిని బలంగా, ఆరోగ్యంగా తయారు చేసుకోవడానికి రైతులు ఎక్కువగా సేంద్రియ ఎరువులనే వినియోగించాలని సూచించారు. విశ్వవిద్యాలయ పరిశోధన సంచాలకులు డా॥ పి. రఘు రామి రెడ్డి మాట్లాడుతూ రైతులు భూసార పరీక్షలు నిర్వహించి వాటి ఆధారంగా రసాయన ఎరువులు వాడాలని, వ్యవసాయాన్ని వ్యాపార ధోరణిలో చూడాలని, అప్పుడే అధిక దిగుబడులు, లాభాలు వస్తాయన్నారు. అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రిసెర్చ్, ఆర్ఏఆర్ఎస్, పాలెం డా॥ యం. మల్లారెడ్డి మాట్లాడుతూ పంట అవశేషాలను నేలలో కలియదున్ని నేల సారాన్ని పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు మరియు రైతులు పాల్గొన్నారు.

## కంది రకం డబ్ల్యుఆర్‌జి-255 పై క్షేత్ర దినోత్సం

ఏరువాక కేంద్రం, తోర్నాల ఆధ్వర్యంలో ముంద్రాయి గ్రామంలో కంది రకం డబ్ల్యుఆర్‌జి-255 పై క్షేత్ర దినోత్సవం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పైన తెలిపిన కంది రకంను ఆశించే తెగుళ్ళు, పురుగులు మరియు వాటి నియంత్రణ కోసం అనుసరించాల్సిన పద్ధతులను మరియు ముందు జాగ్రత్త చర్యల గురించి శాస్త్రవేత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, వ్యవసాయ విస్తరణ అధికారులు మరియు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..

పి. సుధాకర్ మరియు మార్ఛ్ బాబు



# డ్రం సీడర్‌తో వరి సాగు - రైతు విజయ గాధ

**ఎస్. పల్లవి, డా॥ ఎస్. శ్రీనివాస రావు, డా॥ కె. చంద్రశేఖర్ రావు, ఎ. రాములమ్మ**
**టి. హిమబిందు మరియు ఎ. సాయి కిరణ్**
కృషి విజ్ఞాన కేంద్రం, కంపాసాగర్

వరి పంటను ఎక్కువ శాతం రైతులు నాటువేసే విధానంలో సాగు చేస్తుంటారు. అయితే గత కొన్ని సంవత్సరాలు చూసుకున్నట్లైతే వాతావరణ మార్పులు, కూలీల కొరత, పెరుగుతున్న ట్రాక్టర్ల కిరాయి, నారుమడి యాజమాన్యం, తక్కువ దిగుబడి మొదలగు కారణాల వలన వరి సాగు గిట్టుబాటు కాని పరిస్థితి ఏర్పడింది.

ఈ పరిస్థితిని అధిగమించడానికి కేతేపల్లి, నల్గొండ జిల్లాకి చెందిన ఆదర్శ రైతైన శ్రీ సదయ్య భాషా గారు కృషి విజ్ఞాన కేంద్రం, కంపాసాగర్ శాస్త్రవేత్తల సలహాల మేరకు 2018 సంవత్సరంలో ఒక ఎకరంలో డ్రంసీడర్‌తో వరిని సాగు చేసి మంచి దిగుబడులను సాధించడం జరిగింది. డ్రంసీడర్‌తో వరి సాగు ద్వారా కూలీల కొరతను అధిగమించడమేకాక పంట 10 రోజులు ముందుగా కోతకు రావడం మరియు సాగు ఖర్చు తగ్గడం మొదలగు ప్రయోజనాలు తెలుసుకున్న రైతు ఇప్పుడు డ్రంసీడర్‌ను ట్రాక్టర్‌కు బిగుంచుకొని 8 ఎకరాలలో వరి సాగు చేస్తూ మంచి లాభాలను ఆర్జిస్తున్నారు.

ఈ రైతు డ్రంసీడర్‌తో వరి సాగును గత ఐదు సంవత్సరాలుగా అవలంభిస్తున్నాడు. ఈ విధంగా సన్నగింజ రకం 6-8 కిలోలు ఉపయోగిస్తున్నారు, విత్తనం చల్లిన తర్వాత 3 రోజులలోపు కలుపు మందులు 1 లీటర్ బ్యుటాక్లోర్ మరియు 15-20 రోజుల మధ్యలో పెనోక్సులమ్ వాడుతూ సొంతంగా పవర్ వీడర్‌ను తయారు చేసుకొని సమర్ధవంతంగా కలుపును అరికట్టాడు. ఈవిధంగా మెరుగైన యాజమాన్య పద్ధతులు పాటిస్తూ ఎకరానికి 40-42 బస్తాలను దిగుబడి సాధిస్తూ సగటున 5100/- రూపాయలు పైగా ఖర్చును తగ్గించుకుంటూ ఎకరానికి 45,000/- రూపాయల నికరాదాయాన్ని పొందుతున్నాడు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవస్థాపక దినోత్సవం సెప్టెంబర్ 03, 2023న సి.ఆర్.ఐ పంప్స్ ఉత్తమ పురస్కారంతో గౌరవ రిజిస్ట్రార్ డా॥ యం.వి. రమణ గారి ఆధ్వర్యంలో అవార్డును తీసుకోవడం జరిగింది.

ఈవిధంగా సాంప్రదాయ వరి సాగు కంటే డ్రంసీడర్‌తో వరి సాగు ద్వారా అధిక లాభాలను ఆర్జిస్తూ తోటి రైతులకు ఆదర్శ ప్రాయంగా నిలిచాడు.





### దమ్ము చేయకుండా నేరుగా విత్తే వరి సాగు మరియు సాధారణ పద్ధతిలో ఆదాయ, పెట్టుబడి ఖర్చులు (ఎకరానికి)

| | | సాధారణ పద్ధతిలో వరి సాగు ఖర్చు (రూ) | దమ్ము చేయకుండా నేరుగా విత్తే వరి సాగు ఖర్చు (రూ) |
|---|---|---|---|
| 1. | ప్రధాన పొలం తయారీ | 7000 | 7000 |
| 2. | విత్తనం మోతాదు, విత్తనశుద్ధి మరియు ధర | 1200 | 650 |
| 3. | వరి నారుమడి తయ్యారి | 1000 | 0 |
| 4. | వరి విత్తటం (నాటువేయడం/నేరుగా విత్తడం) | 4000 | 400 |
| 5. | కలుపు యాజమాన్యం | 2150 | 2700 |
| 6. | ఎరువుల యాజమాన్యం | 2675 | 2675 |
| 7. | తెగుళ్ళ, పురుగుల నివారణ | 4300 | 3800 |
| 8. | పంటకోత ఖర్చు | 2000 | 2000 |
| 9. | మొత్తం సాగు ఖర్చు(రూ/ఎ) | 24,325 | 19,225 |
| 10. | పంట దిగుబడి (క్వి/ఎ) | 27 | 29 |
| 11. | మొత్తం ఆదాయం (రూ/ఎ) | 60,210 | 64,670 |
| 12. | నికరాదాయం (రూ/ఎ) | 35,885 | 45,445 |

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. **7337526313**

### గత మాసంలో పి.జె.టి.యస్.ఏ.యు వారి అగ్రికల్చర్ వీడియో - యూట్యూబ్ ఛానల్‌లో అప్‌లోడ్ చేసిన నూతన వీడియోలు

| | | |
|---|---|---|
| 1. | 08-12-2023 | పి.జె.టి.యస్.ఎ.యు వారి సాంకేతిక సహకారంతో సమగ్ర వ్యవసాయంలో రైతు విజయగాథ |
| 2. | 12-12-2023 | పండ్ల తోటలలో కలుపు యాజమాన్యం |
| 3. | 17-12-2023 | రబీ వేరుశనగ అధిక దిగుబడికి ముఖ్య సూచనలు |
| 4. | 19-12-2023 | యాసంగి వరికి ప్రత్యామ్నాయ పంటలు |
| 5. | 21-12-2023 | చలి నుండి యాసంగి వరి నారుమడిని కాపాడుకుందాం |
| 6. | 21-12-2023 | అధిక దిగుబడి సాధిస్తున్న మహిళా రైతు విజయగాథ |
| | | **YouTube (Shorts)** |
| 7. | 01-12-2023 | యాసంగికి అనువైన సన్నగింజ వరి రకాలు |
| 8. | 12-12-2023 | పండ్ల తోటలలో కలుపు యాజమాన్యం |
| 9. | 16-12-2023 | యాసంగి వరి నారుమడికి ప్రత్యేక యాజమాన్య పద్ధతులు |
| 10. | 18-12-2023 | పి.జె.టి.యస్.ఎ.యు వారి సాంకేతిక సహకారంతో సమగ్ర వ్యవసాయంలో రైతు విజయగాథ |
| 11. | 21-12-2023 | అధిక దిగుబడి సాధిస్తున్న మహిళా రైతు విజయగాథ |

**మరింత సమాచారం కోసం ఈ క్రింది లింక్‌ను క్లిక్ చేసి సబ్‌స్క్రైబ్ చేసుకోగలరు**

https://www.youtube.com/channel/UCXPH9Z_h47zxJqrV7svmFKg

**47వ పేజీలోని ప్రశ్నలకు సమాధానాలు :1. ఎ 2. డి 3. సి 4. ఎ 5. సి 6. బి 7. డి 8. ఎ 9. ఎ 10. బి**

# ప్రొద్దుతిరుగుడులో తాలు గింజల సమస్యను అధిగమించడం ఎలా?

బి. శ్రీలక్ష్మి, డా॥ టి. అంజయ్య, ఎన్. స్వప్న, పి. విజయ్ కుమార్, డా॥ బి. రాజ్ కుమార్,
డా॥. ఎం. శ్వేత మరియు ఎల్. సంజయ్య
కృషి విజ్ఞాన కేంద్రం, రుద్రూర్, నిజామాబాద్




1. పువ్వు సైజు మధ్యస్థంగా ఉండే రకాలను ఎంచుకోవడం.
2. విత్తనం వేసిన 10–15 రోజులలోపు కుదురుకు ఒకే మొక్క ఉండేలా చేయటం
3. సకాలంలో సిఫారసు చేసిన ఎరువులను, సూక్ష్మ పోషకాలను పంటకు అందించడం.
4. కీలక దశలలో (పువ్వు వికసించు మరియు గింజ కట్టే దశలలో) నీటి తడులు ఇవ్వడం.
5. పూత గట్టిగా నిలబడేందుకు ఆకర్షణ పత్రాలు వికసించే దశలో ఒక లీటరు నీటికి 2 గ్రా. బోరాక్స్‌ని కలిపి పిచికారి చేయడం.
6. పంటలో పరపరాగ సంపర్కం జరిగే విధంగా తేనెటీగల సంఖ్యను పెంచడం.
7. తేనెటీగల సంఖ్య పెరగడానికి పంటలో అక్కడక్కడా వెర్రి నువ్వులు లేదా ఆవాలను విత్తుకోవడం.
8. పూత సమయంలో క్రిమి సంహారక మందులు పిచికారి చేయకుండా ఉండటం (ముఖ్యంగా ఉదయం 8–10 గంటల సమయంలో).

RNI No : TELTEL/2015/60296 January, 2024
Total No. of Pages : 52

Postal Regd.No:HSE/1013/2024-2026
Date of Publication : 06.01.2024
Date of Posting : 09.01.2024







డ్రోన్‌ని ఉపయోగించి దమ్ము చేసిన పొలంలో నేరుగా విత్తే పద్ధతిపై
ప్రయోగాత్మక పరిశోధనలు చేస్తున్న విశ్వవిద్యాలయం

*Striving for a greener tomorrow...*

ముద్రణ మరియు ప్రచురణ : ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం

Printed and Published by Dr. Ch. Venu Gopala Reddy on behalf of Professor Jayashankar Telangana State Agricultural University,
Owned by Professor Jayashankar Telangana State Agricultural University,
Printed At : PJTSAU Press, ARI Campus, Rajendranagar, Ranga Reddy (Dist.), Hyderabad, Telangana State
Published From : Professor Jayashankar Telangana State Agricultural University, ARI Campus, Rajendranagar, Ranga Reddy (Dist.), Hyderabad, Telangana State
Editor : Dr. Ch. Venu Gopala Reddy, RNI File No. 1262077, Title-Code : TELTEL00152